Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
epaper.vaartha.com WWW.VAARTHA.COM
23-9-2026 బుధవారం సంపుటి: 32
సంచిక: 234 పేజీలు: 10+4 వెల: 6.50
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
హైదరాబాద్

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ
: fb.com/vaartha Digital


ఆసియా గేమ్స్‌లో స్వర్ణం గెలిచిన టీమిండియా మహిళల జట్టు

## ఆసియా గేమ్స్‌లో భారత్‌కు స్వర్ణం

ఆట లో

**టి20 మహిళా క్రికెట్ విజేతగా టీమిండియా**

**ఫైనల్‌లో శ్రీలంకపై ఘనవిజయం**

**క్రికెటర్లకు రాష్ట్రపతి, ప్రధాని అభినందనలు**

ఆసియా గేమ్స్ మహిళల క్రికెట్‌లో టీమిండియా అదరగొట్టింది. టి20 ఫైనల్‌లో శ్రీలంకను మట్టికరింపించి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన భారత్ 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేయగా, శ్రీలంక 15.4 ఓవర్లలో 69 పరుగులకే ఆలౌటైంది.




## స్మృతి మంధాన వరల్డ్ రికార్డు

**11వేల పరుగుల క్లబ్‌లోకి భారత్ స్టార్ బ్యాటర్**

మహిళల అంతర్జాతీయ క్రికెట్‌లో ఇదే తొలిసారి

2

# కుండపోత

## హైదరాబాద్, పలు జిల్లాల్లో ముంచెత్తిన భారీ వర్షం

**తెలంగాణలో ఆరెంజ్ అలర్ట్ జారీ**

**ఉరుములు, పిడుగులతో వాతావరణం భయానకం**

**పెద్దపల్లి జిల్లాలో పిడుగు పాటుకు 25 గొర్రెలు మృతి**

**అధికారులను అప్రమత్తం చేసిన సిఎం రేవంత్**


సికింద్రాబాద్‌లో మంగళవారం రాత్రి భారీ వర్షంలో పరిశీలిస్తున్న 'హైడ్రా' రంగనాథ్





**హైదరాబాద్,సెప్టెంబరు 22,ప్రభాతవార్త:** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండ ప్రభావంతో తెలంగాణలో అనేక చోట్ల అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో పిడుగుల భారీ వర్షం మంగళవారం కురిసింది. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలం కొలనూరు గ్రామంలో మధ్యాహ్నం పిడుగుపాటుకు గుర్రై రైతు జంగ సుధాకర్‌రెడ్డి (65) మృతిచెందాడు. పెద్దపల్లి మండలం మూలసాల గ్రామంలో పిడుగు పాటుకు బోయిని సదయ్య, కాసు నరేష్‌లకు చెందిన 25 గొర్రెలు మృతి చెందాయి.పెద్దపల్లిజిల్లా పాలకుర్తి మండలం ఈసాల తక్కళ్ళ పల్లిలో 4.3 సెం.మీవర్షం నమోదైంది.పిడుగులు పడిన పెద్దపల్లి, ఓదెల మండలంలో తేలికపాటివర్షం 9.మి.మి కురిసిందని జిల్లా ముఖ్యప్రణాళికాధికారి గంపరవి తెలిపారు.మరోవైపు రాష్ట్రరాజధాని హైదరాబాద్ భారీవర్షంతో తడిసి ముద్దైనది. వర్షాల దృష్ట్యా అధికారులను సిఎం రేవంత్ రెడ్డి అప్రమత్తం చేశారు పెద్దపల్లి జిల్లాతోపాటు భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం ఖమ్మం, జిల్లాలో పలు మండ లాలు గ్రామాలలోవర్షం కురిసింది, వర్షంతోరోడ్లన్ని జలమయం అవడంతో ట్రాఫిక్‌తో ఇబ్బందులు పడ్డారు.హైదరాబాద్ నగరంలో పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులతో పాటు ఈదురుగాలులు వీస్తుండటంతో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. సికింద్రాబాద్, ఖైరతాబాద్, చార్మినార్, చంద్రాయ ణగుట్ట ప్రాంతాలతో పాటు నగరంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురిసింది. హిమాయత్‌నగర్ విఠల్‌వాడీ3.2సెం.మి అత్యధిక వర్షాపాతం నమోదైంది.కూకట్‌పల్లిలో 2.8సెం.మి,ముషీరాబాద్‌లో 2.5సెం.మి అబ్దుల్లాపూర్‌మెట్‌లో 2.3సె.మి రాత్రి ఎనిమిది గంటల వరకు నమోదైంది.షేక్‌పేటలో

>>2

### దళితులు, గిరిజనులకు

# పథకాల్లో పెద్దపీట

**ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితులకు సత్వర న్యాయం**

**విజిలెన్స్ కమిటీల భేటీలు సక్రమంగా జరగాలి**

**ఉన్నత కమిటీ సమీక్షలో సిఎం రేవంత్**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,సెప్టెంబరు22:** దళితులు, గిరిజనులు, ఆదివాసీల అభి వృద్ధే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విద్య, ఉపాధి, నైపుణ్యాభివృద్ధి ద్వారానే సమాజంలో మార్పు వస్తుందని, ఎస్సీ ఎస్టీలపై అణిచివేతను అధిగమించేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పని చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్‌సీ, ఎస్‌టీ అత్యాచారాల నిరోధక చట్టం-1989 అమలుపై రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. రాష్ట్రంలో చట్టం అమలు, నమోదైన కేసులు, దర్యాప్తు పురోగతి, న్యాయస్థానాల్లో విచారణ, కేసుల పరిష్కారం, బాధితులకు అందుతున్న ఆర్థిక సహాయం, పునరావాస చర్యలను ముఖ్యమంత్రి సమీక్షించారు. కేసుల విచారణ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానాలు, మొబైల్ కోర్టుల పనితీరుతో పాటు చట్టంపై

>>2

**దసరా కానుకగా కొత్త పెన్షన్లు: మంత్రి సీతక్క** 2


మంగళవారం డా. నోరి లక్ష్మీ భాస్కర్ ఇంట్లో ఎసిబి సోదాలు దృశ్యం

## నిమ్స్ అధికారి చేతిలో 100 కోట్ల అక్రమాస్తులు!

ఎసిబి వలలో పడిన అదనపు సూపరింటెండెంట్ లక్ష్మీభాస్కర్

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** ఎసిబికి మరో బడా అవినీతి అధి కారి పట్టుబడ్డాడు. సర్కారీ విభాగాల్లో ఉన్నత హోదాలో పనిచే స్తూ పదుల కోట్ల రూపాయల నుంచి వందల కోట్ల రూపాయల

>>2


వరంగల్ ఎంజిఎం వద్ద వినయ్ భాస్కర్‌ను తరలిస్తున్న పోలీసులు

## ఎంజిఎంలో మళ్లీ ఊడిపడిన శ్లాబ్ పెచ్చులు

**పోలీస్ పహారాలో ఎంజిఎం ఆసుపత్రి!**

తోపులాటలో గాయపడిన మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్

**వరంగల్ సిటీ సెప్టెంబర్ 22 ప్రభాతవార్త:** పేదలకు పెద్దదిక్కుగా ఉన్న ఎంజిఎం ఆసుపత్రిలో జరుగుతున్న వరుస ఘటనలను

>>2

## టాంక్‌బండ్‌పై గణేశ నిమజ్జనాలకు ఓకే

భాగ్యనగర్ గణేశ ఉత్సవ సమితి ఆందోళనతో దిగివచ్చిన సర్కార్

**హైదరాబాద్ (ముషీరాబాద్), సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** ట్యాంక్‌బండ్ పైన హుస్సే న్‌సాగర్‌లో నిమజ్జనాలకు సర్వం సిద్ధంఅయింది.ముందు హుస్సే న్‌సాగర్‌లో నిమజ్జనాలకు అనుమతి



లేదని అటు జీహెచ్ఎంసీ, పోలీసులు బారికేడ్లు అడ్డుగా ఏర్పాటుచేసి, నిమ జ్జనాలకు అనుమతించక పోయినప్ప టికీ, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి నేతలు చేసిన ఆందోళనతో ప్రభుత్వం, అధికారులు

>>2

# జూరాలకు కర్ణాటక నీరు!



మంగళవారం బెంగళూరులో కన్నడ సిఎం డికె శివకుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న మంత్రులు జూపల్లి, వాకిటి తదితరులు

**5 వేల క్యూసెక్కుల నీరు నెల రోజులు విడుదల చేయండి: కన్నడి సిఎం డికెను కోరిన**

**తెలంగాణ మంత్రులు జూపల్లి, వాకిటి**

**బెంగళూరులో డికెతో మంత్రుల భేటీ**

**ఫోన్‌లో మాట్లాడిన సిఎం రేవంత్**

**సానుకూలంగా స్పందించిన సిఎం డికె**

**హైదరాబాద్,సెప్టెంబరు22,ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో సాగు,తాగు నీటి సమస్యను తీర్చేందుకు జూరాల ప్రాజెక్టుకు కర్ణాటక నుంచి కృష్ణా జలాలను రప్పించేందుకు తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర ప్రయత్నాలు చేస్తుంది. దక్షిణ తెలంగాణలోని రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కృష్ణా నది నుంచి సాగునీటిని విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్ రెడ్డిల బృందం మంగళవారం రాత్రి బెంగుళూరులో కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌తో భేటీ అయ్యింది,ప్రస్తుతం జూరాల, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ఆయకట్టు పరిధిలో పంటలు కీలక దశలో ఉన్నందున, వాటిని కాపాడేందుకు కర్ణాటక నుంచి కృష్ణా జలాలను విడుదల చేయాల్సిన అవసరాన్ని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ దృష్టికి తెలంగాణ ప్రతినిధి బృందం తీసుకెళ్లింది.ఈ నాలుగు సాగునీటి పథకాల కింద దాదాపు 5.5 లక్షల ఎకరాల ఆయకట్టు ఉందని, ఈ ప్రాంతాల్లో వేలాది రైతు కుటుంబాలు వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నాయని వివరించారు. ప్రస్తుత దశలో నీటి కొరత ఏర్పడితే పంట దిగుబడులతో పాటు రైతుల ఆదాయం,జీవనోపాధిపై ప్రభావం పడే అవకాశం ఉందని తెలిపారు, ప్రస్తుత పంటలను కాపాడేందుకు కృష్ణా నది నుంచి 5,000 క్యూసెక్కుల నీటిని నిరంత రాయంగా ఒక నెల రోజుల పాటు విడుదల చేయాలని కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను మంత్రులు, ఎమ్మెల్యేల బృందం కోరింది. ఈ నీటితో కీలక దశలో ఉన్న పంటలకు సకాలంలో సాగునీరు అందించి రైతులను ఆదుకోవచ్చని వివరించింది,మిగిలిన రుతుపవన కాలంలో కృష్ణా పరివాహక ప్రాంతంలో మరిన్ని వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున, ప్రస్తుతం నియంత్రిత పద్ధతిలో నీటిని విడుదల చేస్తే అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియో గించుకోవచ్చని ప్రతినిధి బృందం వివరించింది.రైతుల పంటలు, వారి జీవనో పాధిని కాపాడటమే ప్రధాన లక్ష్యంగా కర్ణాటక ముఖ్యమంత్రితో ఈ భేటీ జరిగింది. పొరుగు రాష్ట్రాల మధ్య సహకార స్ఫూర్తితో కర్ణాటక

>>2


ఆదిలాబాద్ రిమ్స్ నుంచి శిశువులను తరలిస్తున్న కుటుంబీకులు, సిబ్బంది

### రిమ్స్ అగ్నిప్రమాదంపై

# సమగ్ర విచారణ

**దుర్ఘటనలో ముగ్గురు శిశువులు మృతి**

**ఎలక్ట్రికల్, ఫైర్, సివిల్ స్ట్రక్చర్ సేఫ్టీ ఆడిట్‌లు నిర్వహించాలి**

**రిమ్స్‌ను 950 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తాం**

**ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహా**


ఆదిలాబాద్ రిమ్స్‌లో ప్రమాదం జరిగిన వార్డును పరిశీలిస్తున్న మంత్రి దామోదర

**అదిలాబాద్ ప్రతినిధి, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త:** ఆదిలాబాద్‌లోని రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) ఆస్పత్రిలోని ప్రత్యేక నవజాత శిశు సంరక్షణ విభాగంలో సోమవారం అర్థ రాత్రి జరిగిన అగ్నిప్రమాద ఘటనపై రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.మంగళవారం రిమ్స్ ఆస్పత్రిని సందర్శించిన మంత్రి, అగ్నిప్రమాదం జరిగిన నవజాత శిశు వార్డును పరిశీలించారు. ప్రమాద సమయంలో చేపట్టిన సహాయక చర్యలు, చిన్నారుల ప్రస్తుత వైద్య పరిస్థితి, చికిత్స అందుతున్న విధానం, తీసుకున్న తక్షణ చర్యలపై

>>2


కేవడియాలో అనంత్‌నాగ్‌కు 'ఫాల్కే' పురస్కారం అందజేస్తున్న రాష్ట్రపతి ముర్ము

## అనంత్ నాగ్‌కు 'ఫాల్కే' ప్రదానం

**ఏక్తా నగర్ (కేవడియా), సెప్టెంబరు 22:** భారతీయ సినిమా దేశంలోని భిన్న భాషలు, సంప్రదాయాలు, ఆకాంక్షలు, ప్రజల పోరాటాలను ప్రతి బింబిస్తుందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మంగళవారం గుజ రాత్‌లోని ఏక్తానగర్లో 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదా నోత్సవం ఘనంగా జరిగింది. జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్ర మానికి ఏక్తా నగర్‌ను వేదికగా ఎంపిక చేయడం భారతదేశ సాంస్క ృతిక, జాతీయ ఐక్యతకు ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్రపతి పేర్కొన్నారు. సృజనాత్మక రంగంలో పనిచేస్తున్న కార్మికులు, చిన్న కళాకారులు, సహాయకులు, అవకాశాల కోసం

>>2

**ఉత్తమ నటుడు మమ్ముట్టి, ఉత్తమ నటి యామి గౌతమ్‌కు పురస్కారాలు అందించిన రాష్ట్రపతి ముర్ము**

కేవడియాలో ఘనంగా 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం







కన్యాకుమారి నుంచి కార్గిల్ వరకు ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ చేపట్టిన సైకిల్ యాత్ర మంగళవారం న్యూఢిల్లీలోని ఇండియా గేట్ వద్దకు చేరుకున్న దృశ్యం

## దసరా కానుకగా కొత్త పెన్షన్లు: మంత్రి సీతక్క

**హైదరాబాద్,సెప్టెంబరు22,ప్రభాతవార్త:** దసరా పండుగకు ముందే కొత్త పెన్షన్లు లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అక్టోబర్‌లో కొత్త పెన్షన్ల ప్రారంభానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. క్షేత్రస్థాయి వెరిఫికేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని, అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించాలని మంత్రి ఆదేశించారు. ఈ మేరకు సెర్ప్ సీఈఓ దివ్యా దేవరాజన్‌కు ఆదేశాలు జారీ చేశారు. పూర్తి స్థాయిలో ఒంటరి మహిళలు, వితంతువులకు పెన్షన్లు అందించాలని, పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ పెన్షన్లు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు. దసరా నాటికి కొత్త పెన్షన్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా చూస్తామని మంత్రి సీతక్క తెలిపారు.

## జూరాలకు కర్ణాటక నీరు!

>> ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని తెలంగాణ మంత్రులు, ఎమ్మెల్యేలు కోరారు. మంత్రులు చేసిన విజ్ఞప్తికి కర్ణాటక సీఎం డీకే శివకుమార్ సానుకూలంగా స్పందించారు. మంగళవారం సచివాలయం నుంచి ఫోన్‌లో మాట్లాడిన రేవంత్‌రెడ్డి.. జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులను ఆయనకు వివరించారు. దీనిపై శివకుమార్ సానుకూలంగా స్పందించినట్లు సమాచారం.

## 100 కోట్ల అక్రమాస్తులు!

>> ఆస్తులను సంపాదించిన వారిని ఎసిబి టార్గెట్ చేయడం తెలిసిందే. ఈ క్రమం లో ఇప్పటికే అనేక మంది పట్టుబడగా తాజాగా నిమ్స్‌లో అదనపు మెడికల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నోరి లక్ష్మీ భాస్కర్ (56)ను ప ట్టుకున్నారు. నిమ్స్‌లో 20 ఏళ్లకు పైగా వివిద హోదాలో పనిచేస్తూ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ స్థాయికి ఎదిగిన లక్ష్మీ భాస్కర్‌పై చా లాకాలంగా అవినీతి ఆరోపణలు వున్నాయి. కరోనా సమయంలో ఆసుపత్రిలో రోగులకు అందజేయాల్సిన కిట్‌ల గోల్‌మాల్ జరిగిందని అప్పట్లో ఆరోపణలు వచ్చాయి. ఇందులో కోట్ల రూపాయలు చేతులు మారిందని అభియో గాలు వచ్చాయి. ఇందులో లక్ష్మీ భాస్కర్ హస్తం వుందని వార్త లు వచ్చాయి. దీంతో పాటు నిమ్స్‌లో కీలక హోదాలో వున్న ఆయన తన పలుకుబడితో అనేక విభాగాల్లో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఎసి బికి సమాచారం అందింది. ఈ సమాచారం మేరకు పక్కాగా వ్యవహ రించిన ఎసిబి అధికారులు మంగళవారం ఉదయం ఆరు గంటల సమయ ంలో ఎర్రగడ్డలోని కాలపాతరు అపార్ట్‌మెంట్‌లోని ఆయన ఇంటికి ఎసిబి అధికారులు వచ్చారు. ఇదే సమయంలో నిమ్స్‌లోని ఆయన కార్యాల యంలోనూ, బంధువుల ఇళ్లలోనూ సోదాలు జరిపారు. ఎసిబి అధికారుల సోదాల్లో కూకట్‌పల్లిలో ఉన్నతవర్గాలు వుండేచోట రెండు అధునాతన ప్లాట్లు, మణికొండ, పేట్‌బషీరాబాద్, కూకట్‌పల్లిలో ఐదు డబుల్‌బెడ్ రూం ప్లాట్లు, యాదాద్రి, నందిగామ, షామీర్‌పేట్‌లో నాలుగు ఓపెన్ ప్లా ట్లు. వైజాగ్‌లో ఖరీదైన ప్రాంతంలో 800 చదరపు గజాల ప్లాట్, 41 లక్షల రూపాయల బ్యాంకు బ్యాలెన్స్ వెలుగు చూసింది. దీంతో పాటు పోస్ట్ ఆఫీస్‌లో 12 లక్షల రూపాయల ఎఫ్‌డిలు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల్లో 35 లక్షల రూపాయల పెట్టుబడులు, మ్యూచ్‌వల్ ఫండ్స్‌లో 29 లక్షల 55 రూపాయల పెట్టుబడులు, 517.8 గ్రాముల బంగారు నగలు, మూడు ఖరీదైన కార్లు, నాలుగు ద్విచక్ర వాహనాలు లభ్యమయ్యాయి . లక్ష్మీ భాస్కర్ ఇంట్లో పట్టుబడ్డ అక్రమాస్తుల విలువ ఆరు కోట్ల 13 లక్షల రూపాయలుగా తేలింది. ఈ ఆస్తులే కాకుండా లక్ష్మీ భాస్కర్ డిఆర్ టి కోర్టులో వివాదంలో వున్న ఓ ఆస్తి కోసం కోటి 30 లక్షల రూపాయలు పెట్టుబడిగా పెట్టినట్లు తనకు తెలిసిన వారికి కోటీ 33 లక్షల రూపాయలు చేబదులు ఇచ్చినట్లు ఎసిబి గుర్తించింది. లక్ష్మీ భాస్కర్ వద్ద లభించిన అక్రమాస్తుల విలువ బహిరంగ మార్కెట్లో ఈ ఆస్తులు వంద కోట్ల రూపాయలకు పైగానే వుంటుందని అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో లక్ష్మీ భాస్కర్‌ను అరెస్టు చేసిన ఎసిబి అధికారులు నాంపల్లి లోని ఎసిబి కార్యాలయానికి తరలించారు. కాగా సర్కారీ విభాగాల్లో అక్రమార్కుల గురించి వెంటనే 1064కు ఫోన్ చేసి సమాచారం అందిం చాలని ఎసిబి డిజి చారు సిన్హా కోరారు.

## గణేశ నిమజ్జనాలకు ఓకే

>> దిగివచ్చి, నిమజ్జనాలు యధాప్రకారం ట్యాంక్‌బండ్‌పై నిర్వహించుకునేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ట్యాంక్‌బండ్‌పై ఈనెల 25న జరగబోయే గణేష్ నిమజ్జనాలకు ప్రజలు లక్షలాదిగా తరలి వస్తారని, ప్రభుత్వం కూడా పాఠశాలలకు, కళాశాలలకు ఆరోజు సెలవు దినంగా ప్రకటించే విషయం తెలిసినదే. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని శాఖల సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. కాగా వీఎస్టీ, చిక్కడపల్లి, ముషీరాబాద్ తదితర ప్రాంతాల నుంచి నిమజ్జనానికి వచ్చే వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు ట్యాంక్‌బండ్‌పై 12 క్రేన్‌లను ఏర్పాటుచేశారు. అదే విధంగా ఎన్టీఆర్ స్టేడియంలో బేబీ పాండ్స్ ద్వారా నాలుగు అడుగుల ఎత్తు వరకు ఉండే విగ్రహాలను నిమజ్జనం చేసుకునేందుకు వినాయక చవితి పండుగ రోజునుంచే ఏర్పాటు చేసిన విషయం తెలిసినదే. నాలుగు అడుగుల వరకు ఉన్న విగ్రహాలను ఎన్టీఆర్ స్టేడియంలో తాత్కాలికంగా ఏర్పాటుచేసిన బేబీ పాండ్స్‌లో, ఐదు అడుగులకు పైగా ఉన్న విగ్రహాలను ట్యాంక్‌బండ్‌లో నిమజ్జనం చేసే విధంగా జీహెచ్‌ఎంసీ అధికారులు, పోలీసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలుగకుండా ఔట్‌సైడ్ ఫోర్స్ 268 పోలీసులను నిమజ్జనాలకు ప్రత్యేకంగా ట్యాంక్‌బండ్‌పై విధులు నిర్వహించటానికి పోలీస్‌శాఖ తాత్కాలికంగా నియమించినట్లు దోమలగూడ సీఐ అంజద్ అలీ తెలిపారు.

## స్మృతి మంధాన వరల్డ్ రికార్డు

### 11వేల పరుగుల క్లబ్‌లోకి భారత్ స్టార్ బ్యాటర్

**నిషిన్, సెప్టెంబరు 22:** భారత స్టార్ బ్యాటర్, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన మరో అరుదైన ఘనత సాధించింది. అంతర్జాతీయ క్రికెట్‌లో 11,000 పరుగులు పూర్తి చేసిన తొలి మహిళా క్రికెటర్‌గా చరిత్ర సృష్టించింది. మహిళల క్రికెట్‌లో ఇప్పటివరకు ఏ బ్యాటర్ కూడా ఈ మైలురాయిని అందుకోలేదు. ఏసియన్ గేమ్స్ 2026 ఫైనల్లో శ్రీలంకతో



జరిగిన మ్యాచ్‌లో 13 పరుగులు చేయడంతో అంతర్జాతీయ క్రికెట్‌లో 11 వేల పరుగులు పూర్తి చేసింది. టెస్టుల్లో 788, వన్డేల్లో 5411, టీ20ల్లో 4788 పరుగులు స్మృతి చేసింది. స్మృతి మంధాన ఈ యేడాదిలో రికార్డులు కొల్లగొడుతోంది. ఇటీవల ముగిసిన మహిళల ఆసియా కప్ 2026లో మాజీ భారత కెప్టెన్ మిథాలీ రాజ్ పేరిట ఉన్న 10,868 అంతర్జాతీయ పరుగుల రికార్డును అధిగమించింది. దీంతో మహిళల క్రికెట్‌లో మూడు ఫార్మాట్లలో కలిపి అత్యధిక అంతర్జాతీయ పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలిచింది. అంతేకాదు ఇటీవలే టి20 అంతర్జాతీయ క్రికెట్‌లోనూ మంధాన అరుదైన రికార్డు సాధించింది. పురుషులు, మహిళల క్రికెట్‌ను కలిపి టి20ల్లో అత్యధిక పరుగులు చేసిన న్యూజిలాండ్ మాజీ స్టార్ సుజీ బేట్స్ రికార్డును అధిగమించింది. ఏసియన్ గేమ్స్ సెమీఫైనల్లో బంగ్లాదేశ్‌పై 37 పరుగులు చేయడంతో ఈ రికార్డును తన పేరిట లిఖించుకుంది. ఇప్పుడు 11 వేల మైలురాయిని అందుకుంది.

## అక్టోబర్ 1న రాష్ట్ర కేబినెట్ భేటీ

**హైదరాబాద్,సెప్టెంబరు22,ప్రభాతవార్త:** అక్టోబర్ 1న ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో రాష్ట్ర కేబినెట్ సమావేశం కానుంది. వివిధ కీలక అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనుంది.

## వారం - వర్జ్యం

23-09-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,
తి. ద్వాదశి రా.10.47, న.శ్రవణ ఉ.9.07
వ.మ.1.21 - మ.3.03
దు.ఉ.11.35 - మ.12.23
రాహు మ.12.00-మ.1.30,
శుభ స. లేదు

## వార్తాఫలం

**మేషం:** అకౌంట్స్ విషయంలో తగు జాగ్రత్తలు తీసుకుంటారు.రావలసిన ధనం సకాలంలో చేతికందివస్తుంది.

**వృషభం:** సహోద్యోగులు అసూయపడే విధంగా మీ పని తీరు ఉంటుంది. ఓర్పును కలిగి ఉండండి.

**మిథునం:** నిర్మాణ వ్యవహారాలలో ప్రత్యక్ష పర్యావేక్షణకు ప్రాముఖ్యతనిస్తారు. ఆధిక్యం కలిగి ఉంటారు.

**కర్కాటకం:** విదేశాలలో స్థిరపడిన ఆత్మీయ వర్గం యొక్క సహాయ సహకారాలు లభిస్తాయి. ఖర్చులు అదుపులో ఉంటాయి.

**సింహం:** నూతన వ్యాపారానికి ఏర్పడిన ప్రతిబంధకాలు తొలగిపోతాయి. ముఖ్యమైన రహస్యాలు తెలుసుకుంటారు.

**కన్య :** మీలోని కొత్త కోణం వెలుగు చూస్తుంది. లక్ష్య సాధన దిశగా పట్టుదలతో ముందుకు సాగుతారు.

**తుల:** నిరాధారమైనటువంటి పుకార్లను ఏమాత్రం నమ్మరు. కుటుంబంలో ఒకరికి నూతన ఆదాయ మార్గం లభిస్తుంది.

**వృశ్చికం:** ఊహాలోకాలకు తెరదించి వాస్తవికత ప్రామాణికగా అడుగులు ముందుకు వేస్తారు. ఓర్పును కలిగి ఉంటారు.

**ధనుస్సు:** మొండి వైఖరిని కనబరుస్తారు. ముఖ్యమైన విషయాలను ఇతరులకు అప్పగిస్తారు. నూతన వస్తు సేకరణ.

**మకరం:** ప్రయోజనాలను పదిల పరచు కోవడానికి గాను ఒదిగి ఉంటారు.సాఫ్ట్వేర్ రంగంలోని వారికి అనుకూలం.

**కుంభం:** చర్చలు ఫలవంతంగా సాగు తాయి. స్థాయికి మించి వ్యాపార వ్యవహారా లను నేర్పుగా సర్దుబాటు చేస్తారు. ధనలాభం.

**మీనం:** న్యాయ నిపుణులతో సంప్రదింపులు జరుపుతారు. వస్తువుల మరమ్మత్తుల సూచన. సెల్ఫ్ డ్రైవింగ్ జాగ్రత్తలు అవసరం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# రిమ్స్ అగ్నిప్రమాదంపై సమగ్ర విచారణ

>> జిల్లా కలెక్టర్ రాజర్షి షా, రిమ్స్ అధికారులు, వైద్యులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం రిమ్స్ డైరెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్, వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారులు, రిమ్స్ వైద్యులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ, సోమవారం రాత్రి సుమారు 11.40 గంటల సమయంలో రిమ్స్‌లోని నవజాత శిశు వార్డులో అగ్నిప్రమాదం సంభవించిందన్నారు. ప్రాథమిక విచారణలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఏసీ యూనిట్‌లో మంటలు చెలరేగి, ఏసీకి సంబంధించిన ప్లాస్టిక్ భాగాలు కాలిపోవడంతో దట్టమైన పొగ వ్యాపించినట్లు అధికారులు గుర్తించారని తెలిపారు. అయితే ప్రమాదానికి ఖచ్చితమైన కారణాలు, భద్రతా ప్రమాణాల అమలులో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలపై సమగ్ర విచారణ అనంతరం పూర్తి స్పష్టత వస్తుందని చెప్పారు.ప్రమాదం జరిగిన వెంటనే రిమ్స్ సిబ్బంది, జిల్లా యంత్రాంగం, అగ్నిమాపక, పోలీసు శాఖలు సమన్వయంతో స్పందించి, చికిత్స పొందుతున్న నవజాత శిశువులను సురక్షి త ప్రాంతాలకు తరలించేందుకు తక్షణ చర్యలు చేపట్టాయని మంత్రి తెలిపారు. విద్యుత్ సరఫరాను నిలిపివేసి, ప్రభావిత చిన్నారులకు అత్యవసర వైద్య సేవలు అందించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటనలో ముగ్గురు నవజాత శిశువులు మృతి చెందడం బాధాకరమని మంత్రి తెలిపారు. ప్రభావిత చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షి స్తున్నామని చెప్పారు. అవసరమైన చోట స్థానిక ప్రైవేట్ ఆస్పత్రుల సహకారాన్ని కూడా తీసుకున్నట్లు వెల్లడించారు.రిమ్స్‌లో మాతా, శిశు సంరక్షణ సేవలను మరింత బలోపేతం చేసేందుకు 150 పడకల మదర్ అండ్ చైల్డ్ హెల్త్ భవనాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. దీనివల్ల ప్రసూతి సేవలు, తల్లుల సంరక్షణ, నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అదనపు సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు.ప్రస్తుతం రిమ్స్‌లో సుమారు 800 పడకలు ఉన్నాయని, అదనంగా 150 పడకల ఎంసిఎచ్ భవనం ఏర్పాటు చేయడం ద్వారా రిమ్స్‌ను సుమారు 950 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు రిమ్స్‌లో పలు కొత్త విభాగాలను ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి వెల్లడించారు. థలసేమియా, సికిల్‌సెల్ అనీమియా, హిమోఫీలియా వంటి వ్యాధులకు మెరుగైన వైద్యం అందించేందుకు హెమటాలజీ విభాగం, రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో తక్షణ వైద్య సేవల కోసం ఎమర్జెన్సీ విభాగం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.అదేవిధంగా రిమ్స్‌లో పీజీ వైద్య విద్యార్థుల సంఖ్య, ఓపీ, ఐపీ సేవలను పెంచడంతో పాటు పీడియాట్రిక్స్, గైనకాలజీ, రేడియాలజీ తదితర విభాగాల్లో పీజీ సీట్ల పెంపునకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి తెలిపారు.అగ్నిప్రమాద ఘటనపై సమగ్ర విచారణ కోసం నిపుణులతో కూడిన కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, భద్రతా లోపాలు, నిర్వహణలో లోపాలు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన చర్యలను కమిటీ పరిశీలిస్తుందని చెప్పారు. రిమ్స్‌లో కింది మూడు కీలక సేఫ్టీ ఆడిట్‌లను నిర్వహించాలని ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.ఎలక్ట్రికల్ సేఫ్టీ ఆడిట్, ఫైర్ సేఫ్టీ ఆడిట్, సివిల్ స్ట్రక్చర్ సేఫ్టీ ఆడిట్ నిపుణుల కమిటీ నివేదిక, సేఫ్టీ ఆడిట్‌ల ఆధారంగా రిమ్స్‌లో అవసరమైన మరమ్మతులు, అదనపు మౌలిక వసతులు, పునరుద్ధరణ పనులు, కొత్త భవనాల నిర్మాణం, అదనపు సిబ్బంది నియామకం తదితర అంశాలపై సమగ్ర అంచనాలు రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పిస్తామని మంత్రి తెలిపారు. రిమ్స్‌లో మెయింటెనెన్స్, మానిటరింగ్, భద్రతా ప్రమాణాల అమలులో ఏమైనా లోపాలు ఉన్నాయా అనే అంశాలను అన్ని కోణాల్లో పరిశీలిస్తామని చెప్పారు. విచారణలో ఎవరి నిరక్ష ్యం లేదా బాధ్యతారాహిత్యం బయటపడినా, నిబంధనల ప్రకారం తగిన కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.రిమ్స్‌లో మౌలిక వసతులను బలోపేతం చేయడం, అవసరమైన మానవ వనరులను సమకూర్చడం, రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం, ఆస్పత్రిలో భద్రతా ప్రమాణాలను మరింత పటిష్టం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష ్యమని మంత్రి తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే పాయల్ శంకర్, వైద్యారోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చాంగ్తూ, డీఎంఏ వాణి, జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో మంద మకరంద్, అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష, గ్రంథాలయ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, డీఎంహెచ్‌వో సాధన, వైద్యులు, అధికారులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులకు పథకాల్లో పెద్దపీట

>> చేపడుతున్న అవగాహన కార్యక్రమాలపై సమావేశంలో చర్చించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2013 ఫిబ్రవరి 11న అప్పటి ముఖ్యమంత్రి అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం అమలుపై రాష్ట్ర స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి అధ్యక్షతన రాష్ట్ర స్థాయి ఉన్నత నిఘా, పర్యవేక్షణ కమిటీ సమావేశం జరగడం ఇదే తొలిసారి. ఈ సందర్భంగా రాష్ట్రంలో క్రమంగా అయిదేండ్లలో ఎస్సీ,ఎస్టీలపై అట్రాసిటీ కేసులు తగ్గుముఖం పట్టాయని అధికారులు సిఎంకు వివరించారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో, ప్రధానంగా 73 గ్రామాల్లో ఎక్కువ కేసులు నమోదవుతున్నాయని నివేదించారు. అక్కడ పోలీసు విభాగం ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన అవసరముందని తెలిపారు. జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీల మీటింగ్‌లు క్రమం తప్పకుండా జరిగేలా చూడాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఎస్సి, ఎస్టీ అట్రాసిటీస్ నిరోధక చట్టం కింద బాధితులకు చెల్లించాల్సిన నష్ట పరిహారాన్ని వెంటనే చెల్లించాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. బడ్జెట్ కేటాయింపులతో ముడిపెట్టకుండా గ్రీన్ ఛానెల్ ద్వారా నిధులు విడుదల చేయాలన్నారు. అట్రాసిటీ ఘటనల్లో బాధితుల పట్ల ప్రభుత్వం మానవీయ కోణంలో స్పందించాలని, వారికి సకాలంలో నష్టపరిహారం, సహాయం, పునరావాసం అందేలా చూడాలని స్పష్టం చేశారు. ఇటీవల షాబాద్ హత్యల కేసు, తుక్కుగూడలో నర్సుపై హత్యాచారం కేసులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా ప్రస్తావించి, బాధిత కుటుబాలకు సత్వర న్యాయం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. దళితులు, గిరిజనులు, ఆదివాసీలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. ప్రతి ప్రభుత్వ పథకం, కార్యక్రమంలో వారికి తగినంత ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎస్సీ జనాభా దాదాపు 16 శాతం ఉంటే.. ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపులో 31 శాతం మంది లబ్ధిదారులు ఎస్‌సీలే ఉన్నారన్నారు. ఎస్టీల జనాభా 10 శాతం ఉంటే, వారికి 17 శాతం ఇండ్లను మంజూరు చేశామని వివరించారు. రాష్ట్రంలోని 27.5 లక్షల మంది విద్యార్థులకు నర్సరీ నుంచి పన్నెండో తరగతి వరకు అల్పాహారం అందిస్తున్నామని తెలిపారు. తెలంగాణలో 3.48 కోట్ల మందికి సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, దీనివల్ల దళితులు, గిరిజనులు, ఆదివాసీలు సహా పేద కుటుంబాలకు నాణ్యమైన భోజనం అందుతోందన్నారు.

దళితులు, గిరిజనులు, ఆదివాసీల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం సంక్షేమ పథకాలను రూపొందించి అమలు చేస్తోందన్నారు. చదువు ఒక్కటే జీవితాలను మారుస్తుందని, విద్యతోనే సమాజంలో అసమానతలకు, అణిచివేత రుగ్మతలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. పిల్లలను చదువుతో పాటు క్రీడలవైపు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వం మీది. మీ సంక్షేమం, అభివృద్ధి కోసమే పనిచేస్తుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో సీఎంతో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష ్మణ్ కుమార్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీలు మల్లు రవి, బలరాం నాయక్, కడియం కావ్య, ఎమ్మెల్యేలు తోట లక్షీ ్మకాంతరావు, మేడిపల్లి సత్యం, కవ్వంపల్లి సత్యనారాయణ, వేముల వీరేశం, మందుల సామేల్, మట్టా రాగమయి, వెడ్మ బొజ్జు, మురళీ నాయక్, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, డీజీపీ సీవీ ఆనంద్, రాష్ట్ర ఎస్‌సీ కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య, జాతీయ ఎస్సీ కమిషన్ డైరెక్టర్ సునీల్ బాబు, ఎస్సీ కమిషన్ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




యుపిఐ లావాదేవీలపై 'మర్చంట్ డిస్కౌంట్ రేట్' అమలుకు వ్యతిరేకంగా మంగళవారం హైదరాబాద్‌లో నిరసన తెలుపుతున్న సిపిఐ కార్యకర్తలు

## ఎంజిఎంలో మళ్లీ ఊడిపడిన శ్లాబ్ పెచ్చులు

>> పరిశీలించేందుకు వరంగల్ పశ్చిమ మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ ఎంజీఎం ఆసుపత్రికి చేరుకున్నారు.అయితే అప్పటికే పోలీస్ నిఘా నీడలో ఉన్న ఎంజీఎం ఆసుపత్రిలోకి మాజీ ఎమ్మెల్యే వెళ్లడానికి ప్రయత్నించగా ప్రధాన గేట్ వద్ద పోలీసులు ఉండడంతో పోస్ట్ మార్టం ద్వారం ద్వారా వెళ్లే ప్రయత్నం చేయగా నిరాకరించడంతో మాజీ ఎమ్మెల్యే లతోపాటు,బీఆర్ఎస్ కార్యకర్తలకు, పోలీసులకు మధ్య తోపులాట చోటుచేసుకోవడంతో ఎంజీఎం పరిసర ప్రాంతం లో తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణ వాతావరణం లో మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ కు కాలుకు గాయం కావడంతో కన్నీటి పర్యంతం అయ్యారు.దానితో అస్వస్థతకు గురికావడంతో అజరా ఆసుపత్రి లో చికిత్స పొందుతున్నారు. సోమవారం రోజున ఎంజీఎం ఆసుపత్రిలో ఆరోగ్య శ్రీ వార్డు లో పైకప్పు పెచ్చులు ఊడి పడి ఆరుగురికి గాయాలు అయి ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. అయితే ఆ ఘటన మరువక ముందే మంగళవారం రోజు ఐసియు,ఫిజీయోథెరపి విభాగంలో మరో ఘటన చోటు చేసుకోవడంతో ఎంజీఎంలో జరిగే వరుస ఘటనలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ క్రమంలోనే ఎంజీఎం ఆసుపత్రి పరిశీలించేందుకు వచ్చిన మాజీ ఎమ్మెల్యేకు జరిగినా సంఘటనపై బీఆర్ఎస్ కార్యకర్తలు,నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వ నిరక్ష ్యంపై,పోలీసుల తీరుపై తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు.

**నోడల్ ఆఫిసర్ ఎక్కడా..?**

ఎంజీఎం ఆసుపత్రిలో సోమవారం ఆరోగ్య శ్రీ వార్డు లో పైకప్పు పెచ్చులు ఊడి పలువురు గాయాలు అయిన ఘటనపై జిల్లా కలెక్టర్,డీఎంఈ అధికారి పరిశీలించి సంఘటనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాగా ఎంజీఎం లో జరుగుతున్న ఘటనలు,పలు విషయాల దృష్ట్యా అధికారులతో చర్చించి ఎంజీఎం లో జరిగే సమాచార నిమిత్తం ఒక నోడల్ ఆఫిసర్ ను నియామిస్తామని తెలిపినట్టు సమాచారం.? అయితే మరుసటి రోజు మరో ఘటన పునరావృతం కావడంతో నోడల్ ఆఫిసర్ కు బదులు ఎంజీఎం లో పోలీస్ పహారా ఉంచడం పై తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం రోజు ఎంజీఎం లోపలికి వెల్లడానికి ప్రయత్నించిన మీడియాను,బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేను, సిపిఎం నాయకులను పోలీసులు అడ్డుకున్న తీరు, పోలీస్ పహారా ను నగర ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. పేదల ఆసుపత్రి గా పేరుగాంచిన ఎంజీఎం ఆసుపత్రి పోలీస్ నిఘా నీడలో ఉండడం ప్రప్రథమం కాగా, మీడియా ను అనుమతించక పోవడం కొసమెరుపు.అంతేకాకుండా ఎంజీఎం లో సోమవారం కలెక్టర్,డీఎంఈ సందర్శించే సమయంలో కాక్రోచ్ జనతా పార్టీ వారు ఎంజీఎం కు చేరుకొని కలెక్టర్ ను కలిసే ప్రయత్నం చేయడం, కూడా పోలీస్ పహారా కు కారణం కావచ్చని చర్చ సాగుతోంది.

## కుండపోత

>> 1.6 అమిర్‌పేట్1.5సెం.మి ఖైరతాబాద్ బాలానగర్, చార్మినార్‌లో 1.4సెం.మి కురిసింది. జూబ్లీహిల్స్, గోల్కొండ, రాజేంద్రనగర్, శంషాబాద్ ప్రాంతాల్లోనూ భారీ వర్షం నమోదైంది.అల్వాల్, బాలానగర్, కుత్బుల్లాపూర్, గాజులరామారం, మల్కాజ్‌గిరి, కాప్రా, బోయిన్‌పల్లి, హిమాయత్‌నగర్, ముషీరాబాద్, ఉస్మానియా యూనివర్సిటీ, అంబర్‌పేట్, ఉప్పల్, నాగోల్, ఎల్బీనగర్, మలక్‌పేట్, ట్యాంక్‌బండ్, వనస్థలిపురం, హయత్‌నగర్, చార్మినార్ పరిసర ప్రాంతాల్లోనూ వర్షం ఓమోస్తారు కురిసింది. ఇప్పటికే దుండిగల్, మేడ్చల్, శామీర్‌పేట, హకీంపేట, తుమ్ముకుంట, కొంపల్లి, బొల్లారం, యాప్రాల్, దమ్మాయిగూడ, నాగారం, ఘట్‌కేసర్, కీసర తదితర ఉత్తర, తూర్పు హైదరాబాద్ ప్రాంతాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షం ఆకస్మికంగా కురిసింది. కూకట్‌పల్లి, ఆల్వాల్, బాలానగర్, కుత్బుల్లాపూర్, మల్కాజిగిరి, కాప్రా, బోయిన్‌పల్లి, గాంధీనగర్, దుండిగల్, రామనగర్, అంబర్‌పేట, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ఎస్ఆర్‌నగర్, బోరబండ, కోఠి, లక్డీకపూల్, సైదాబాద్, ఐఎస్‌సదన్, మదనపేట్, మలక్‌పేట్, చాదర్‌ఘాట్, చంపాపేట్, సంతోష్‌నగర్ తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై నీరు చేరింది. రహదారులపైకి నీరు చేరడంతో మాదాపూర్, టోలీచౌక్ వంతెనపై వాహనాలు నెమ్మదిగా కదలడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. వర్షాల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు వాహనదారులను అప్రమత్తం చేశారు. అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని సూచించారు. వాహనాల వేగాన్ని తగ్గించి సురక్షిత దూరం పాటించాలని, ఆకస్మిక బ్రేకులు, లేన్ మార్పులకు దూరంగా ఉండాలని కోరారు. ఫ్లైఓవర్ల కింద, నీరు నిలిచే ప్రాంతాల్లో వాహనాలను నిలపవద్దని తెలిపారు. వర్ష సమయంలో హెడ్‌లైట్లు, ఇండికేటర్లను వినియోగించాలని, నీరు నిలిచిన రోడ్లపై ప్రయాణించేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాతావర్ణశాఖ బుధవారం తెలంగాణలోని 20జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉందని ఆరెంజ్‌హెచ్చరిక జారీచేసింది. వాయుగుండం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉండటంతో బుధ,గురువారాల్లో కూడా పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావర్ణశాఖ తెలిపింది.పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, ఉమ్మడి వరంగల్ జిల్లాలకు అధికారులు ఆరెంజ్ అలర్ట్ ఉండటంతో మారుమూల లోతట్టు గ్రామాల పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనించాలని అధికారులను అప్రమత్తం చేశారు.

## 'ఫాల్కే' ప్రదానం

>> ఎదురుచూస్తున్న కళాకారులకు గౌరవం, సామాజిక భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని ఆమె అన్నారు. అన్ని జ్యూరీల్లో మహిళలకు తగిన ప్రాతినిధ్యం కల్పించడం ద్వారా సమగ్ర మానవీయ దృక్పథం ప్రతిబింబించేలా చూడాలని సూచించారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రముఖ నటుడు అనంత్ నాగ్‌కు 2024 దాదాసాహెబ్ ఫాల్కే అవార్డును ప్రదానం చేశారు. దశాబ్దాల పాటు కథన కళకు, నటనకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా ఈ పురస్కారం లభించింది. తన బాల్యాన్ని గుర్తుచేసుకున్న అనంత్ నాగ్ తాను ఆశ్రమంలో పెరిగిన అనంతరం ముంబైకి వెళ్లినట్లు తెలిపారు. అక్కడ ఒక నాటకంలో నటించే అవకాశం లభించిందని చెప్పారు. రంగస్థలమే తన సినీ జీవితానికి పునాదిగా నిలిచిందని, సినిమాల్లోకి రాకముందు సుమారు 50 నాటకాల్లో నటించినట్లు తెలిపారు. అనంతరం ప్రముఖ దర్శకుడు శ్యామ్ బెనెగల్ తదితరుల చిత్రాల్లో నటించే అవకాశం లభించిందని చెప్పారు. తాను ఉద్దేశపూర్వకంగా కన్నడ సినిమాను ఎంచుకుని బెంగళూరును తన కర్మభూమిగా చేసుకున్నానని అనంత్ నాగ్ తెలిపారు. గత ఏడాది రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మభూషణ్ పురస్కారం అందుకున్న విషయాన్ని గుర్తుచేసుకున్న ఆయన, వరుసగా మరోసారి రాష్ట్రపతి చేతుల మీదుగా దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు అందుకోవడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. గుజరాత్ గవర్నర్ ఆచార్య దేవవ్రత్ మాట్లాడుతూ జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమాన్ని ఢిల్లీ వెలుపల నిర్వహించే సంప్రదాయాన్ని ప్రారంభించిన సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. జాతీయ చలనచిత్ర అవార్డుల కార్యక్రమాలను దేశంలోని వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని ముఖ్యమైన పర్యాటక ప్రాంతాల్లో నిర్వహించడం ద్వారా భారతదేశ సాంస్కృతిక వారసత్వం, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలన్నదే లక్ష్యమనికేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. భవిష్యత్ అవార్డు కార్యక్రమాలకు తమ పర్యాటక ప్రాంతాలను వేదికలుగా ప్రతిపాదించాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను కోరారు. ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ క్రియేటివ్ టెక్నాలజీస్ కొత్త ప్రతిభకు వేదికగా నిలుస్తోందని, ఇప్పటికే 13 కోర్సుల్లో సుమారు 380 మంది విద్యార్థులు చేరారని తెలిపారు. పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా కోర్సుల పాఠ్య ప్రణాళిక రూపొందించబడిందన్నారు.

## వినయ్ భాస్కర్‌పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

### మెడికో లీగల్ నివేదిక ఆధారంగా కేసు నమోదు చేయాలి: మాజీ ఎంపి వినోద్ కుమార్



**ఉమ్మడి వరంగల్ బ్యూరో, సెప్టెంబరు 22:** మాజీ ప్రభుత్వ చీఫ్ విప్, మాజీ శాసనసభ్యులు దాస్యం వినయ్ భాస్కర్‌పై జరిగినట్లు పేర్కొంటున్న దాడి ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీ వినోద్ కుమార్ పోలీసులను కోరారు. ఈ ఘటనపై పోలీసులు నిష్పక్ష పాతంగా దర్యాప్తు చేపట్టి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దాస్యం వినయ్ భాస్కర్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి, వైద్యుల నివేది కతో పాటు మెడికోలీగల్ నివేదికను పరిగణనలోకి తీసుకుని, చట్ట ప్రకారం కేసునమోదు చేయాలని వినోద్ కుమార్ కోరారు. ఘటనకు సంబం ధించిన పూర్తి వివరాలను సేకరించి, ప్రత్యక్ష సాక్షులు, అందుబాటులో ఉన్న వీడి యోలు, ఇతర ఆధారాలను పరిశీలించి బాధ్యులను గుర్తించాలని ఆయన సూ చించారు. ఈ విషయంపై వరంగల్ పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా స్పందించి, సంబంధిత పోలీసు అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేయాలని మాజీ ఎంపీ కోరారు.

## ఆదిలాబాద్ రిమ్స్‌లో చిన్నారుల మృతి బాధాకరం

### బాధిత కుటుంబాలకు రూ.25లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి: కెటిఆర్ డిమాండ్

**హైదరాబాద్,సెప్టెంబరు22,ప్రభాతవార్త:** అదిలాబాద్ జిల్లా రిమ్స్ ఆసుపత్రిలో కరెంట్ షార్ట్ సర్క్యూట్ ప్రమాదంలో ముగ్గురు చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. ఈ దుర్ఘటనలో ఇంకా 23 మంది పసిపిల్లలు గాయపడిన నేపథ్యంలో వెంటనే మెరుగైన చికిత్స అందించి వారి ప్రాణాలు కాపాడాలని కోరారు. కాంగ్రెస్ సర్కారు ఘోర వైఫల్యం వల్లే ఇంత పెద్ద ప్రమాదం జరిగి, అభంశుభం తెలియని పిల్లలు అన్యాయంగా బలైపోయా రని ఆరోపించారు. ముఖ్యమంత్రి సీఎం రేవంత్ రెడ్డే ఈ సంఘటనకు పూర్తిబాధ్యత వహించాలని చెప్పారు. రిమ్స్ ఆసుపత్రిలో నెలకొన్న దుస్థితులపై అనేకసార్లు బిఆర్ఎస్ జిల్లా నేతలు ప్రభుత్వాన్ని హెచ్చరించినా సర్కారులో కనీస చలనం కనిపించలేదన్నారు. ఆదిలాబాద్ రిమ్స్‌తో పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లోని పిల్లల వార్డులు, ఐసీయూలను నిపుణులతో తనిఖీ చేయించి ఇలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. పసిపిల్లలను కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న బాధితకుటుంబాలకు రూ. 25లక్షల చొప్పున ఎక్స్ గ్రేషియా చెల్లించి ఆదుకోవాలని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.



ఉద్యమకారులు లింగాల కేదారి, పుష్పలత (ఫైల్)

## ఉద్యమకారులు లింగాల కేదారి-పుష్పలత కుటుంబానికి సిఎం రేవంత్‌రెడ్డి రూ.10 లక్షల ఆర్థిక సాయం

**హైదరాబాద్,సెప్టెంబరు22,ప్రభాతవార్త:** హనుమకొండలో సాధారణ హోటల్ నడుపుతూ, వ్యాపార కోణంతో కాకుండా మానవతా దృక్పథంతో వ్యవహరించి ఉద్యమకారులకు ఉచితంగా ఆహారం అందించి, స్వరాష్ట్ర సాధన ఉద్యమంలో తనదైన పాత్ర పోషించిన గొప్ప మానవతావాదులు దివంగత లింగాల కేదారి-పుష్పలత దంపతులు. అన్నం పరబ్రహ్మ స్వరూపమని, దానిని వృథా చేయకూడదని అవగాహన కల్పించిన మహానుభావులు ఆ పుణ్య దంపతులు. లింగాల కేదారి-పుష్పలత దంపతుల అపూర్వమైన సేవలకు గుర్తింపుగా వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సిఎం రేవంత్‌రెడ్డి రూ.10లక్షల ఆర్థిక సాయం మంజూరు చేశారు. వారు అందించిన గొప్ప సేవలకు గుర్తుగా ప్రభుత్వం అందించే చిరు నివాళిగా దీనిని భావిస్తున్నానని ట్విట్టర్ ద్వారా ప్రకటించారు. ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో కేదారి మృతి చెందగా చికిత్స పొందుతూ మరుసటి రోజు పుష్పలత కన్నుమూశారు. తెలంగాణ మలిదశఉద్యమంలో మానవతా సేవలతో వీరు గుర్తింపు పొందారు. లింగాల కేదారి వంటి వ్యక్తుల స్ఫూర్తిని కొనసాగిస్తూ, ఇందిరమ్మ క్యాంటీన్ల ద్వారా తక్కువ ధరకు వీలైనంత ఎక్కువమందికి భోజనం అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తుందని సిఎం ట్విట్టర్ ద్వారా

## జూబ్లీహిల్స్ మాజీ ఇన్‌స్పెక్టర్‌కు సుప్రీంలో ఊరట

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** భర్తతో గొడవపడి పోలీసు స్టేషన్‌కు వచ్చిన మహిళను లైంగికంగా దాడిచేయడంతో పాటు ఆమె నుంచి ఐదు లక్షల రూపాయలు తీసుకుని మోసం చేసిన కేసులో సస్పెండ్ అయిన జూబ్లీహిల్స్ మాజీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు రెడ్డికి సుప్రీం కోర్టులో ఊరట లభించింది. వివాహిత చేసిన ఫిర్యాదు మేరకు శ్రీనివాసులు రెడ్డిపై కేసు నమోదు కాగా అప్పటి నుంచి పరారీలో వున్న ఆయన కోసం పోలీసులు గాలిస్తున్నారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని హైకోర్టును శ్రీనివాసులు రెడ్డి ఆశ్రయించగా ఆయన పిటిషన్ డిస్మిస్ అయ్యింది. దీంతో శ్రీనివాసులు రెడ్డి సుప్రీం కోర్టును ఆశ్రయించగా పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు ఆయనపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర పోలీసు శాఖను ఆదేశించడంతో పాటు దీనిపై విచారణను వాయిదా వేసింది.

## పోక్సో నిందితుడు ఎర్రగడ్డ ఆస్పత్రి నుంచి పరార్



**హైదరాబాద్ (జూబ్లీహిల్స్), సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ జిల్లా అమరచింత పోలీసు స్టేషన్‌లో మైనర్ బాలికపై లైంగిక దాడి ఘటనకు సంబంధించి నమోదైన పోక్సో కేసులో నిందితుడు ఎర్రగడ్డలోని మానసిక వైద్య చికిత్సాలయం నుంచి మంగళవారం మధ్యాహ్నం పోలీసు ఎస్కార్ట్ కళ్లుగప్పి పారిపోయాడు. వివరాలు ఇలావున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా అమరచింతకు చెందిన ట్రాక్టర్ డ్రైవర్ శివశంకర్ రె డ్డి (25) పోక్సో కేసులో అరెస్టయి జైలులో రిమాండులో వున్నాడు. మొదట మహబూబ్‌నగర్ జిల్లా జైల్లో వుండగా మానసిక అనారోగ్య సమస్యల కారణంగా ఇటీవల చంచల్‌గూడ జైలుకు తరలించారు. అనారోగ్య సమస్యల నేపథ్యంలో ఇతన్ని ఎర్రగడ్డలోని మానసిక వైద్యశాలకు మంగళవారం తీసుకువచ్చారు. ఇతని వెంట ఎస్కార్టుగా హెడ్ కానిస్టేబుల్ కోటేశ్వరరెడ్డి, కానిస్టేబుల్ రాహుల్ వున్నారు. మధ్యాహ్నం రెండు గంటల సమయంలో వైద్య పరీక్ష అనంతరం బాత్‌రూమ్‌కు వెళతానని చెప్పిన నిందితుడు అక్కడికి వెళ్లి వెంటిలేటర్ నుంచి దూకి పరారయ్యాడు. పోలీ సు సిబ్బంది గాలింపు చేపట్టినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో ఎస్కార్ట్ సిబ్బంది ఫిర్యాదు మేరకు బోరబండ పోలీసులు కేసు నమోదు చే సి నిందితుడి కోసం గాలిస్తున్నారు. కాగా ఈ కేసులో ఎస్కార్టు పోలీసులు ఇద్దరిని ఉన్నతాధికారులు సస్పెండ్ చేసినట్లు తెలిసింది. కాగా శివశ ంకర్ రెడ్డి ఇంతకు ముందు ఒకసారి మహబూబ్‌నగర్ జైలు నుంచి పారిపోయినట్లు తెలిసింది.

## డ్రగ్స్ కట్టడిలో తెలంగాణ పోలీసులకు జాతీయ గుర్తింపు

### కేంద్ర హోంమంత్రి అమిత్ షా నుంచి అవార్డు అందుకున్న ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య




కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా నుంచి అవార్డు అందుకున్న ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** మాదకద్రవ్యాల కట్టడికి చేబడుతున్న చర్యలు పక్కాగా వుండడం, డ్రగ్స్ స్మగ్లర్లను భారీ సంఖ్యలో పట్టుకోవడంతో పాటు పెద్ద మొత్తంలో డ్రగ్స్‌ను జప్తు చేసినందుకు, వ్యసన పరులను పునరావాస కేంద్రాలలో చేర్చి సాధారణ పౌరులుగా మార్చడంలో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు తెలంగాణ పోలీసు శాఖకు జాతీయ గుర్తింపు లభించింది. కేంద్రం నిర్దేశించిన ఏడు అంశాలలో 80 శాతానికి పైగా మార్కులు సాధించిన తెలంగాణ పోలీసు శాఖ తర పున ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా మంగళవారం నాడు ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా నుంచి అవార్డు అందుకున్నారు. డ్రగ్స్ కట్టడికి కేంద్ర నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో ఆధ్వర్యంలో జరుగుతున్న మూడవ యాంటి నార్కోటిక్ టాస్క్‌ఫోర్స్ రెండు రోజుల సదస్సు మంగళవారం మొదలవగా ఇందులో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు మాదకద్రవ్యాల నిర్మూలనకు చేస్తున్న కృషిపై చర్చించారు. ఇందులో తెలంగాణ పోలీసు శాఖ కేంద్రం నిర్దేశించిన ఏడు అంశాలలో 80కి పైగా మార్కులు అందుకుని మొదటి స్థానంలో నిలిచింది. ఇం టెలిజెన్స్ ఆపరేషన్, సింథటిక్ డ్రగ్స్ నియం త్రణ, ప్రాసిక్యూషన్ విధానం పక్కాగా వుం డడం, డిమాండ్ హార్డ్ రిడక్షన్, కో ఆర్డినేషన్ కెపాసిటీ బిల్డింగ్, రిసర్చ్ అనాలిసిస్, అడ్మినిస్ట్రే షన్ లాజిస్టిక్స్ అంశాల్లో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణ పోలీసు శాఖ అగ్రభాగాన నిలిచింది. ఇందుకుగాను తెలంగాణ పోలీసు శాఖకు కేంద్రం అవార్డు అందించింది. డ్రగ్స్ కట్టడిలో జాతీయ గుర్తింపు రావడం పట్ల డిజిపి ఆనంద్ సంతోషం వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాలను మాదకద్రవ్యాల నుంచి కాపాడాల్సి అవ సరం వుందని ఆయన తెలిపారు. ఇందుకోసం తెలంగాణ పోలీసు శాఖ ఒక లక్ష్యంతో పనిచే స్తుందని ఆయన వెల్లడించారు. సైబర్ నేరాల నివారణలోనూ తెలంగాణ పోలీసు శాఖ జాతీయ స్థాయిలో అగ్రభాగానవుందని ఆయన తెలిపారు.

## ఐదు రోజులు బ్యాంకులు బంద్

> 28 నుండి మూడు రోజుల సమ్మె
> 26, 27 సాధారణ సెలవు
> దేశ వ్యాప్త సమ్మెకు బ్యాంకు సంఘాల ఐక్య వేదిక పిలుపు

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** ఈ నెలలో బ్యాంకులు ఐదు రోజులు మూతపడనున్నాయి. ఈ నెల 26, 27వ తేదీల్లో బ్యాంకులకు సాధారణ సెలవులు కాగా, 28, 29, 30 తేదీల్లో సమ్మెతో బంద్ కానున్నాయి. ప్రభుత్వ రంగంలోని బ్యాంకులతో పాటు, ప్రైవేటు బ్యాంకులు సైతం ఈ సమ్మెలో పాల్గొంటున్నాయి. బ్యాంకు సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు మూడు రోజుల దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనున్నాయి. దీంతో పాటు, సమ్మెకు ముందు వచ్చే నాలుగవ శనివారం, ఆదివారం కూడా సెలవు కావడంతో ఐదు రోజుల పాటు బ్యాంకులు పూర్తిగా నిలిచిపోనున్నాయి. ఈ నేపథ్యంలో ఇబ్బందులు పడకుండా బ్యాంకు వినియోగదారులు అత్యవసర లావాదేవీలను ముందుగానే పూర్తి చేసుకోవాలని ఐక్యవేదిక సూచించింది. పలు ప్రధాన బ్యాంకు ఉద్యోగుల, అధికారుల సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న బ్యాంకు సంఘాల ఐక్య వేదిక, ఐదు రోజుల బ్యాంకింగ్ వారాన్ని అమలు చేయడంతో సహా పలు డిమాండ్లపై సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ డిమాండ్లలో వారానికి ఐదు రోజుల పని, పనితీరు ఆధారిత ప్రోత్సాహక పథకం, ఇతర సేవా సంబంధిత విషయాలకు సంబంధించిన సమస్యలను కూడా ఈ సంఘాలు లేవనెత్తాయి. సమ్మెకు ముందే శాఖలకు సంబంధించిన ముఖ్యమైన పనులను పూర్తి చేసుకోవాలని పలు బ్యాంకులు వినియోగదారులకు సూచించాయి. ఉద్యోగుల భాగస్వామ్యాన్ని బట్టి, శాఖలలో నగదు డిపాజిట్లు, విత్‌డ్రాలు, చెక్కులకు సంబంధించిన పనులు, ఖాతా సేవలు, కేవైసీ అప్‌డేట్‌లు, ఇతర కౌంటర్ ఆధారిత లావాదేవీల వంటి సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని సాధ్యమైనంత వరకు డిజిటల్ బ్యాంకింగ్ మార్గాలను ఉపయోగించుకోవాలని వినియోగదారులకు బ్యాంకులు సూచించాయి. ఏటీఎంలు, ఇంటర్నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ మరియు యూపీఐ సేవలు అనేక నిత్య లావాదేవీలకు ప్రత్యామ్నాయాలను అందిస్తాయని భావిస్తున్నారు. అయితే బ్యాంకును బట్టి వినియోగ దారులు కొన్ని సేవల్లో అంతరాయాలను ఎదుర్కొనే వీలుందని చెబుతున్నారు. సమ్మె కాలంలో నిత్యావసర బ్యాంకింగ్ సేవలను అందించడానికి సాధ్యమైన అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒక ప్రకటనను జారీ చేసింది. ఈ ఐదు రోజుల సమ్మెకు ముందుగానే తమ బ్యాంకింగ్ అవసరాలను ప్రణాళిక చేసుకోవాలని, ఏటీఎంలు మరియు కస్టమర్ సర్వీస్ పాయింట్లను ఉప యోగించుకోవాలని వినియోగదారులకు సూచిం చింది. హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ బ్యాంకు బ్రాంచ్ మేనేజర్ పి.శ్రవణ్ మాట్లాడుతూ, సమ్మె సమయంలో అసౌకర్యాన్ని నివారించడానికి, నగదు లావాదేవీలు, చెక్కు సంబంధిత సేవలు, కేవైసీ అప్‌డేట్‌లు లేదా ఇతర బ్రాంచ్ పనుల వం టి అత్యవసరపనులు ఉన్న వినియోగదారులు వాటిని ముందుగానే పూర్తిచేసుకోవాలని సూచించారు.

## పోలీసు కస్టడీకి మిలటరీ ఆయుధాల చోరీ నిందితుడు

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** బొల్లారంలోని మద్రాస్ రిజిమెంట్ సెంటర్‌లో తుపాకులు, మందుగుండు సామాగ్రిని దొంగిలించిన కేసులో నిందితుడుగా వున్న మాజీ సైనికుడు ఉప్పుటోళ్ల మల్లేష్ అలియాస్ రాజును పది రోజుల విచారణ నిమిత్తం బొల్లారం పోలీసులు కస్టడీ లోకి తీసుకున్నారు. గత నెల 30వ తేదీన జరిగిన ఈ చోరీ దేశ వ్యాప్తంగా సంచలనం రేపడం తెలిసిందే. కట్టుదిట్టమైన భద్రత వుండే మిలట రీ ఆయుధ గోదాము నుంచి మల్లేష్ ఎకె 47, ఇన్సాస్ తుపాకులు, పిస్టళ్లు, వాటికి సంబంధించిన తూటాలను, రాత్రుల్లో చూడగలిగే బైనాక్యూలర్లను దొంగిలించడం విదితమే. పది రోజుల తరువాత మల్లేష్‌ను బొల్లారం పోలీసులు పట్టుకుని నాగర్ కర్నూలులోని జంగారెడ్డి గూడలో గల శ్రీపురం గ్రామంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రిని దాచి వున్న చోటు నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇంతకు ముందు ఇదే మద్రాస్ రిజిమెంట్ సెంటర్‌లో హవాల్దార్‌గా పనిచేసి క్రమశిక్షణారాహిత్యంతో బలవంతంగా పదవీ విరమణ పొందిన మల్లేష్ తన పై అధికారులపై కక్షతో ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెలుగు చూసింది. అయితే ఒక్కడే ఇన్ని ఆయుధాలను ఎలా చోరీ చే శాడు...? దీని వెనుక ఏదైనా కుట్ర వుందా...? అనే అంశాలను వెలుగులోకి తెచ్చేందుకు అతన్ని కస్టడీలోకి తీసుకుని విచారించేందుకు సికింద్రాబాద్ కోర్టులో పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు. అయితే ఈలోపు మల్లేష్ మూత్రపిండాలు, కాలేయం వ్యాధితో అనారోగ్యం పాలై ఉస్మానియా ఆసుపత్రిలో వారం రోజుల పాటు వున్నాడు. ఇతను ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి చంచల్‌గూడ జైలుకు వెళ్లగానే పోలీసులు కస్టడీ కోస ం సికింద్రాబాద్ కోర్టును కోరగా దీనిపై సోమవారం నాడు విచారణ జరిగింది. పోలీసులు కోరినట్లుగా మల్లేష్‌ను పది రోజుల పాటు విచారించేందుకు సోమవారం కోర్టు అనుమతించింది. కోర్టు అనుమతితో మంగళవారం ఉదయం బొల్లారం పోలీసులు చంచల్‌గూడ జైలు నుంచి మల్లేష్‌ను తమ కస్టడీలోకి తీసుకుని మొదట ఉస్మానియా ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి అనంతరం బొల్లారం పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడి నుంచి మరో చోటుకు తరలించి విచారించారు. మొదటి రోజు ఆరు గంటలకు పైగా మల్లేష్‌ను విచారించారు. ఈ విచారణలో మిలటరీ అధికారులు కూడా పాల్గొ న్నట్లు సమాచారం. కాగా మల్లేష్ కస్టడీపై పోలీసులు మాట్లాడుతూ కోర్టు అనుమతితో పది రోజుల విచారణ కోసం అ దుపులో తీసుకున్నామని తెలిపారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో బుల్లెట్ కలకలం

**శంషాబాద్ సెప్టెంబరు 22,ప్రభాతవార్త :** శంషాబాద్ రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ప్రయాణికుడి లగేజీలో బుల్లెట్ బయటపడటం కలకలం రేపింది. కోల్‌కతా నుంచి శంషాబాద్ మీదుగా రియాద్ వెళ్లేందుకు వచ్చిన ఇండిగో విమాన ప్రయాణికుడి లగేజీని ఎయిర్‌పోర్ట్ భద్రతా సిబ్బంది తనిఖీ చేస్తుండగా బుల్లెట్ గుర్తించినట్లు సమాచారం. ఎయిర్‌పోర్ట్‌లోని ఫోర్త్ లెవల్ వద్ద జీఎంఆర్ భద్రతా సిబ్బంది నిర్వహించిన తనిఖీల్లో ప్రయాణికుడి బ్యాగులో బుల్లెట్ కనిపించినట్లు తెలుస్తోంది. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది బుల్లెట్‌ను స్వాధీనం చేసుకుని, సదరు ప్రయాణికుడిని శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ ఔట్‌పోస్ట్ పోలీసులకు అప్పగించారు. ప్రయాణికుడి వద్ద బుల్లెట్ ఎలా వచ్చింది? దానిని ఎక్కడి నుంచి తీసుకొచ్చారు? బుల్లెట్‌ను విమానంలోకి తీసుకెళ్లే ఉద్దేశం ఏమైనా ఉందా? అనే కోణాల్లో ఔట్‌పోస్ట్ పోలీసులు విచారణ చేపట్టారు. అయితే ప్రయా ణికుడి వద్ద ఆయుధం కూడా ఉందా లేదా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. ప్రస్తుతం బుల్లెట్‌ను స్వాధీనం చేసుకున్న పోలీ సులు ప్రయాణికుడి వివరాలు, ప్రయాణ ఉద్దే శ్యం, లగేజీకి సంబంధించిన అంశాలపై ఆరా తీస్తున్నట్లు సమాచారం. బుల్లెట్ లభ్యమైన ఘటనపై ఎయిర్‌పోర్ట్ భద్రతా సిబ్బంది అప్రమత్తం కావడంతో ప్రయాణికుల్లో కొంతసేపు ఉత్కంఠ నెలకొంది.

## ఆదిలాబాద్ రిమ్స్‌లో ముగ్గురు పసికందుల మృతి దారుణం: ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** ఆదిలాబాద్ రిమ్స్ లో ముగ్గురు పసికందుల మృతి దారణం అని బిజెఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. రిమ్స్ ఘటనపై ప్రభుత్వం తక్షణమే కమిటీ వేసి, సమగ్ర విచారణ జరపాలన్నారు. అగ్ని ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు పసికందు కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులు పేద మధ్య తరగతి ప్రజలకు ప్రాణదారంగా ఉండాలని ప్రభుత్వం మరియు సిబ్బంది నిర్లక్ష్యంతో ఇలాంటి ఘటనలు జరగడం విచారకరమని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం తక్షణమే కమిటీ వేసి న్యాయవిచారణ జరపాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అగ్ని ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు పసికందు కుటుంబాలకు ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రగాఢ సానుభూతిని వ్యక్తపరిచారు. ప్రమాదంలో మరణించిన ముగ్గురు కుటుంబాలను ఒక్కొక్కరికి రూ. 25 లక్షల ఎక్స్రేషియా ప్రకటించి ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## బ్రహ్మోస్ ఏరోస్పేస్ డిజి డాక్టర్ జోషికి హైకోర్టులో ఊరట

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త** భారతదేశపు అగ్రశ్రేణి క్షి పణి కార్యక్రమ నాయకత్వానికి సంబంధించిన ఒక కీలక న్యాయ పరిణామం చోటుచేసుకుంది. భారత రక్షణ పరిశోధన మరియు అభివృద్ధి సంస్థ (డిఆర్‌డిఒ) అయిన బ్రహ్మోస్ ఏరోస్పేస్ డైరెక్టర్ జనరల్‌గా (డిజి) డాక్టర్ జయతీర్థ జోషికి మంగళవారం హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఆయన డిసెంబర్ 1,2024న ఈ బాధ్యతలను స్వీకరించారు. అయితే డిజిగా జయతీర్థ నియామకానికి వ్యతిరేకంగా సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్) ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. బ్రహ్మోస్ డిజిగా జయతీర్థ విషయంలో క్యాట్ జారీ చేసిన ఉత్తర్వును తెలంగాణ హైకోర్టు రద్దు చేసి కేసు కొట్టివేసింది. కాగా డాక్టర్ జైతీర్థ్ జోషి క్షి పణి సాంకేతికత రంగంలో 30 సంవత్సరాలకు పైగా విశేష అనుభవం కలిగి ఉన్నారు. ఆయన గతంలో హైదరాబాద్‌లోని డిఆర్‌డిఎల్, డాక్టర్ అబ్దుల్ కలాం మిస్సైల్ కాంప్లెక్స్ లో ఔట్‌స్టాండింగ్ సైంటిస్ట్‌గా పనిచేశారు.

## రవాణా అధికారుల సస్పెన్షన్

### అవకతవకలపై సమగ్ర విచారణకు ఆదేశం

### ఎవరు అక్రమాలకు పాల్పడ్డా ఆర్టీఓలదే బాధ్యత: హెచ్చరించిన రవాణా శాఖ

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** అనధికారికంగా నగదు వసూళ్లు చేశారన్న ఆరోపణల నేపథ్యంలో ఇద్దరు రవాణా శాఖ అధికారులు, ఒక కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు. అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణల నేపథ్యంలో బండ్లగూడ ప్రాంతీయ రవాణా కార్యాలయం (ఆర్టీఓ)కు చెందిన ఇద్దరు సీనియర్ అధికారులు, ఒక కానిస్టేబుల్‌ను రవాణా శాఖ సస్పెండ్ చేసి, సమగ్ర విచారణకు ఆదేశించింది. ఈ మేరకు మంగళవారం ఆర్టీఓ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. లైసెన్స్ జారీ చేసే విభాగంలో ఆర్టీఓ కానిస్టేబుల్ అరుణ్ రూ.500 నోట్లను లెక్కపెడుతున్నట్లుగా సోషల్ మీడియాలో ఒక వీడియో వైరల్ అవ్వడంతో అతడిని సస్పెండ్ చేశారు. ఆఫీసుకు వచ్చిన ఒక వాహనదారుడు ఈ వీడియోను రహస్యంగా రికార్డ్ చేసినట్లు సమాచారం. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ భీమ్‌సింగ్, ఆర్‌టిఓ రామ్ చందర్‌లు కార్యాలయంలో ఏజెంట్లను పనిచేయడానికి అనుమతించారని, సరైన పర్యవేక్షణ చేయడంలో విఫలమయ్యారని వచ్చిన ఆరోపణలపై వారిని కూడా సస్పెండ్ చేశారు. వారిని బాధ్యతల నుండి తక్షణమే తొలగించి, రవాణా శాఖ ప్రధాన కార్యాలయానికి బదిలీ చేశారు. కార్యాలయంలో అనధికారిక వసూళ్ల ఆరోపణల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. ఇదిలా ఉండగా, అవినీతి నిరోధక బ్యూరో (ఏసీబీ) ఆర్టీఓలో సోదాలు నిర్వహించి అవకతవకలను గుర్తించింది. సాధారణ సర్వీసుల కోసం వాహనదారులను పదేపదే వచ్చేలా చేస్తున్నారని, మధ్యవర్తుల ద్వారా పనులను వేగవంతం చేస్తున్నారని వచ్చిన ఆరోపణలపై కూడా అధికారులు విచారణ జరుపుతున్నారు. ఆర్టీఓ కార్యాలయాల్లో ఏజెంట్లను పనిచేయడానికి అనుమతిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అటువంటి ఉల్లంఘనలకు సంబంధిత ఆర్టీఓనే బాధ్యత వహించాల్సి ఉంటుందని రవాణా శాఖ హెచ్చరించింది.

## అడవిలో అద్భుతం

### అరుదైన వృక్షజాతి 'క్రొటలేరియా వెస్టిటా'

### *193 మీటర్ల ఎత్తులో అరుదైన మొక్క*

### *పాపకొల్లు 'రాసగానిగుట్ట' ప్రాంతంలో నాలుగు మొక్కల నమోదు*



**జూలూరుపాడు, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** ప్రకృతి అందాలకు, విభిన్న వృక్ష సంపదకు నిలయమైన పాపకొల్లు ప్రాంత అడవుల్లో అరుదైన వృక్షజాతి శాస్త్రీయ పరిశోధనలో వెలుగులోకి వచ్చింది. జూలూరుపాడు మండల పరిధిలో పాపకొల్లు అటవీ ప్రాంతంలోని "రాసగానిగుట్ట" పరిసరాల్లో 'క్రొటలేరియా వెస్టిటా' జాతికి చెందిన మొక్కలను పరిశోధకులు గుర్తించి నమోదు చేశారు. పాపకొల్లు అటవీ ప్రాంతంలో ఈ మొక్కలపై శాస్త్రీయ పరిశీలన నాలుగేళ్ల క్రితమే జరిగినట్లు పరిశోధనా పత్రం ద్వారా తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో మొక్కలను పరిశీలించి, వాటి ఆకులు, పుష్పాలు, కాయలు, విత్తనాలు తదితర లక్షణాలను అధ్యయనం చేశారు. అనంతరం సంబంధిత వృక్షశాస్త్ర గ్రంథాలు, గతంలో ప్రచురితమైన పరిశోధనలతో పోల్చి మొక్క జాతిని నిర్ధారించినట్లు పరిశోధనలో పేర్కొన్నారు. ఇంతేగాక ఇందుకు సం బంధించిన నమూనాలను కాకతీయ యూనివర్సిటీ వరంగల్ లోని హెర్బేరి యంలో భద్రపరచినట్లు పేర్కొన్నారు. "రాసగానిగుట్ట" ప్రాంతంలో సముద్ర మట్టానికి సుమారు 193 మీటర్ల ఎత్తులో, నల్ల నేలతో కూడిన అటవీ ప్రాంతంలో 'క్రొటలే రియా వెస్టిటా'ను గుర్తించినట్లు పరిశోధనా వివరాలు పేర్కొంటున్నాయి. అక్కడ ఈ జాతికి చెందిన నాలుగు మొక్కలను నమోదు చేయడం ప్రత్యేకంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

'క్రొటలేరియా' వృక్షజాతి పప్పుదినుసుల కుటుంబమైన ఫాబేసీకు చెందినది. ఈ జాతిలోని మొక్కలు సాధారణంగా గడ్డి లేదా చిన్న పొదల రూపంలో కనిపిస్తాయి. అయితే వివిధ 'క్రొటలేరియా' జాతులను ఖచ్చితంగా గుర్తించడానికి మొక్క ఆకృతి, పుష్ప నిర్మాణం, కాయలు, విత్తనాలు వంటి సూక్ష్మ లక్షణాలను పరిశీలించాల్సి ఉంటుంది. పాపకొల్లు ప్రాంతంలో గుర్తించిన 'క్రొటలేరియా వెస్టిటా'ను సంబంధిత శాస్త్రీయ సాహిత్యంతో సరిపోల్చి గుర్తించడం ఈ పరిశోధనలో కీలక అంశంగా నిలిచింది.

### అరుదైన అనారోగ్య సమస్యతో బాధపడుతున్న చిన్నారికి సిఎం అండ

## సిఎంఆర్ఎఫ్ ద్వారా రూ.7 లక్షల సాయం

**హైదరాబాద్,సెప్టెంబరు22,ప్రభాతవార్త:** అరుదైన అనారోగ్య సమస్యతో హైదరాబాద్‌లోని రైన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న 27 రోజుల పసికందుకు సీఎం రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. అత్యవసర శస్త్రచికిత్స అవసరమని వైద్యులు సూచించగా చికిత్సకు సుమారు రూ.7 లక్షలు ఖర్చయ్యే అవకాశం ఉంది. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం గంగారానికి చెందిన పసికందుది నిరుపేద కుటుంబం కావటంతో చికిత్సకు అవసరమయ్యే సాయం అందించాలని అధికారులను సీఎం ఆదేశించారు. సిఎంఆర్ఎఫ్ ద్వారా సాధ్యమైనంత సాయం అందించాలని సూచించారు.

## వరంగల్ ఎయిర్‌పోర్ట్‌కు అలావుద్దీన్ పేరు పెట్టాలి

### సిఎం రేవంత్‌రెడ్డికి ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసి లేఖ

**హైదరాబాద్,సెప్టెంబరు22,ప్రభాతవార్త:** వరంగల్ మామునూర్ విమానాశ్రయానికి స్వాతంత్ర్య సమరయోధుడు మౌల్వీ సయ్యద్ అలావుద్దీన్ పేరు పెట్టాలని ఎంఐఎం అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం సిఎంకు లేఖ రాశారు. వరంగల్ జిల్లాకు చెందిన అలావుద్దీన్ మక్కా మస్జిద్ ఇమామ్‌గా సేవలందించారని గుర్తు చేశారు. దేశం కోసం పోరాడిన యోధుడికి విమానాశ్రయం పేరు పెట్టడం ద్వారా తగిన గౌరవం దక్కుతుందని పేర్కొన్నారు.

## ది ప్యారడైజ్ నెగెటివ్ ప్రచారంపై కోర్టు సీరియస్

### న్యాయస్థానాన్ని ఆశ్రయించిన చిత్ర నిర్మాతలు

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** ఈ నెల 28న మోస్ట్ అవైటెడ్ మూవీ ది ప్యారడైజ్ థియేటర్లలోకి రాబోతోంది. రిలీజ్‌కు ముందు సినిమాపై అంచనాలు భారీగా పెరుగుతున్న వేళ నెగెటివ్ ప్రచారం జరుగుతోందంటూ నిర్మాతలు కోర్టును ఆశ్రయించారు. తమ సినిమాకు నష్టం కలిగించేలా ప్రచారం చేస్తున్నారని నిర్మాతలు పేర్కొనడంతో బెంగళూరు కోర్టు దీనిపై స్పందించి కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ది ప్యారడైజ్ రిలీజ్‌కు ముందు ఈ కోర్టు ఆర్డర్ చర్చనీయాంశమైంది. ఆగస్టు 6న టీజర్ రిలీజ్ అయినప్పటి నుంచి కొందరు కావాలనే సోషల్ మీడియాలో నెగెటివ్ కంటెంట్ ప్రచారం చేస్తున్నారని చిత్ర నిర్మాతలు గుర్తించారు. అలా సినిమాపై సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కొన్ని పోస్టులు, కామెంట్లు, యూఆర్ఎల్స్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి బెంగళూరులోని సిటీ సివిల్ అండ్ సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. సినిమాలో పెట్టుబడులు, ప్రమోషన్స్, డిస్ట్రిబ్యూషన్‌పై ప్రభావం పడేలా కొన్ని కంటెంట్లు ఉన్నాయని నిర్మాతలు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ పిటిషన్‌పై విచారించిన అదనపు సిటీ సివిల్ అండ్ సెషన్స్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. గుర్తించిన కొన్ని కంటెంట్లు, యూఆర్ఎల్స్ ను హోస్ట్ చేయడం, ప్రచురించడం, ట్రాన్స్మిట్ చేయడం లేదా మళ్లీ అందుబాటులోకి తీసుకురావడంపై కోర్టు ఆంక్షలు విధించింది. ఈ మధ్యంతర ఉత్తర్వులు సినిమా రిలీజ్ వరకే కాకుండా తదుపరి విచారణ వరకు మాత్రమే అమల్లో ఉంటాయి. తదుపరి విచారణ అక్టోబర్ 28న జరగనుంది.

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు
తెలంగాణ ప్రభుత్వం
శ్రీ జ్ఞాన సరస్వతీ దేవస్థానము, బాసర (గ్రా) (మం), నిర్మల్ జిల్లా
ఫోన్ నెం : 9866417979

టెండర్ నోటీసు నెం. E / 237 / 2026, తేది: 22-09-2026.
దేవస్థానము నందు Temporary Queue Lines మరియు Temporary Illumination మొత్తం (02) పనులకు గాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు కోరడమైనది. మిగతా వివరములకై www.tender.telangana.gov.in నందు చూడగలరు. బిడ్ మొదలగు తేది: 23.09.2026, బిడ్ ముగింపు తేది: 29.09.2026.
DIPR.No.10439-PP/CL/Advt/1/2026-27, తేది: 22.09.2026 సం/- కార్యనిర్వహణాధికారి

వార్త

ప్రతి ఒక్కరూ తనకు నచ్చిన దారిలో స్వర్గానికి చేరాలి కనుక అన్ని మతాలను సమాన భావంతో చూడాల్సిందే.

- ఫ్రెడరిక్ ది గ్రేట్

# ఉసురు తీసిన 'పొగ'

ప్రమాదాలంటే అనుకోకుండా వచ్చేవేనని తెలిసినా ఎక్కడో ఓ చోట అజాగ్రత్తలే ప్రాణాలు బలి తీసుకుంటాయి. ఇటీవల కాలంలో దేశంలోని పలు ఆసుపత్రులలో జరిగే అగ్నిప్రమాదాలకు పసివాళ్ల ఉసురుపోతోంది. ఏ పాపమూ ఎరుగని ముక్కుపచ్చలారని పసిగుడ్డు మాడిమసైపోతున్నప్పుడు వినిపించే రోదనలు హృదయవిదారకంగా ఉంటాయి. వారిని రక్షించే ప్రయత్నంలో కమ్ముకున్న పొగలను దాటుకుని మిగితా పసివాళ్లతో బయటపడుతున్న నర్సులను చూసి ఎవరికైనా హృదయం ద్రవించకమానదు. ఎక్కడైనా ఏదైనా ప్రమాదం జరిగితే అది ఎలాంటిదైనా ప్రమాద కారణాలను విశ్లేషించుకుని పంచనామాలతో సరిపెట్టుకునే అధికార గణాలకు ఎన్నిసార్లు జాగ్రత్తలు చెప్పినా అది తక్కువే అవుతుంది. అలాంటి మరో ప్రమాదం జరుగకుండా యంత్రాంగాన్ని సిద్ధం చేసే పని మాత్రం తమది కాదనుకుంటారు. అందుకే మళ్లీ మళ్లీ ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. ఆదిలాబాద్‌లోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఆసుపత్రిలో సోమ వారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదం రాష్ట్ర వైద్య ఆరోగ్య రంగాన్ని మరోసారి అభాసుపాలు చేసింది. అక్కడ చిన్నపిల్లల అత్యవసర వైద్యవిభాగం వార్డులో ముగ్గురు పసివాళ్లు మంటలకు ఆహుతైపోయారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఆ వార్డులో చెలరేగిన అగ్నిజ్వాలలతో దట్టమైన పొగ అలుముకోవడంతో పసివాళ్ల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. అయితే విశేషంగా చెప్పుకోదగిన అంశమే మిటంటే మంటలు చెలరేగగానే నర్సులు, తల్లులు తమకు అందిన పిల్లల్ని దొరకబుచ్చుకుని బయటకు పరుగులు తీసిన ఉదంతాల గురించి వింటుంటే ఎంతో హృదయ విదారకం అనిపిస్తోంది. వారంతా అప్రమత్తమై సుమారు 28 మంది పసివాళ్లతో బయటకు పరుగులు పెట్టి వారి ప్రాణాలు కాపాడడం అభినందించదగిన విషయం. ప్రమాదాలు జరిగినప్పుడల్లా మానవ తప్పిదాల వలనా లేదా యంత్రలోపాలతోనా అని, ప్రమాదానికి కారణమా అని బేరీజు చేసుకోవడం, తక్షణమే లోప భూయిష్టమైతే దానిని సరి చేయించుకోవడం తప్పనిసరి. ఆసుపత్రి నిర్వహణ మొత్తం ప్రభుత్వం చేతిలోనే ఉంది. చిన్నారులు ఉండే వార్డులో అగ్నిప్రమాద భద్రతా ఆడిట్ జరుగలేదు. ప్రాథమిక తనిఖీల లోపం స్పష్టంగా కన పడుతోంది. విద్యుత్ వైరింగ్ లోపాలను కూడా గుర్తించా రు. ఎసి యూనిట్‌లు నిర్వహణ సరిగా లేదు. ఇంత పెద్ద ప్రమాదంలోను ఎంతో మంది పసిపిల్లలు బయట పడడం వెనుక ఆ పిల్లల తల్లులు చేసిన పుణ్యం దాగి ఉంది. తరచు దేశంలో ఎక్కడో అక్కడ ఇలాంటి అగ్ని ప్రమాదాల్లో ఎక్కువసార్లు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో రోగుల ప్రాణాలే ముఖ్యమన్న లక్ష్యంతో ముందుకు కదలాలి. లేకుంటే ఎప్పుడు విధి ఏ రకంగా బాధిస్తుందో తెలుసుకునే అవకాశం ఉండదు. అగ్నిప్రమాద ఘటనలో ముగ్గురు పసికందులు ప్రాణాలు కోల్పోయారు. దట్టమైన పొగ వారికి ఊపిరాడకుండా చేసింది. ఎక్కడ ప్రమాదం జరిగినా అదే అలాంటి ప్రమాదం ఆఖరిది కావాలని వేయిదేవుళ్లను మొక్కుకుంటాం. కానీ మరో చోట మరోటి జరుగకూడదని కోరుకుంటాం. అయినా ప్రమాదాలు ఆగడం లేదు. దీనికంతకూ కారణం మానవ తప్పిదమేనని చెప్పుకోవాల్సిందే. యంత్ర లోపాలను సరిచేసుకోవడంలో మన బాధ్యతే ఎక్కువ. నిత్యం యంత్ర పరికరాలను శుభ్రం చేసుకుని సిద్ధంగా ఉంచుకోవాలి. గతంలోతెలుగు రాష్ట్రాల్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌ల వలన ప్రమాదాలను చూసుకుంటే భద్రతా వైఫల్యాల కారణంగా జరిగినవే ఎక్కువ. అలాంటి వాటిలో 2020లో కోవిడ్ తరుణంలో విజయవాడ స్వర్ణాపాలెస్ ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో 10 మంది మరణించారు. కోవిడ్‌కు చికిత్స పొందుతున్న రోగులు మిక్కిలి అసంతృప్తికి గురయ్యారు. ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించనందునే పెను ప్రమాదం జరిగింది. 2023లో తెలంగాణలో జరిగిన రెండుప్రమాదాల్లోనూ మొత్తం 9 మంది ఊపిరాడక చనిపోయారు. రాంగోపాల్ పేటలో ఘోర అగ్నిప్రమాదంలో భవనం కాలి ముగ్గురు చనిపోయారు. స్వప్నలోక్ కాంప్లెక్సులో జరిగిన అగ్నిప్రమాదంలో ఆరుగురు ఊపిరాడక చనిపోయారు. ఫైర్ ఎగ్జిట్ సరిగా లేకపోవడం వలన మృతి చెందారు. వీటన్నిటి నిర్వహణలో లోపం వల్లనే ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఆసుపత్రులలో జరిగే ప్రమాదాల్లో కొన్ని జాగ్రత్తలు తీసుకోవచ్చు. ముఖ్యంగా ఐసియూ ఎస్ఎన్‌సిఐ వంటి విభాగాలలో తరచు అగ్నిప్రమాద భద్రతా తనిఖీలు నిర్వహించాలి. షార్ట్‌సర్క్యూట్‌లను నివారించుటకు పాతబడిన విద్యుత్ వైరింగ్‌ను ఎప్పటికప్పుడు మార్చాలి. ఆసుపత్రి భవనాలలో ఆటోమేటిక్ ఫైర్ సేఫ్టీ సిస్టమ్‌లు ఉండాలి. స్మోక్ డిటెక్టర్‌లు, ఫైర్ అలారాలు, స్ప్రింకర్‌లు అందుబాటులోకి తెచ్చుకోవాలి. గత నెలలో మహారాష్ట్రలోని అమరావతిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో నవజాత శిశువుల వార్డులో వెంటిలేటర్‌లలో సాంకేతిక లోపం వలన ముగ్గురు పసికందుల ఊపిరి ఆగిపోయింది. ఒడిశా కటక్‌లోని ఎస్‌సిబి మెడికల్ కాలేజీ లో 10 మంది రోగులు నిర్జీవులయ్యారు. 2024లో నవంబరు ఉత్తరప్రదేశ్ ఝాన్సీ మహారాణి లక్ష్మీబాయ్ వైద్యకళాశాలలో 18 మంది నవజాత శిశువులు చనిపోయారు. ఇవన్నీ విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలనే జరిగాయి. మే 2024లో ఢిల్లీలోని వివేక్ విహార్ బేబీ న్యూబోర్న్ హాస్పిటల్‌లోకి ఆక్సిజన్ సిలిండర్ పేలిన ఘటనలో ఏడుగురు పసివాళ్లు దుర్మరణం పాలయ్యారు. కొన్ని అంశాల పట్ల బాధ్యులు అప్రమత్తంగా ఉంటే అందరూ క్షేమమే కదా!

మనిషి మనసులో ఉత్సాహం అణగారితే, ప్రపంచంలో దాన్ని మించిన పేదరికం లేదు.



హెచ్.డబ్ల్యు. ఆర్నాల్డ్

భూమి మీద నరకం అంటూ ఉంటే అది విషాదంలో మునిగిన మనిషి హృదయంలోనే ఉంటుంది.



రాబర్ట్ బర్టన్

## ప్రజావాక్కు

### పెరుగుతున్న వయోవృద్ధుల జనాభా

భారతదేశంలో శీఘ్రపట్టణీకరణతో పాటు వయోవృద్ధుల జనాభా వేగంగా పెరుగుతోంది. రాబోయే దశాబ్దాల్లో నగరాల్లో నివసించే వృద్ధుల సంఖ్య రెట్టింపు కానుందని అంచనా. ఈనేపథ్యంలో మన నగరాలమౌలిక వసతులు, వ్యవస్థలు వయోధికుల అవసరాలకు అనుగుణంగా సిద్ధంగా ఉన్నాయా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నగర రవాణా వ్యవస్థలుఇప్పటికీ వృద్ధులకు సులభంగా అందుబాటులో ఉండటంలేదు. ఎత్తైన బస్సులు, నాణ్యత లేని ఫుట్‌పాత్‌లు, దాటడానికి వీలులేని రహదారులు వారి స్వతంత్ర సంచారానికి ప్రతిబంధకంగా మారుతున్నాయి. నడకకు అనుకూలమైన సురక్షి తమైన ఫుట్‌పాత్‌లు, వీధి దీపాలు, క్రమబద్ధమైన దాటవేసే మార్గాలు అత్యంత అవసరం. ఆసుపత్రులు, ఆరోగ్య సంరక్షణ కేంద్రాలు వృద్ధుల ప్రత్యేక వైద్య అవసరాలను తీర్చేలా రూపాంతరం చెందాలి. సుదీర్ఘ వేచిఉండే సమయాలు, సంక్లిష్టమైన నమోదు ప్రక్రియలు వారికి భారం కాకుండా నావిగేషన్ సులభతరం చేయాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### ఆర్థిక సుడిగుండంలో పాకిస్థాన్

పాకిస్థాన్ ఆర్థిక సుడిగుండంలో కురుకొని పోయింది అని విద్యుత్ కష్టాలలో ఉందని వస్తున్న వార్తలు స్వయంకృత అపరాధమే. ఐతే ఇలాంటి సంఘటనలు ఇప్పుడు పాక్‌కు ఏమి కొత్త కాదు. ఇంతకు ముందుకు గోధుమ పిండి సంచుల కోసం ఆ దేశ ప్రజలు పెద్ద పోరాటమే చేసారు. ఇంధనం ధరలు పెరిగిపోవడం నిరుద్యోగం 28 శాతానికి చేరడం కొన్నిఉదాహరణలు మాత్రమే. ఆర్మీ కనుసన్నల లో పరిపాలన సాగడం సైన్యాధిపతి అన్ని తాను అయ్యి వ్యవహరించడంవల్ల కొన్నిఇబ్బందులు తలెత్తుతున్నాయి. అయితే సైన్యం పరిపాలనలో ఉన్న ప్రతి దేశం పరిస్థితి ఇలాగే ఉందని గమనించాలి.

- భారత అవినాష్, జనగామ

### మంచితనంతో జీవించాలి

మానవ జన్మ ఉత్తమమైనది. జాలి, దయ, కరుణ వంటి సద్గుణాలతో మసలుకుంటూ అవసరమైన వారికి చేతనైన సాయం చేస్తూ మానవజన్మ సార్థకం చేసుకోవాలి. అంతే కాని డబ్బులకోసం, ఆస్తులకోసం అధికారంపదవుల కోసం కొట్టుకుంటూ, తిట్టుకుంటూ అసూయద్వేషాలతో రగలిపోతూ సాటి మనిషికి హాని తలపెట్టడం వంటి పనులు చేస్తూ మానవ జన్మను నిరర్థకం చేసుకోకూడదు.

- మిథునం, హైదరాబాద్

### ఇది చేతగాని అసమర్థ ప్రభుత్వం

రాష్ట్రంలో దొంగబాబాలు, మాతలు ప్రభుత్వ భూములు ఆక్రమించి రకరకాలుగా మోసం చేస్తున్నారు. తన్ని తరిమేసి ఆక్రమణ భూములను స్వాధీనం చేసుకోవలసిన బాధ్యత అధికారులది. అధికారులకు ఆ దమ్ములేదు. ఎందుకంటే దొంగ బాబాలు ఇచ్చే లంచాలు మరిగి తెలియనట్లు నటిస్తున్నారు. పై అధికారులకు ఫిర్యాదు చేస్తే కింది అధికారులకు ఆ ఫిర్యాదు పంపుతారు. కింది అధికారులు దొంగలు అంటే ఆ దొంగలకే మరలపంపుతారు. ముఖ్యంగా తిరుపతి జిల్లా వరదయ్యపాలెం మండలం, బీఎన్ కండ్రిక మండలాలలో కల్కి అనే దొంగస్వామి వందలాది ఎకరాలు అసైన్డ్ భూములు బినామీ పేర్లతో ఆక్రమించి రకరకాలుగా మోసం చేస్తున్నారు. అధికారులకు పండగే పండగ. 40 సంవత్సరాల నుండి సీలింగ్ భూములుగా ఉన్నవిఒక్కరోజులోనే వేరే భూములుగా మారిపో తున్నాయి. ఇది ఎలా సాధ్యమో ముడుపులు తీసుకున్న వారికి మాత్రమే తెలుసు. అధికారులు కూడా బినామీ పేర్లతో భూములు కూడబెట్టుకుంటున్నారు.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### పొలిటికల్ డ్రామా

రాజకీయ పార్టీల మధ్య జరిగే గొడవల్లా పార్టీ నాయకులతో పాటు పోలీసులు కూడా గాయపడి ఆసుపత్రి పాలవుతున్నారు. ఇలాంటి పరిస్థితులు తలెత్తడానికి రాజకీయ నాయకుల ప్రవర్తనే కారణం. వారు మూకుమ్మడిగా పోలీసులపై దూసుకురావడం రెచ్చిపోయి దాడిచేయడంతో చేసేదేమిలేక పోలీసులు కూడా ఫైరైపోయి పక్కకి లాగేయడం, లాఠీలతో వెనక్కి తోసేయడం అరెస్టు చేయడం, తమ డ్యూటీ తాము చేస్తున్నారు. అయినా అందరూ పోలీసులను తప్పుపడుతున్నారు. చెడ్డ పేరువారికేవస్తోంది. బందబూతులుతిడుతున్నారు. పోలీసుల పట్ల అనుచితంగా ప్రవర్తించే రాజకీయ నాయకులు.

- శాస్త్రి, హైదరాబాద్

### పండుగను పండుగలాగానే చూద్దాం

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న వినాయక చవితి పండుగలలో భాగంగ వినాయక భక్తి పాటల సామరస్యతను చాటి చెప్పుదాం. పండుగలను రాజకీయ పార్టీల పాటల పేరుతో ముడిపెట్టవద్దు. పండుగ ఉత్సవాలను పండుగ లాగిన్ చూద్దాం. కొందరు దేవుడిని రాజకీయ పాటలకు అంటకట్టడం, ఆ పాటలను సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడం విడ్డూరం. పిచ్చిపిచ్చి పాటలన్నీ పెట్టి పూజలు చేయకూడదు.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

# ఉద్యోగాలు కల్పించే విద్య కావాలి

*గ్రామీణ విద్యార్థులు నగర విద్యార్థులతో సమానంగా ఆధునిక పరికరాలు, శిక్షణ, పరిశ్రమ అనుభవం పొందేలా మౌలిక వసతులు అభివృద్ధి చేయాలి. స్కిల్ యూనివర్సిటీని ఉద్యోగాల కోసం మాత్రమే పనిచేసే సంస్థగా కూడా చూడకూడదు. భవిష్యత్తు నైపుణ్య విద్యలో పరిశోధన, ఆవిష్కరణ, స్టార్టప్లు, వ్యవస్థాపకతకు కూడా స్థానం ఉండాలి. ఒక విద్యార్థి ఉద్యోగం పొందడమే కాకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలి. పరిశ్రమ సమస్యలను విశ్వవిద్యా లయంలో పరిశోధనా ప్రాజెక్టులుగా తీసుకోవడం, విద్యార్థుల స్టార్టప్లకు ఇంక్యుబేషన్ అందించడం, స్థానిక సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చేయడం వంటి అంశాలు స్కిల్ యూనివర్సిటీలను ఇతర సంస్థల నుంచి ప్రత్యేకంగా నిలబెట్టగలవు.*



ఆచార్య దారపురెడ్డి సూర్యచంద్రరావు

ఉన్నత విద్యలో ఒకప్పుడు ప్రధాన ప్రశ్న 'విద్యార్థి ఏ డిగ్రీ పొందాడు?' అనేది. ఇప్పుడు దానికి మరో ప్రశ్న తప్పనిసరిగా జతకావాలి, 'ఆ డిగ్రీతో అతను ఏ పని చేయగలడు?'. ఉద్యోగ ప్రపంచం వేగంగా మారుతున్న సమయంలో ఈ ప్రశ్నకు సమాధానం చెప్పలేని విద్యావ్యవస్థపై కొత్తగా ఆలోచించాల్సిన అవసరం ఏర్పడింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఆటోమేషన్, రోబోటిక్స్, డిజిటల్ టెక్నాలజీలు, గ్రీన్ ఎనర్జీ, ఆధునిక తయారీ వంటి రంగాలు ఉద్యోగాల స్వభావాన్నే మార్చుతున్నాయి. ఈ పరిస్థితిలో విద్యార్థికి కేవలం పుస్తక జ్ఞానం కాకుండా, ఆ జ్ఞానాన్ని పనిలోకి మార్చగల సామర్థ్యం ఇవ్వడం ఉన్నత విద్య ముందున్న ప్రధాన బాధ్యతగా మారింది. ఈ నేపథ్యానికే ఆంధ్రప్రదేశ్లో స్కిల్ యూనివర్సిటీల ఆలోచన ప్రాధాన్యం సంతరించుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రైవేట్ స్కిల్ యూనివర్సిటీల (స్థాపన, క్రమబద్ధీకరణ) బిల్లు 2026ను రాష్ట్ర శాసనసభ ఆగస్టు 19, 2026న ఆమోదించింది. అనంతరం శాసనమండలిలోనూ ఆమోదం పొందిన ఈబిల్లు, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య ఆధారిత విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు ఒక ప్రత్యేక చట్టపరమైన వ్యవస్థను కల్పించే దిశగా అడుగువేసింది. గ్రీన్‌ఫీల్డ్ తోపాటు బ్రౌన్‌ఫీల్డ్ స్కిల్ యూనివర్సిటీలకు అవకాశంకల్పించడం, ఇప్పటికే ఉన్న ఐటీఐలు, పాలిటెక్నిక్‌లు, ఇతరఅర్హత కలిగిన సంస్థలను స్కిల్ యూనివర్సిటీలుగా మార్చే అవకాశం ఇవ్వడం ఇందులోని ముఖ్య అంశాలు. ఈ ఆలోచనలో అసలు మార్పు 'స్కిల్' అనే పదాన్ని ఒక ప్రత్యేకశిక్షణ కార్యక్రమంగా కాకుండా విశ్వవిద్యాలయ విద్యలోనే ఒక ప్రధాన భాగంగా చూడటంలో ఉంది. సాంప్రదాయ డిగ్రీలో తరగతులు, సెమిస్టర్లు, పరీక్షలు, మార్కులు ప్రధానంగా ఉంటే, స్కిల్ యూనివర్సిటీలో నేర్చుకోవడం, చేయడం, సమస్య పరిష్కరించడం, పరిశ్రమలో అనుభవం పొందడం, ఆ అనుభవాన్ని విద్యా క్రెడిట్‌గా గుర్తించడం వంటి అంశాలకు సమాన ప్రాధాన్యం రావాలి. భారతదేశంలో హర్యానాకు చెందిన శ్రీ విశ్వకర్మ స్కిల్ యూనివర్సిటీ తన విద్యను పరిశ్రమ అవసరాలతో అనుసంధానిస్తూ, ప్రాక్టికల్ లెర్నింగ్, ఇంటర్న్ షిప్, అప్రెంటిస్షిప్, ఆన్‌ది జాబ్ ట్రైనింగ్ వంటి విధానాల ను ప్రోత్సహిస్తోంది. మహారాష్ట్రలోని సింబయాసిస్ స్కిల్స్ అండ్ ప్రొఫెషనల్ యూనివర్సిటీ కూడా పరిశ్రమ భాగస్వామ్యాలు, ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం, ప్రాక్టికల్ శిక్షణ, సర్టిఫికెట్ నుంచి డాక్టోరల్ స్థాయివరకు పలు మార్గాలను అంది స్తోంది. అంటే స్కిల్ యూనివర్సిటీ అనేది కేవలం 'చిన్న కాలిక వృత్తి శిక్షణ సంస్థ' కాదని స్పష్టమవుతోంది. ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిం చిన నమూనాలో పరిశ్రమను కేవలం ప్లేస్మెంట్ ఇచ్చే సంస్థగా కాకుండా విద్యా భాగస్వామిగా చూడాల్సిన అవ సరం ఉంది. పరిశ్రమ ప్రతినిధులు పాఠ్య ప్రణాళిక రూప కల్పనలో పాల్గొనాలి. ఏ నైపుణ్యాలకు డిమాండ్ ఉందో వారు చెప్పాలి. అవసరమైన పరికరాలు, సాఫ్ట్వేర్, సిమ్యులేటర్లు, శిక్షణా ప్రమాణాలు నిర్ణయించడంలో భాగస్వాములు కావాలి. విద్యార్థులకు అప్రెంటిస్షిప్, ఆన్‌దిజాబ్ ట్రైనింగ్, పరిశ్రమ ప్రాజెక్టులు కల్పించాలి. ఒక విద్యార్థి కోర్సు పూర్తిచేసే సమయానికి కనీసం కొంత వాస్తవిక పని అనుభవం కూడా సంపాదించి ఉండేలా విద్యా నిర్మాణం ఉండాలి. ఇక్కడే 'హబ్ అండ్ స్పోక్' నమూనా ప్రాధాన్యం పొందుతుంది. ఒక ప్రధాన విశ్వవిద్యాలయాన్ని అకడమిక్



హబ్ ఉంచి, వివిధ ప్రాంతాల్లో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేస్తే నైపుణ్య విద్యను జిల్లాల స్థాయికి తీసుకెళ్లవచ్చు. పరిశ్రమలు, వ్యవసాయ ఆధారిత ఆర్థిక కార్యకలాపాలు, పోర్టులు, లాజిస్టిక్స్ కేంద్రాలు, తయారీ క్లస్టర్లు, ఆక్వాకల్చర్ ప్రాంతాలు, సేవా రంగ కేంద్రాలకు దగ్గరగా శిక్షణా కేంద్రాలు ఏర్పడితే విద్యార్థికి శిక్షణ పొందే స్థలం ఉద్యోగం లభించే స్థలం మధ్య దూరం తగ్గుతుంది. ఈవిధానం గ్రామీణ, తీర ప్రాంత యువతకు ప్రత్యేకంగా ఉపయోగపడే అవకాశముంది. అయితే స్కిల్ యూనివర్సిటీలు ఏర్పడటం మాత్రమే సరిపోదు. ఏ రంగాల్లో కోర్సులు ప్రారంభించాలి అనే నిర్ణయం విద్యార్థుల ప్రస్తుత ఆసక్తిని బట్టి కాకుండా, భవిష్యత్తు ఉద్యోగ మార్కెట్ను అంచనా వేసి తీసుకోవాలి. ఆంధ్రప్రదేశ్లో పరిశ్రమల విస్తరణ, పోర్టులు లాజిస్టిక్స్ ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, డ్రోన్ టెక్నాలజీ, ఏరోస్పేస్, పునరుత్పాదక ఇంధనం, ఆహార ప్రాసెసింగ్, ఆక్వాకల్చర్, ఆరోగ్య సేవలు, పర్యాటకం వంటి రంగాల్లో పెరుగుతున్న అవకాశాలకు అనుగుణంగా ప్రత్యేక నైపుణ్య కోర్సులను రూపొందించవచ్చు. అయితే పరిశ్రమల అవసరాలు మారుతున్నందున పాఠ్యప్రణాళికలను కూడా నిర్దిష్ట కాల వ్యవధిలో పునఃసమీక్షించే విధానం అవసరం. స్కిల్ యూనివర్సిటీలు విజయవంతం కావాలంటే 'కోర్సు పూర్తి చేసిన విద్యార్థుల సంఖ్య' కంటే 'కోర్సు పూర్తిచేసిన తర్వాత విద్యార్థులు ఏమయ్యారు?' అనే ప్రశ్నకు ప్రాధాన్యంఇవ్వాలి. ఉద్యోగం పొందారా? స్వయం ఉపాధిలోకి వెళ్లారా? ఎంత కాలం ఉద్యోగంలో కొనసాగారు?వారి వేతనం ఎంత?యజమానులు వారి నైపుణ్యంపై సంతృప్తిగా ఉన్నారా? విద్యార్థులు తమ రంగంలో తదుపరిస్థాయి విద్యకు వెళ్లగలుగుతున్నారా? వంటి ఫలితాలను కొలవాలి. ప్రతి విశ్వవిద్యాలయం తన ప్లేస్‌మెంట్ గణాంకాలను మాత్రమే కాకుండా, ఉద్యోగ నిలకడ, వేతన స్థాయి, పరిశ్రమ అభిప్రాయంవంటి సూచికలను కూడా వెల్లడించే విధానం తీసుకురావాలి. ఇక ప్రైవేట్ స్కిల్ యూనివర్సిటీల విషయంలో నాణ్యత అందుబాటు అనే రెండు అంశాలను సమతుల్యం చేయడం చాలా ముఖ్యం. ప్రైవేట్ పెట్టుబడికి అవకాశం కల్పించడం వల్ల కొత్త మౌలిక వసతులు, ఆధునిక పరికరాలు, పరిశ్రమ భాగస్వామ్యాలు, అంతర్జాతీయ సహకారాలు రావచ్చు. కానీ 'స్కిల్' అనే పేరుతో సాధారణ డిగ్రీలకు కొత్త పేర్లు పెట్టి అదే పాత బోధనా విధానాన్ని కొనసాగించే పరిస్థితి రాకూడదు. విశ్వవిద్యాలయానికి అవసరమైన పరిశ్రమ భాగస్వామ్యాలు వాస్తవమైనవేనా? శిక్షణా పరికరాలు అందుబాటులో ఉన్నాయా? అధ్యాపకులు, ట్రైనర్లు తగిన అనుభవం కలిగి ఉన్నారా? అప్రెంటిస్షిప్ నిజంగా జరుగుతోందా? ప్లేస్‌మెంట్ వివరాలు ధృవీకరించదగినవేనా? వంటి అంశాలపై నిరంతర పర్యవేక్షణ అవసరం. అందుబాటు విషయంలోనూ స్పష్టమైన దృష్టి అవసరం. స్కిల్ యూనివర్సిటీలు కేవలం అధిక ఫీజులు చెల్లించగల విద్యార్థులకే అందుబాటులో ఉంటే వాటి సామాజిక ప్రయోజనం పరిమితమవుతుంది. ప్రతిపాదిత వ్యవస్థలో ప్రభుత్వ కోటా సీట్లకు సంబంధించిన విధానం, ఫీజు పారదర్శకత, పేద,మధ్యతరగతి కుటుంబాల విద్యార్థులకు అవకాశాలు వంటి అంశాలు కీలకం. గ్రామీణ విద్యార్థులు నగర విద్యార్థులతో సమానంగా ఆధునిక పరికరాలు, శిక్షణ, పరిశ్రమ అనుభవం పొందేలా మౌలిక వసతులు అభివృద్ధి చేయాలి. స్కిల్ యూనివర్సిటీని ఉద్యోగాల కోసం మాత్రమే పనిచేసే సంస్థగా కూడా చూడకూడదు. భవిష్యత్తు నైపుణ్య విద్యలో పరిశోధన, ఆవిష్కరణ, స్టార్టప్లు, వ్యవస్థాపకతకు కూడా స్థానం ఉండాలి. ఒక విద్యార్థి ఉద్యోగం పొందడమే కాకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలి. పరిశ్రమ సమస్యలను విశ్వవిద్యాలయంలో పరిశోధనా ప్రాజెక్టులుగా తీసుకోవడం, విద్యార్థుల స్టార్టప్లకు ఇంక్యుబేషన్ అందించడం, స్థానిక సమస్యలకు సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చేయడం వంటి అంశాలు స్కిల్ యూనివర్సిటీలను ఇతర సంస్థల నుంచి ప్రత్యేకంగా నిలబెట్టగలవు. మరో ముఖ్యమైన అంశం జీవితాంతం నేర్చుకునే విద్య. ఒక విద్యార్థి 18 లేదా 20 ఏళ్ల వయసులో పొందిన నైపుణ్యం అతని 40వ ఏటా కూడా అదే విలువను కలిగి ఉండకపోవచ్చు. సాంకేతిక పరిజ్ఞానం మారుతున్న కొద్దీఉద్యోగాల్లో కొత్త నైపుణ్యాలు అవసరమవుతాయి. అందుకే స్కిల్ యూనివర్సిటీలు కేవలం ఫుల్‌టైమ్ విద్యార్థుల కోసం కాకుండా ఉద్యోగులు, పరిశ్రమ సిబ్బంది, స్వయం ఉపాధి పొందేవారు, మధ్యలో చదువు ఆపినవారు, కొత్త రంగంలోకి మారాలనుకునేవారు వంటి వర్గాలకుకూడా రీస్కిల్లింగ్, అప్‌స్కిల్లింగ్ అవకాశాలను అందించాలి. సర్టిఫికెట్, డిప్లొమా, డిగ్రీ, మైక్రోక్రెడెన్షియల్, క్రెడిట్ బ్యాంకింగ్ వంటి సౌకర్యాలు ఈ మార్పుకు తోడ్పడగలవు. ●

# రైతు భరోసాకు డ్రోన్ టెక్నాలజీ

డా. మోటె చిరంజీవి

వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికత వినియోగం వేగం పుంజుకుంటోంది. పంటలకు పురుగుమందులు, ద్రవ ఎరువుల పిచికారీతో పాటు పంటల పర్యవేక్షణ, వ్యవసాయ సేవలను వేగంగా అందించడంలో డ్రోన్ల వినియోగం విస్తరిస్తోంది. రైతులకు డ్రోన్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంతోపాటు గ్రామీణ మహిళలు, యువతకు కొత్త ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను అమలు చేస్తోంది. కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం, కిసాన్ డ్రోన్ల ప్రోత్సాహానికి ఇప్పటివరకు రూ.141.39 కోట్లు విడుదలయ్యాయి. రైతులకు 527 డ్రోన్లు అందించడంతో పాటు 1,595 డ్రోన్ కస్టమ్ హైరింగ్ సెంటర్లు ఏర్పాటు చేశారు. రైతుల పొలాల్లో 27,099 డ్రోన్ ప్రదర్శనలు నిర్వహించి, సుమారు 30.23 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో ప్రదర్శనలు చేపట్టగా, 3.51 లక్షల మంది రైతులు వాటి ద్వారా లబ్ధి పొందారు. డ్రోన్ వినియోగానికి సంబంధించి 287 మంది డ్రోన్ పైలట్లకు శిక్షణ ఇచ్చినట్లు కేంద్రం తెలిపింది. తెలంగాణలో గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయంలో డ్రోన్ టెక్నాలజీ వినియోగానికి పరిశోధన, ప్రయోగాల ద్వారా పునాది పడింది. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయానికి 2021లో డిజిసిఏ అనుమతులు లభించడంతో పంట రక్షణ, పురుగుమందుల పిచికారీ, తెగుళ్ల వ్యాధుల గుర్తింపుపై డ్రోన్లతో పరిశోధనలు జరిగాయి. 2022లో వరి పంటలో డ్రోన్ ఆధారిత పిచికారీకి ప్రామాణిక విధానం రూపొందించగా, అనంతరం వరి, పత్తి, కంది, వేరుశెనగ, సోయాబీన్, నువ్వులు, కుసుమ వంటి ఏడు పంటలకు పంటనిర్దిష్ట డ్రోన్ పిచికారీ విధానాలు అభివృద్ధి చేసినట్లు రిచ్ నివేదిక పేర్కొంది. అలాగే తెలంగాణ ప్రభుత్వం, పిజెటిఎస్ఏయూ, రిచ్, అగ్రిటెక్ స్టార్టప్‌ల భాగస్వామ్యంతో ఆధునిక వ్యవసాయ సాంకేతికతలను పొలాల్లో పరీక్షించే కార్యక్రమాలు చేపట్టాయి. డ్రోన్ టెక్నాలజీతో పాటు పంట పర్యవేక్షణ, నీటి నిర్వహణ, పోషక యాజమాన్యం వంటి అంశాల్లోనూ సాంకేతిక పరిష్కారాలను పరీక్షించారు. ఈ చర్యల ద్వారా తెలంగాణలో డ్రోన్ ఆధారిత వ్యవసాయానికి పరిశోధన, సాంకేతిక అభివృద్ధి, ప్రయోగాల స్థాయిలో పునాది ఏర్పడింది. భవిష్యత్తులో ఈ సాంకేతికతను రైతులకు మరింత విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడం వ్యవసాయ యాంత్రీకరణలో కీలకంగా మారనుంది. డ్రోన్ టెక్నాలజీని గ్రామీణ మహిళల ఆర్థిక సాధికారతతో అనుసంధానించేందుకు నమో డ్రోన్ దీదీ పథకాన్ని కేంద్రం అమలు చేస్తోంది. 2023-24 నుంచి 2025-26 వరకు అమలయ్యే ఈ పథకానికి రూ.1,261 కోట్ల కేటాయింపుతో ఎంపిక చేసిన మహిళా స్వయం సహాయకసంఘాలకు 15,000 డ్రోన్లు అందించాలన్నది లక్ష్యం. ఈ సంఘాలు రైతులకు అద్దె ప్రాతిపదికన డ్రోన్ సేవలను అందించేలా పథకాన్ని రూపొందించారు. ఈ పథకం కింద డ్రోన్ ఖర్చులో 80 శాతం వరకు, గరిష్ఠంగా రూ.8 లక్షల వరకు కేంద్ర ఆర్థిక సహాయం అందుతోంది. డ్రోన్‌తో పాటు స్ప్రే అసెంబ్లీ, అదనపు బ్యాటరీలు, నిర్వహణ, బీమా, డ్రోన్ పైలట్ సహాయకుడి శిక్షణ వంటి సదుపాయాలను ప్యాకేజీలో చేర్చారు. భవిష్యత్తులో వ్యవసాయంలో డిజిటల్ సాంకేతికతకు మరింత ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంది. రైతులకు డ్రోన్ సేవలు సులభంగా, తక్కువ ఖర్చుతో అందుబాటులోకి వస్తే వ్యవసాయ యాంత్రీకరణకు మరింత ఊతం లభించే అవకాశముంది. ●

# ఆధునిక సాంకేతికతతో హెచ్ఎంఇఎల్‌కు కొత్త దిశ



చామిరాజు శేషు బాబు

ఒకప్పుడు రూ.21 కోట్లకుపైగా పేరుకుపోయిన నష్టాలు, మూసివేత అంచులకు చేరిన పరిస్థితి. భవిష్యత్తుపై అనిశ్చితి ఇవీ ఒకనాటి ఏపీఎచ్ఎంఈఎల్ (ఆంధ్రప్రదేశ్ హెవీ మెషినరీ అండ్ ఇంజినీరింగ్ లిమిటెడ్) ఎదుర్కొన్న సవాళ్లు. అదేసంస్థ నేడు వరుసగా లాభాలను నమోదు చేస్తూ, విస్తరణ దిశగా అడుగులు వేస్తోంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ.23.33 కోట్ల నికర లాభం సాధించడం, సింగరేణి ఆధీనంలోకి వచ్చిన తర్వాత సంచిత లాభాలు రూ.60.85 కోట్లకు చేరడం మార్పుకు నిదర్శనం. గత మూడేళ్లలోనే రూ.34.20 కోట్ల నికర లాభాలు రావడం సంస్థ పునరుజ్జీవనానికి స్పష్టమైన సంకేతం. దీనిని కేవలం ఒక ప్రభుత్వ రంగ సంస్థ సాధించిన ఆర్థిక ఘన విజయంగా చూడాల్సిన అవసరం ఉంది. నష్టాల్లో కూరుకుపోయిన సంస్థను నిలబెట్టడం ఒక దశ. దానిని లాభాల్లోకి తీసుకురావడం మరో దశ. కానీ అక్కడితో ఆగకుండా మార్కెట్‌ను విస్తరించడం, ఉత్పాదకతను పెంచడం, వ్యయాలను నియంత్రించడం, కొత్త ఉత్పత్తులను అభివృద్ధి చేయడం, జాతీయ స్థాయిలో పోటీ పడే సామర్థ్యాన్ని పెంచడం ఈ విజయంలో మరో దశగా చెప్పాలి. ఈమార్పు వెనుక ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చొరవకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణి విస్తరణతోపాటు దాని అనుబంధ సంస్థల సామర్థ్యాలను కూడా పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్న లక్ష్యంతో ఆయన ఆలోచనలు ముందుకు సాగాయి. ఒకవైపుమాత్ర సంస్థ సింగరేణిని బొగ్గు ఉత్పత్తితో పాటు రాగి, బంగారం, క్రిటికల్ మైనింగ్ లోకి పరుగులు పెట్టించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సింగరేణిని విస్తరించేలా ప్రణాళికాబద్ధంగా పరుగులు పెట్టిస్తున్నారు. ఆ క్రమంలో ఏపీఎచ్‌ఎంఈఎల్‌ను కేవలం సింగరేణికి యంత్రాలు, విడిభాగాలు సరఫరా చేసే సంస్థగా పరిమితం చేయకుండా, దేశవ్యాప్తంగా మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకునే భారీఇంజినీరింగ్ సంస్థగా తీర్చిదిద్దే దిశగా చర్యలు మొదలుపెట్టారు. సంస్థ ప్లాంటును స్వయంగా సందర్శించిన ఉపముఖ్యమంత్రిఅక్కడ పనితీరు, ఉత్పత్తి సామర్థ్యం, విస్తరణ ప్రణాళికలు, భవిష్యత్ వ్యాపార అవకాశాలపై సమీక్ష నిర్వహించారు. సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడం, ఉత్పత్తుల్లో వైవిధ్యం తీసుకురావడం, కొత్త మార్కెట్లను అన్వేషించడం ఈ సమీక్షలో ముఖ్యమైన అంశాలు. తెలుగు రాష్ట్రాలకే పరిమితం కాకుండా దేశవ్యాప్తంగా అవకాశాలను అందిపుచ్చుకోవడం అనే దిశలో ఆయన ఆలోచన చేయడం సంస్థకు కొత్త భవిష్యత్తును ఇచ్చిందని చెప్పాలి. గత నష్టాలను లెక్కపెట్టి సంస్థ భవిష్యత్తును మూసివేతతో ముగించకుండా, అందుబాటులో ఉన్న సాంకేతిక సామర్థ్యం, మానవ వనరులు, మౌలిక వసతులను కొత్త అవకాశాలతో అనుసంధానించాలన్న ఆలోచనే సంస్థకు కొత్తదిశనుచూపింది. 2023-



24లో రూ.1.05 కోట్లు, 2024-25లో రూ.9.87 కోట్లు, 2025-26లో రూ.23.33 కోట్ల రికార్డు నికర లాభాన్ని ఏపీఎచ్‌ఎంఈఎల్ ఆర్జించింది. ఈ మూడేళ్లలో లాభాల పరిమాణం గణనీయంగా పెరిగింది. ముఖ్యంగా 2025-26లో నమోదైన రూ.23.33 కోట్ల నికర లాభం సంస్థ సుమారు ఐదు దశాబ్దాల చరిత్రలో అత్యధిక వార్షిక లాభంగా నిలిచింది. అంటే మార్పు కేవలం ప్రకటనల్లో కనిపించడం లేదు. సంస్థ ఆర్థిక ఫలితాల్లోనూ ప్రతిఫలిస్తోంది. నష్టాల నుంచి లాభాల వైపు సాగిన ఈ ప్రయాణం వెనుక కేవలం ఆదాయం పెరగడం మాత్రమే కాదు. ఆర్డర్ల పెంపు, ఉత్పత్తుల్లో వైవిధ్యం, వ్యయ నియంత్రణ, ఉత్పాదకత పెంపు, అందుబాటులో ఉన్న మౌలిక వసతుల సమర్థ వినియోగం వంటి అంశాల సమ్మేళనం ఉంది. ఒక సంస్థను పునరుద్ధరించాలంటే ఒక్క నిర్ణయం సరిపోదు. అనేక చిన్నా పెద్ద నిర్వహణ నిర్ణయాల సమాహారమే పెద్ద ఫలితాన్ని ఇస్తుంది. ఏపీఎచ్‌ఎంఈఎల్ పునరుద్ధరణలో సింగరేణి పాత్రను విస్మరించలేం. సంస్థ సంక్షోభంలో ఉన్న సమయంలో సింగరేణి ఆర్డర్ల ద్వారా అండగా నిలిచింది. అనంతరం పెట్టుబడులు పెట్టి ప్రధాన భాగస్వామిగా మారింది. ప్రస్తుతం సింగరేణికి సంస్థలో 81.54 శాతం వాటా ఉంది. సింగరేణి అనుబంధ సంస్థగా ఉండటం మాత్రమే ఏపీఎచ్ఎంఈఎల్ భవిష్యత్ కాకూడదు. సింగరేణి అనుభవం, ఏపీఎచ్ఎంఈఎల్ సాంకేతిక సామర్థ్యం కలిసేలా చేసి, మరింత విస్తృత మార్కెట్‌ను సాధించడమే తదుపరి లక్ష్యంగా మారాలి. సంస్థను నిలబెట్టడం మొదటి అడుగు అయితే స్వయం బలంతో ఎదిగే స్థాయికి తీసుకెళ్లడం తదుపరి అడుగు. ఏపీఎచ్ఎంఈఎల్ వ్యాపార పరిధి కూడా క్రమంగా విస్తరిస్తోంది. సింగరేణితోపాటు బీహెచ్ఈఎల్, జెన్‌కో, ఎన్ఎండీసీ, ఆర్ఐఎన్ఎల్ వంటి సంస్థలకు యంత్రాలు, విడిభాగాలు సరఫరా చేసే అవకాశాలను సంస్థ అందిపుచ్చుకుంటోంది. కొత్త ఆర్డర్లు, ఉత్పత్తుల వైవిధ్యం, వ్యయ నియంత్రణ, ఉత్పాదకత పెంపు వంటి చర్యలు ఆర్థిక పనితీరును మెరుగుపరిచేందుకు దోహదపడుతున్నాయి. ఇక్కడే ప్రభుత్వరంగ సంస్థల పట్ల ఉన్న పాత దృక్పథాన్ని మార్చాల్సిన అవసరం కనిపిస్తుంది. ప్రభుత్వ రంగ సంస్థ అంటే ప్రభుత్వంపై ఆధారపడి నడిచే వ్యవస్థ మాత్రమే కాదు. మార్కెట్‌నుఅర్థం చేసుకోవడం, నాణ్యతను పెంచడం, సాంకేతికతను ఆధునీకరించడం, ఖర్చులను నియంత్రించడం, సమర్థవంతమైన నిర్వహణను అమలు చేయడంజరిగితే ప్రభుత్వ రంగ సంస్థలు కూడా పోటీ మార్కెట్‌లో తమ స్థానాన్ని నిలబెట్టుకోగలవని ఏపీఎచ్‌ఎంఈఎల్ నిరూపించింది. సంస్థను లాభాల్లోకి తీసుకురావడం ఎంత ముఖ్యమో ఆ లాభాలను భవిష్యత్‌లోనూ నిలబెట్టుకోవడం అంతకంటే ముఖ్యం. ఈ దిశలో ప్లాంట్ ప్రాంగణంలో 300 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. దీని ద్వారా రోజుకు సుమారు 1,200 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి, నెలకు సుమారు రూ.2 లక్షల వరకు విద్యుత్ వ్యయాన్ని ఆదా చేసే అవకాశం ఉంది. ఇది మామూలు అంశంలా కనిపించినా, పారిశ్రామిక సంస్థల దీర్ఘకాలిక ఆర్థిక స్థిరత్వంలో ఇలాంటి చర్యలే కీలకం. లాభాలు పెంచడం ఒక వైపు, వ్యయాలను తగ్గించి లాభాలను నిలబెట్టుకోవడం వ్యూహంలో ఒక భాగం. ఏపీఎచ్ఎంఈఎల్ పునరుద్ధరణలో ఈ రెండింటి సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతోంది. ●

(రచయిత : డిప్యూటీ సీఎం పీఆర్‌ఓ)

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

## 12 రాజ్యసభ స్థానాలకు
# అక్టోబర్ 16న ఎన్నికలు

### - వచ్చే 6వ తేదీ వరకు నామినేషన్లు
### - షెడ్యూల్ విడుదల చేసిన ఇసి

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** 11 రాజ్యసభ స్థానాలకు ద్వైవార్షిక ఎన్నికలతో పాటు, పశ్చిమ బెంగాల్‌లోని ఒక స్థానానికి ఉప ఎన్నికను అక్టోబర్ 16న నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ద్వైవార్షిక ఎన్నికల్లో భర్తీ కానున్న 11 స్థానాల్లో 10 ఉత్తరప్రదేశ్‌కు, ఒకటి ఉత్తరాఖండ్‌కు చెందినవి. ఎగువ సభలో (రాజ్యసభలో) ఏర్పడిన ఆకస్మిక ఖాళీని భర్తీ చేయడానికి పశ్చిమ బెంగాల్ స్థానానికి ఎన్నిక జరుగుతుంది. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం, సెప్టెంబరు 29న నోటిఫికేషన్ విడుదలవుతుంది. నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ అక్టోబరు 6గా ఉంటుంది. 7న పరిశీలన, 9న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీగా ఉంటుంది. రాజ్యసభ స్థానాలకు పోలింగ్ అక్టోబర్ 16న ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు జరుగుతుంది, అదే రోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. ఉత్తరప్రదేశ్‌లో, 10 మంది ప్రస్తుత రాజ్యసభ సభ్యుల పదవీకాలం ముగియనుంది.

పదవీకాలం ముగుస్తున్న వారిలో అరుణ్ సింగ్, గీత అలియాస్ చంద్రప్రభ, బ్రిజ్ లాల్, రామ్ గోపాల్ యాదవ్, రామ్‌జీ గౌతమ్, బి.ఎల్. వర్మ, సీమా ద్వివేది, దినేష్ శర్మ, హర్దీప్ సింగ్ పూరీ ఉన్నారు.

ఉత్తరాఖండ్‌లో, ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు నరేష్ బన్సాల్ పదవీకాలం ముగియడం వల్ల ఉప ఎన్నిక అనివార్యమైంది. పశ్చిమ బెంగాల్ స్థానం విషయానికొస్తే, రుక్మిణి మల్లిక్ రాజ్యసభకు రాజీనామా చేయడంతో అక్కడ ఉప ఎన్నిక జరుగుతోంది.

### వందేమాతరం పూర్తిగా పాడలేదని
# పౌరుడిని శిక్షించలేం!

### సుప్రీం కోర్టు తాజా వ్యాఖ్యలు సంచలనం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** జాతీయ గేయం వందేమాతరం ఆలపించే విషయంలో వివాదం చెలరేగుతున్న సంగతి తెలిసిందే. ఈ గేయంలోని ఆరు చరణాలను పాడాల్సిందే అంటూ కేంద్రం చట్టం తీసుకొచ్చింది. అయినప్పటికీ, వందేమాతరంలోని పూర్తి చరణాలు ఆలపించడాన్ని కాంగ్రెస్ సహా దేశంలోని పలు రాజకీయ పార్టీలు, సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఈ అంశంపై సుప్రీంకోర్టు తాజాగా కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఆరు చరణాలు పాడకపోయినంత మాత్రాన పౌరుడిని శిక్షించలేమని కోర్టు చెప్పింది. ఎన్ని చరణాలు పాడాలన్నది పౌరుడి వ్యక్తిగత నిర్ణయమని కోర్టు అభిప్రాయపడింది. ఆరు చరణాలు తప్పనిసరిగా పాడాల్సిందే అంటూ కేంద్రం చేసిన చట్టాన్ని వ్యతిరేకిస్తూ ప్రముఖ కర్ణాటక సంగీతకారుడు టీఎం కృష్ణ సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

వందేమాతరంలోని చివరి నాలుగు చరణాలు హిందూ దేవతలకు సంబంధించినవి ఉన్నాయని, అలాంటప్పుడు ఇతరులు ఈ చరణాలు పాడేలా బలవంత పెట్టడం సరికాదని, ఇది దేశ లౌకిక వాదానికి విరుద్ధమని తన పిటిషన్‌లో పేర్కొన్నాడు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస్ వీ మోహన ఆధ్వర్యంలోని ధర్మాసనం విచారణ జరిపింది. వందేమాతరం గేయాన్ని రెండు చరణాలు ఉంచాలా.. లేదా ఆరు చరణాలు ఉంచాలా అనే విషయంపై ఇప్పటికిప్పుడు విచారణ చేయలేమని కోర్టు తెలిపింది. అయితే, ఇలా పాడకపోతే చట్టపరంగా శిక్షించవచ్చా లేకపోతే శిక్ష నుంచి మినహాయింపు ఇవ్వొచ్చా అనే అంశంపై మాత్రం విచారణ జరుపుతామని ప్రకటించింది. వందేమాతరాన్ని పూర్తిగా ఆలపించని వారిపై ఎలాంటి క్రిమినల్ చర్యలు తీసుకోలేమని, శిక్షలు విధించలేమని తెలిపింది.

## యెమెన్‌లో మళ్లీ ముదిరిన ఘర్షణలు..
## 10 వేల మంది జిబౌటీకి వలస వెళ్లే అవకాశం



**జెనీవా, సెప్టెంబరు 22:** యెమెన్‌లో మళ్లీ తీవ్ర స్థాయిలో ఘర్షణలు కొనసాగితే, ఎర్ర సముద్రం మీదుగా జిబౌటీకి శరణార్థులుగా వెళ్లే వారి సంఖ్య 10 వేలకు చేరుకునే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి మంగళవారం హెచ్చరించింది. అదే సమయంలో యెమెన్ లోనే అంతర్గతంగా నిరాశ్రయులయ్యే వారి సంఖ్య 2.30 లక్షలకు పైగా పెరిగే ప్రమాదం ఉందని తెలిపింది. ఇరాన్ మద్దతు ఉన్న హౌతీలు ఈ నెల ప్రారంభంలో యెమెన్‌లోని ఎర్ర సముద్ర తీర ప్రాంతంపై ఆధిపత్యం సాధించారు. ఈ క్రమంలో జరిగిన తీవ్ర దాడుల్లో ఇరువైపులా వందలాది మంది మరణించారు. ఈ పరిణామాలు అంతర్జాతీయ వాణిజ్యంపై ప్రభావం చూపడంతో పాటు ఇంధన ధరల పెరుగుదలకు కూడా కారణమయ్యాయి. సౌదీ అరేబియా మద్దతుతో ఉన్న అడెన్ కేంద్రంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి విధేయులైన బలగాలకు, హౌతీలకు మధ్య జరుగుతున్న తాజా పోరాటం యెమెన్‌లో మరోసారి తీవ్రమైన మానవతా సంక్షోభాన్ని సృష్టించింది. ఇప్పటికే లక్ష మందికి పైగా పౌరులు దేశంలోనే తమ నివాసాలను విడిచి వెళ్లాల్సి వచ్చింది. మరికొందరు హింస నుంచి తప్పించుకునేందుకు ప్రమాదకరమైన సముద్ర ప్రయాణం చేస్తూ జిబౌటీకి చేరుకుంటున్నారు. యెమెన్‌లో ఘర్షణలు మరింత తీవ్రతరం అయితే భారీ స్థాయిలో ప్రజలు నిరాశ్రయులయ్యే అవకాశం ఉందని ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థ ప్రతినిధి బాబర్ బలోచ్ జెనీవాలో విలేకరులతో తెలిపారు. గత వారం రోజుల్లోనే 3 వేల మందికి పైగా ప్రజలు ఎర్ర సముద్రం దాటి జిబౌటీకి చేరుకున్నారని యుఎన్‌సిహెచ్‌ఆర్ వెల్లడించింది. ప్రస్తుత ప్రతికూల సముద్ర పరిస్థితులు అక్టోబర్ మధ్య నాటికి మెరుగుపడే అవకాశం ఉండటంతో, ఆ తర్వాత శరణార్థుల సంఖ్య గణనీయంగా పెరగవచ్చని సంస్థ అంచనా వేస్తోంది. రానున్న నెలల్లో జిబౌటీకి 10 వేలకు పైగా మంది చేరుకునే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని తమ సంస్థ, భాగస్వామ్య సంస్థలు ఏర్పాట్లు చేస్తున్నాయని బాబర్ బలోచ్ తెలిపారు. దేశంలోనే 2.30 లక్షల మందికి నిరాశ్రయ పరిస్థితి తాజా ఘర్షణల కారణంగా యెమెన్‌లో అంతర్గతంగా నిరాశ్రయులైన వారి సంఖ్య ప్రస్తుతం 1.30 లక్షలకు పైగా ఉంది. పరిస్థితి మరింత దిగజారితే ఈ సంఖ్య 2.30 లక్షలకు పైగా పెరిగే అవకాశం ఉంది.

## ఒకప్పుడు ఆంక్షలు విధించిన దేశం
## ఇపుడు వాణిజ్య ఒప్పందానికి తహతహ!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** భారతదేశ చరిత్రలో 1998 మే నెల ఒక సువర్ణాధ్యాయం. అప్పటి ప్రధానమంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి నేతృత్వంలోని ప్రభుత్వం, ప్రపంచ దేశాల అంచనాలను తలకిందులు చేస్తూ పోఖ్రాన్‌లో అణు పరీక్షలను విజయవంతంగా నిర్వహించింది. ఆపరేషన్ శక్తి పేరుతో మే 11న, ఆ తర్వాత రోజుల్లో జరిపిన ఈ పరీక్షలతో భారత్ పూర్తి అణ్వస్త్ర సామర్థ్యం కలిగిన దేశంగా ప్రపంచానికి చాటిచెప్పింది. అయితే, ఈ సాహసోపేత నిర్ణయానికి అమెరికా నుంచి తీవ్ర ప్రతిస్పందన ఎదురైంది. భారత్ అణు పరీక్షలు నిర్వహించిన వెంటనే, అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ప్రభుత్వం కఠిన ఆంక్షలను విధించింది. అమెరికా ఆయుధ ఎగుమతుల నియంత్రణ చట్టంలోని సెక్షన్ 102 (గ్లెన్ అమెండ్‌మెంట్) కింద ఈ చర్యలు తీసుకుంది. ఈ ఆంక్షల ప్రభావం భారత్‌పై బాగా పడింది. మానవత, ఆహార సహాయం మినహా అమెరికా నుంచి అందే ఆర్థిక సహాయాన్ని నిలిపివేశారు. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్య నిధి వంటి సంస్థల నుంచి భారత్‌కు అందాల్సిన కొన్ని బిలియన్ డాలర్ల రుణాలకు అడ్డుపడ్డారు. అంతేకాకుండా రక్షణ పరికరాల అమ్మకాలు, సైనిక ఆర్థిక సహాయంపై కఠినమైన ఆంక్షలు విధించారు. కొన్ని కీలక సాంకేతిక పరిజ్ఞాన బదిలీలు, రుణాలపై కూడా పరిమితులు విధించారు. అమెరికా చర్యలతో భారత్ ఏకాకి అవుతుందని చాలా దేశాలు భావించాయి. ఈ కఠిన పరిస్థితుల్లో భారత్ ఏమాత్రం వెనక్కి తగ్గలేదు. జాతీయ భద్రతా ప్రయోజనాల దృష్ట్యానే అణు పరీక్షలు నిర్వహించామని, ఏ బెదిరింపులకు భయపడబోమని భారత అధికారులు అప్పట్లో స్పష్టం చేశారు. ఆంక్షల ప్రభావాన్ని తగ్గించుకునేందుకు ప్రత్యామ్నాయ వాణిజ్య మార్గాలను అన్వేషించింది. ఆశ్చర్యకరంగా ఆంక్షల తర్వాత కూడా భారత ఆర్థిక వ్యవస్థ పటిష్ఠంగా నిలిచింది. జీడీపీ వృద్ధి రేటు బలంగా కొనసాగింది. ఆంక్షలు అమల్లో ఉన్నప్పటికీ, అమెరికాతో దౌత్యపరమైన చర్చలు కొనసాగాయి. దీనికి నిదర్శనంగా 2000 సంవత్సరంలో అధ్యక్షుడు బిల్ క్లింటన్ భారత్‌లో పర్యటించారు. ఇది ఇరు దేశాల సంబంధాలలో ఒక కీలక మలుపుగా నిలిచింది.




## ఏ ప్రాతిపదికన 'సర్' నోటీసులు?
# ఎన్నికల సంఘం వివరణ ఇవ్వాలని 'సుప్రీం' ఆదేశం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** ఢిల్లీ సర్ ప్రక్రియలో భాగంగా లాజికల్ డిస్క్రిపెన్సీస్ కేటగిరీ కింద ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసులపై సుప్రీం కోర్టు ఈసీపై పలు ప్రశ్నలు సంధించింది. ఏ ప్రాతిపదికన ఈ నోటీసులు జారీ చేస్తున్నారని ఈసీని ప్రశ్నించింది. ఈ కేటగిరీపై స్పష్టత ఇవ్వాలని చెప్పింది. సర్ నోటీసులపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ దాఖలైన పిటిషన్లపై వివరణ ఇవ్వాలని ఈసీని చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మాలా బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఢిల్లీ సర్ ప్రక్రియ జరుగుతున్న తీరుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. సర్ ప్రక్రియ కింద ఓటర్లకు జారీ చేస్తున్న నోటీసుల్లో స్పష్టమైన కారణాలు పేర్కొనట్లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది ప్రశాంత్ భూషన్ పేర్కొన్నారు. ఏ ప్రాతి ప ది కన ఓటర్లకు లాజికల్ డిస్క్రిపెన్సీ కేటగిరీ కింద నోటీసులు జారీ చేస్తున్నారని ప్రశ్నించారు. ఓటర్ల నుంచి ఏయే పత్రాలు, వివరాలను ఈసీ ఆశిస్తున్నదో కూడా స్పష్టత లేదని అన్నారు. సాధారణ ఓటర్ల వద్ద పరిమితమైన డాక్యుమెంట్స్ మాత్రమే ఉంటాయని చెప్పారు. చాలామంది దగ్గర ప్రాథమిక వివరాలున్న ప్రధాన డాక్యుమెంట్‌గా ఆధార్ కార్డు మాత్రమే ఉంటోందని చెప్పారు. ఓటర్ నమోదు ప్రక్రియలో భాగంగా ప్రజలు అప్పటికే వయసు, నివాస ధ్రువీకరణ పత్రాలు సమర్పించిన నేపథ్యంలో మళ్లీ అదనపు వివరాల నిర్ధారణకు డాక్యుమెంట్స్ ఎందుకు సమర్పించాలని ప్రశ్నించారు. నివాసం మార్పు పేరిట ఇప్పటికే ముసాయిదా ఓటర్ల జాబితా నుంచి అనేక మంది పేర్లు తొలగించారని చెప్పారు. ఇందుకు అనుసరించిన పద్ధతిపై సందేహాలు లేవనెత్తారు. ఈ విషయాలపై ఈసీ తరఫున సీనియర్ అడ్వొకేట్ డీఎస్ నాయుడు వాదనలు వినిపించారు. ప్రతి నోటీసుకు వెనక గల కారణాన్ని ఈసీ పేర్కొంటుందని ఆయన చెప్పారు. పిటిషనర్లు లెవనెత్తున్న అంశాలు వారు భావిస్తున్నంత తీవ్రమైనవి కావని అన్నారు. మరోవైపు సర్ ప్రక్రియ డెడ్‌లైన్‌ను అవసరమనుకుంటే పొడిగించేందుకు ఈసీ సుముఖంగానే ఉందని కూడా చెప్పారు. చట్టంలో పేర్కొన్న ప్రక్రియకు భిన్నంగా ఒక్కరి ఓటు కూడా తొలగించబోమని హామీ ఇచ్చారు. ఓటర్ల సహాయం కోసం ఇప్పటికే ప్రచార కార్యక్రమాలు, వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశామని కూడా చెప్పారు. ఈ సందర్భంగా సుప్రీం కోర్టు స్పందిస్తూ నోటీసులు జారీ చేస్తున్న విధానంపై ఈసీని వివరణ కోరింది. యాంత్రికంగా నోటీసులు జారీ అవుతున్నాయా అని ప్రశ్నించింది. నోటీసులకు గలకారణాలను ఈసీ ఓటర్లకు తగిన విధంగా అందిస్తోందా అని ప్రశ్నించింది. లాజికల్ డిస్క్రిపెన్సీ అంటే ఏంటో వివరించాలని కూడా చీఫ్ జస్టిస్ ఈసీని కోరారు. అసలు ఈ కేటగిరీలో నోటీసులు ఎలా జారీ చేస్తున్నారనే విషయంలో స్పష్టత ఇవ్వాలని అన్నారు.

## యమునా ప్రక్షాళనకు శ్రీకారంచుట్టిన బిట్టు తబాహి




**న్యూఢిల్లీ,సెప్టెంబరు 22:** మధ్యప్రదేశ్‌లోని అజ్నార్ నదిని ఒంటిచేత్తో శుభ్రం చేసి ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన సురేంద్ర సింగ్ చౌదరి, అలియాస్ బిట్టు తబాహి, ఇప్పుడు మరో బృహత్కార్యానికి శ్రీకారం చుట్టారు. అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకోవడమే కాకుండా నెదర్లాండ్స్‌కు చెందిన ది ఓషన్ క్లీనప్ సంస్థ వ్యవస్థాపకుడు బోయన్ స్లాట్ నుంచి ఉద్యోగ అవకాశాన్ని సైతం పొందిన బిట్టు, ఇప్పుడు దేశ రాజధాని ఢిల్లీలోని యమునా నది ప్రక్షాళనకు నడుం బిగించారు. ప్రపంచ పారిశుద్ధ్య దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్టు తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో బిట్టు తెలిపారు. మూడు రోజుల పాటు ఈ డ్రైవ్ కొనసాగుతుందని, తొలి రోజే తాను, ఇతర వాలంటీర్లు కలిసి సుమారు నాలుగున్నర గంటల పాటు శ్రమించి యమునా నదీ తీరం నుంచి 585 కిలోల చెత్తను తొలగించినట్లు వెల్లడించారు. పూలు, దండలు, పూజ సామాగ్రి, ప్లాస్టిక్ వ్యర్థాలు తీరం వెంబడి పేరుకుపోయాయి. చుట్టుపక్కల ప్రజలు కూడా మాతో కలిసి సాయం చేయడంతో మొత్తం తీరాన్ని శుభ్రం చేయగలిగాం. వచ్చిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రయాణంలో తనకు మద్దతుగా నిలిచిన ఫిలిప్ మోరిస్ సంస్థకు కూడా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు ప్రయాణించి, నదుల శుభ్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడమే తన జీవిత లక్ష్యమని బిట్టు స్పష్టం చేశారు. యమునా నది తర్వాత తన తదుపరి మజిలీ గురుగ్రామ్‌లోని ఖేడ్కీ దౌలా అని ప్రకటించారు. ఈ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన కొన్ని గంటల్లోనే వైరల్ అయింది. 3,34,000 కంటే ఎక్కువ వ్యూస్ సాధించి, వేలాది లైకులను పొందింది.

బిట్టు చేస్తున్న కృషిపై నెటిజన్లు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఒక్క వ్యక్తి తలచుకుంటే ఎంత మార్పు తీసుకురాగలడో మీరు నిరూపిస్తున్నారని ఒక యూజర్ కామెంట్ చేయగా, మీరు గొప్ప పని చేస్తున్నారు,

ఇలాగే కొనసాగించండి అని మరొకరు పేర్కొన్నారు. ఈ మంచి పని చేస్తున్నప్పుడు దయచేసి వ్యక్తిగత రక్షణ పరికరాలు వాడండి అని ఓ నెటిజన్ సూచించారు. తనకొచ్చిన గుర్తింపును సద్వినియోగం చేసుకుంటూ బిట్టు తబాహీ చేస్తున్న ఈ ప్రయత్నం ఎందరికో స్ఫూర్తిగా నిలుస్తోంది.

## కల్కాజీ ఆలయం సమీపంలో బాలికపై అత్యాచారం
### పోలీసులమంటూ బెదిరించి దాడి.. ముగ్గురు నిందితుల అరెస్ట్

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 22:** కల్కాజీ మందిర్ సమీపంలోని పార్కులో 17 ఏళ్ల బాలికపై ముగ్గురు వ్యక్తులు అత్యాచారానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. తాము పోలీసులమంటూ బాలికను, ఆమె 17 ఏళ్ల స్నేహితుడిని బెదిరించిన అనంతరం ఈ ఘటనకు పాల్పడినట్లు వెల్లడించారు. ఈ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఫిర్యాదు ప్రకారం, సెప్టెంబర్ 21న సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో బాలిక తన 17 ఏళ్ల స్నేహితుడితో కలిసి కల్కాజీ మందిర్‌కు వెళ్లింది. దర్శనం అనంతరం రాత్రి 7.30 గంటల సమయంలో సమీపంలోని ఆస్తా కుంజ్ పార్కులోకి గేట్ నంబర్ 7 ద్వారా ప్రవేశించారు. అక్కడ 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న ముగ్గురు వ్యక్తులు వారిని సంప్రదించి, తాము పోలీసులమని చెప్పినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల మాదిరిగా మాట్లాడి, ఇద్దరూ మైనర్లని, తప్పు చేస్తున్నారని, కేసు నమోదు చేయవచ్చని బెదిరించినట్లు పేర్కొన్నారు. బాలికను ఆమె స్నేహితుడి నుంచి వేరు చేసి, పార్కులోని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల్లో ఆసిఫ్ అనే వ్యక్తి తుపాకీ, కత్తితో బాలికను బెదిరించి లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలి వాంగ్మూలంలో పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.

## కామరాజ్ అల్పాహారపథకం
# ప్రారంభించిన సిఎం విజయ్

### 8వ తరగతి వరకూ పొడిగించిన టివికె సర్కారు



**చెన్నై, సెప్టెంబరు 22:** తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అందిస్తున్న ఉచిత అల్పాహార పథకాన్ని మరింత విస్తరిస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటివరకు 1 నుంచి 5వ తరగతి వరకు అమలవుతున్న ఈ పథకాన్ని మంగళవారం నుంచి 6, 7, 8 తరగతుల విద్యార్థులకు కూడా వర్తింపజేశారు. ఈ సందర్భంగా పథకం పేరును ముఖ్యమంత్రి అల్పాహార పథకం నుంచి తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, విద్యా సంస్కరణల ప్రదాత అయిన పెరుంతలైవర్ కామరాజర్ అల్పాహార పథకంగా మారుస్తున్నట్లు ప్రకటించారు. చెన్నైలోని తిరువాన్మియూర్‌లో ఉన్న ఓ ప్రభుత్వ పాఠశాలలో సీఎం విజయ్ ఈ విస్తరణ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన స్వయంగా విద్యార్థులకు అల్పాహారం వడ్డించి, వారితో కలిసి కూర్చొని భోజనం చేశారు. ఈ విస్తరణ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15,454 ప్రభుత్వ, ప్రభుత్వఎయిడెడ్ పాఠశాలల్లో చదువుతున్న సుమారు 15.3 లక్షల మంది విద్యార్థులు అదనంగా లబ్ధి పొందనున్నారు. ఈ పథకం కింద మొత్తం ప్రయోజనం పొందేవారి సంఖ్య 34.64 లక్షలకు చేరనుంది. పథకం విస్తరణ కోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం అదనంగా రూ. 217.63 కోట్లను కేటాయించింది. దీంతో ఈ పథకం మొత్తం వార్షిక బడ్జెట్ సుమారు రూ. 724 కోట్లకు పెరిగింది. వాస్తవానికి ఈ అల్పాహార పథకాన్ని 2022లో గత డీఎంకే ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న ఎం.కె. స్టాలిన్ ప్రాథమిక తరగతుల కోసం ప్రారంభించారు. ఇప్పుడు విజయ్ నేతృత్వంలోని కొత్త ప్రభుత్వం ఈ పథకాన్ని కొనసాగించడమే కాకుండా, దాని పరిధిని పెంచి దివంగత నేత కామరాజర్ పేరు పెట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం అమలు ప్రారంభమైనప్పటికీ, కొన్ని జిల్లాల్లో ఉపఎన్నికల కారణంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో అక్కడ తాత్కాలికంగా వాయిదా వేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకానికి ఆద్యుడిగా పేరుగాంచిన కామరాజర్ పేరును ఈ పథకానికి పెట్టడం ద్వారా ఆయన వారసత్వాన్ని గౌరవించినట్లయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## గూగుల్‌కు ఐర్లాండ్ డేటా పరిరక్షణ కమిషన్ షాక్
# రూ.3700 కోట్ల భారీ జరిమానా

**డబ్లిన్, సెప్టెంబరు 22:** టెక్ దిగ్గజం గూగుల్‌కు ఐర్లాండ్ డేటా ప్రొటెక్షన్ కమిషన్ భారీ షాక్ ఇచ్చింది. యూజర్ల లొకేషన్ డేటాను నిర్వహించిన విధానంలో యూరోపియన్ యూనియన్ జనరల్ డేటా ప్రొటెక్షన్ రెగ్యులేషన్ నిబంధనలను ఉల్లంఘించినందుకు ఏకంగా 403 మిలియన్ యూరోలు సుమారు రూ.3,700 కోట్లు జరిమానా విధించింది. ఈ మేరకు డీపీసీ అధికారికంగా ప్రకటించింది. 2018 మే 25 నుంచి 2020 ఫిబ్రవరి 4 మధ్య కాలంలో గూగుల్ తన యూజర్ల లొకేషన్ డేటాను ప్రాసెస్ చేసిన విధానం పారదర్శకంగా, చట్టబద్ధంగా లేదని డీపీసీ తన దర్యాప్తులో తేల్చింది. ముఖ్యంగా వెబ్ అండ్ యాప్ యాక్టివిటీ, లొకేషన్ హిస్టరీ, ఆండ్రాయిడ్‌లోని లొకేషన్ యాక్యురసీ వంటి ఫీచర్ల ద్వారా సేకరించిన డేటాను ప్రకటనలు, యూజర్ల ఆసక్తులను అంచనా వేయడానికి వాడుతున్నారనే విషయం వినియోగదారులకు స్పష్టంగా తెలియజేయలేదని కమిషన్ పేర్కొంది. అంతేకాకుండా, అవసరమైన దానికంటే ఎక్కువ కాలం డేటాను నిల్వ చేశారని ఆరోపించింది. ఈ జరిమానాతో పాటు, తమ లొకేషన్ డేటా ప్రాసెసింగ్ విధానాలను ఆరు నెలల్లోగా జీడీపీఆర్ నిబంధనలకు అనుగుణంగా మార్చుకోవాలని గూగుల్‌ను డీపీసీ ఆదేశించింది.

ఐర్లాండ్ డేటా కమిషన్ ఇప్పటివరకు విధించిన జరిమానాల్లో ఇది నాలుగో అతిపెద్దది. ప్రస్తుతం గూగుల్‌పై మరో మూడు ప్రైవసీ ఉల్లంఘనలకు సంబంధించిన దర్యాప్తులు చివరి దశలో ఉన్నాయని కూడా కమిషన్ వెల్లడించింది. ఈ తీర్పుపై గూగుల్ స్పందించింది. ఈ కేసు గతంలో తాము అనుసరించిన విధానాలకు సంబంధించినదని, 2019 నుంచే లొకేషన్ డేటా నిర్వహణలో గణనీయమైన మార్పులు చేశామని తెలిపింది. యూరోపియన్ కన్స్యూమర్ ఆర్గనైజేషన్లు 2020లో చేసిన ఫిర్యాదుల ఆధారంగా డీపీసీ ఈ దర్యాప్తును ప్రారంభించింది.



## భద్రతామండలిలో భారత్‌కు సభ్యత్వంపై నాలుగు యూరప్ దేశాల సంపూర్ణ మద్దతు

**న్యూయార్కు, సెప్టెంబరు 22:** ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చేస్తున్న ప్రయత్నాలకు పలు యూరప్ దేశాల నుంచి మద్దతు లభించింది. భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పించాలన్న డిమాండ్‌కు మధ్య ఐరోపాకు చెందిన నాలుగు దేశాలు మద్దతును ప్రకటించాయి. హంగేరీ, పోలాండ్, స్లోవేకియా, చెక్ రిపబ్లిక్ దేశాలతో కూడిన విసెగ్రాడ్ గ్రూప్ (జి4) భారత్‌కు మద్దతుగా నిలిచింది. న్యూయార్క్‌లో జరుగుతున్న 81వ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా తొలి జి4 భారత్ విదేశాంగ మంత్రుల సమావేశం జరిగింది. భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో భేటీ అనంతరం స్లోవేకియా విదేశాంగ మంత్రి జురాజ్ బ్లానార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ దక్షిణ దేశాల్లో భాగమైన భారత్ ఇండోపసిఫిక్ ప్రాంతంలో అభివృద్ధి చెందుతున్న అగ్రశక్తి అని, ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో భారత్ శాశ్వత సభ్యదేశంగా ఉండాల్సిందేనని జి4 దేశాలన్నీ ఏకాభిప్రాయంతో ఉన్నాయని ఆయన తెలిపారు. భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం భారత్ చాలాకాలంగా ప్రయత్నిస్తోంది. ప్రపంచ రాజకీయ,

ఆర్థిక పరిస్థితుల్లో భారీ మార్పులు వచ్చినప్పటికీ 1945లో ఏర్పడిన భద్రతా మండలి శాశ్వత సభ్యత్వ నిర్మాణంలో పెద్దగా మార్పులు రాలేదని భారత్ వాదిస్తోంది. భారత్ శాశ్వత సభ్యత్వ ప్రతిపాదనకు ఫ్రాన్స్, బ్రిటన్, అమెరికా, రష్యా సహా పలు దేశాలు మద్దతు తెలిపాయి. ఇక, జీ4 కూటమిలోని బ్రెజిల్, జర్మనీ, జపాన్‌లు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో శాశ్వత సభ్యత్వం కోసం పరస్పరం మద్దతు ఇచ్చుకుంటున్నాయి. అయితే చైనా నుంచి మాత్రం స్పష్టమైన మద్దతు రావడం లేదు.

# సంక్షిప్త వార్తలు

## జాముయి ఘటన నిందితుడి ఎన్‌కౌంటర్!



**జాముయి, సెప్టెంబరు 22:** దేశవ్యాప్తంగా సంచలనంగా మారిన బిహార్‌లో బాలికపై లైంగిక దాడి ఘటనలో కీలక నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపారు. జముయ్‌లో మంగళవారం తెల్లవారుజామున నిందితుడిని అదుపులోకి తీసుకునే క్రమంలో పోలీసుల నుంచి తప్పించుకునేందుకు నిందితుడు నందన్ యాదవ్ ప్రయత్నించాడని అధికారులు తెలిపారు.

పోలీసులపై కాల్పులు జరపడంతో ఎదురుకాల్పులు జరిపినట్లు చెప్పారు. గాయపడిన నందన్‌ను ఆస్పత్రికి తరలించారు. ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని పోలీసులు అరెస్టు చేశారు.

## కర్ణాటకకు అదనపు జలాలను కేటాయించాలన్న పిటిషన్ కొట్టివేసిన సుప్రీం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు22:** తమిళనాడుకర్ణాటక రాష్ట్రాల మధ్య నెలకొన్న కావేరీ జలాల వివాదంలో సుప్రీంకోర్టు కీలక ఉత్తర్వులు ఇచ్చింది. కర్ణాటకకు 70 టీఎంసీల నీరు అద నంగా కేటాయించాలని కోరుతూ ఒక ప్రైవేటు సంస్థ వేసిన రిట్ పిటిషన్‌ను కోర్టు కొట్టి వేసింది. ప్రైవేటు సొసైటీల పిటిషన్లు చెల్లవని స్పష్టం చేసింది. అంతర్రాష్ట్ర నీటి వివాదాల్లో థర్డ్ పార్టీలు లేక సొసైటీలు జోక్యం చేసు కోలేవని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది.

## ప్రపంచ వ్యాప్తంగా ఇరాన్ విమాన సేవలు బంద్!

**వాషింగ్టన్, సెప్టెంబరు 22:** ఇరాన్‌పై ఆర్థిక యుద్ధాన్ని అమెరికా మరో స్థాయికి తీసుకెళ్లింది. బుధవారంనుంచి ప్రపంచ వ్యాప్తంగా ఇరాన్‌కు చెందిన అన్ని విమానయాన సంస్థల సర్వీసులను నిలిపి వేయనున్నట్లు సంచలన ప్రకటన చేసింది. ఇరాన్ విమానాలకు ఏ దేశంలోనైనా, ఏ సంస్థ అయినా సాయం అందిస్తే, వారిని యూఎస్ డాలర్ ఆర్థిక వ్యవస్థ నుంచి వెలివేస్తామని తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఇది ఇరాన్ ఆర్థిక వ్యవస్థను మరింత ఒంటరి చేసే కీలక చర్యగా భావిస్తున్నారు. యూఎస్ ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు.

## ఐసిసిపై ఆంక్షలకు ట్రంప్ యంత్రాంగం!




**వాషింగ్టన్, సెప్టెంబర్ 22:** అంతర్జాతీయ క్రిమినల్ న్యాయస్థానం (ఐసీసీ)పై విస్తృతమైన ఆంక్షలను విధించడానికి ట్రంప్ యంత్రాంగం సిద్ధమవుతున్నట్టు వాల్‌స్ట్రీట్ జర్నల్ వెల్లడించింది. దీని కారణంగా ఐసీసీకి ఆర్థిక ఇబ్బందులు ఎదురవ్వడమే కాక, రోజువారీ కార్యకలాపాలకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొంది. ఒక వేళ ఆంక్షలు అమలయితే అమెరికా ట్రెజరీ లైసెన్స్ లేకుండా పౌరులు కానీ, సంస్థలు కానీ ఐసీసీకి నగదు, వస్తువులు పంపడంపై నిషేధం విధిస్తారు. అమెరికా ఆంక్షలు ఆరేడు నెలల గడువు తర్వాత ఐసీసీతో లావాదేవీలను అగ్రరాజ్యం నిషేధిస్తుందని తెలిపింది.

## హార్ముజ్ జలసంధిలో ఎల్పీజి ట్యాంకర్‌పై దాడి



**టెహ్రాన్, సెప్టెంబరు 22:** ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హార్మూజ్ జలసంధిలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సముద్ర మార్గం గుండా ప్రయాణిస్తున్న ఒక ఎల్‌పీజీ ట్యాంకర్‌పై గుర్తుతెలియని వస్తువులతో దాడి జరిగింది. ఈ ఘటనలో ట్యాంకర్‌ను కొన్ని శిథిలాలు తాకినట్లు యునైటెడ్ కింగ్‌డమ్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ వెల్లడించింది. దాడిలో సిబ్బం దికి ఎలాంటి ప్రాణ హాని జరగలేదని, పర్యావరణానికి కూడా ఎటువంటి నష్టం వాటిల్లలేదని యూకేఎంటీవో స్పష్టం చేసింది.



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న బిజెపి ఎంపి ఈటల రాజేందర్

## మేడిగడ్డను బూచిగా చూపి.. గోదావరి నీళ్లను ఎత్తిపోయడంలేదు

### కళ్లముందే నీళ్లున్నా రైతుల పంటలను ఎండబెడుతున్నారు

### రైతులకు కనీసం 7 నుంచి 8 గంటలు కూడా కరెంట్ ఇవ్వడం లేదు: బిజెపి ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి హైదరాబాద్‌లో భూములను ఎలా కొల్లగొట్టాలి, ఎలా డబ్బులు సంపాదించుకోవాలనే యావ తప్ప తెలంగాణ రైతులు, కరెంట్ సమస్యలపై కనీస అవగాహన లేదని బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ పాత రోజులు వచ్చాయని, సెప్టెంబర్ నెలలోనే పంటలు ఎండిపోయి కరెంట్ కోసం రైతులు సబ్ స్టేషన్ల వద్ద ధర్నాలు చేసే పరిస్థితి దాపురించిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఖైరతాబాద్‌లో ఇంజినీర్లతో కలిసి ఈటల మీడియాతో మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ముందస్తు చర్యలు తీసుకోవాలని తాము హెచ్చరిస్తే ప్రభుత్వం తమపైనే ఎదురుదాడికి దిగిందని ఈటల ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడిగడ్డను బూచి చూపి గోదావరి నీళ్లను ఎత్తిపోయకపోవడం వల్లే అనేక జిల్లాలు ఎడారిగా మారే ప్రమాదం వచ్చిందన్నారు. కేసీఆర్‌పై ఉన్న కోపంతో రేవంత్ రెడ్డి రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. కళ్లముందే నీళ్లు ఉన్నా, మేడిగడ్డ నుంచి 650 టీఎంసీల నీరు సముద్రం పాలైనా ఎల్లంపల్లికి లిఫ్ట్ చేయకపోవడం రేవంత్ రెడ్డి అజ్ఞానానికి, రైతులపై ఉన్న ద్వేషానికి నిదర్శనమని నిందించారు. రిటైర్డ్ ఇంజినీర్లు సైతం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి పరిస్థితిని వివరించేందుకు ప్రయత్నించినా ప్రభుత్వం వారి సూచనలను పట్టించుకోలేదన్నారు.

కృష్ణానదిపై తెలంగాణకు హక్కులు ఉన్నప్పటికీ ఏపీ నీటిని తరలించుకుపోతోందని, సీఎం రేవంత్‌రెడ్డి ఏపీ ప్రభుత్వంతో కుమ్మక్కై తెలంగాణ పంట పొలాలను ఎండబెట్టి రాయలసీమకు నీళ్లు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారా అని ప్రజలు గమనించాలని సూచించారు. జూరాల ఆయకట్టుకు నీళ్లు ఇవ్వకపోవడంతో రైతులే స్వయంగా గేట్లు ఎత్తే పరిస్థితి వచ్చిందంటే ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందో అర్థమవుతోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో 24 గంటల కరెంట్ దేవుడెరుగు, కనీసం 7 నుంచి 8 గంటలు కూడా రైతులకు ఇవ్వడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా వర్షాకాలంలో పంటలు వేసుకున్న రైతులకు తక్షణమే నీళ్లు విడుదల చేయాలని ఈటల రాజేందర్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# ఎల్‌నినో, గత బిఆర్ఎస్ పాలనవల్లే ఈ దుర్గతి

### రైతులను మహాసంక్షోభంలోకి నెట్టిన బిఆర్ఎస్

### జూరాల నుంచి ఎత్తిపోతలు చేపడితే సంక్షోభం వచ్చేది కాదు: మంత్రి ఉత్తమ్



**హైదరాబాద్,సెప్టెంబరు 22,ప్రభాతవార్త:** తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఇబ్బందుల దుర్గతికి ఎల్‌నినో ప్రభావం ఒక్కటే కారణం కాదని, పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో జరిగిన ప్రణాళికా లోపాలు, అసమర్థ నిర్ణయాలు, ప్రాజెక్టుల అంచనాల పెంపు, పెండింగ్ పథకాల నిర్లక్ష్యం కూడా అంతే కారణమని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆరోపించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో మంగళవారం విలేకరులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మట్లాడుతూ బిఆర్ఎస్‌పాలకులు పదేళ్లపాటు అధికారంలో ఉండి దూరదృష్టిలేకపోవడం, వర్షపు నీటిని నిల్వ చేసుకునే వ్యవస్థలను నిర్మించకపోవడంతోనే కరువు ఏర్పడిందన్నారు. ప్రకృతి కరువును తీసుకొస్తే బిఆర్ఎస్ అసమర్థ పాలన రైతుల పాలిట మహా సంక్షోభంగా మార్చిందని ఆయన ఉత్తమ్ వ్యాఖ్యానించారు. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని మొదట రూపొందించిన విధంగా జూరాల నుంచి చేపట్టి ఉంటే ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రస్తుత నెలకొన్న ఈ స్థాయి నీటి సంక్షోభం వచ్చేదే కాదని అభిప్రాయపడ్డారు. జూరాల రెండు తీరాలూ తెలంగాణ భూభాగంలోనే ఉన్నాయని, అక్కడి నుంచి ప్రాజెక్టును చేపడితే నీటి వనరు, ఎత్తిపోతల వ్యవస్థ, రిజర్వాయర్లు, పంపిణీ వ్యవస్థ మొత్తం తెలంగాణ నియంత్రణలోనే ఉండేదన్నారు. జూరాలకు వచ్చే వరద ప్రవాహం, నీటి లభ్యత, వరద కొనసాగే రోజులపై జాతీయస్థాయి ప్రతిష్ఠాత్మక సంస్థలతో హైడ్రాలజీ అధ్యయనాలు కూడా నిర్వహించారని చెప్పారు. సుమారు 70 టిఎంసిల నీటిని వినియోగించుకునే విధంగా దశలవారీ ప్రణాళిక, ప్రాజెక్టు రూపకల్పన సిద్ధమైందన్నారు. కానీ బిఆర్ఎస్ పాలకులు జూరాలను వదిలేసి పాలమూరు రైతును ఆకాశం వైపు చూసేలా చేశారని మండిపడ్డారు. జూరాల నుంచి పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం తక్కువ వ్యయం అయ్యేదని అన్నారు. ఎక్కువ ప్రాజెక్టు నిర్మాణ వ్యయం ఎక్కువ కమీషన్ అనే సిద్ధాంతంతో కెసిఆర్ కుటుంబం వ్యాపార దృక్పథంతో ఆలోచించడంతో రూ.55 వేల కోట్ల డిపిఆర్‌ను దాచిపెట్టి అబద్ధాలు చెప్పారని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును తాము రూ.28 వేల కోట్లతో పూర్తి చేశామని బిఆర్ఎస్ నేతలు ప్రచారం చేస్తున్నారని, అది పూర్తిగా అవాస్తవమని మంత్రిఅన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కేంద్ర జల సంఘానికి సమర్పించిన డిపిఆర్ విలువ సుమారు రూ.55 వేల కోట్లుగా ఉందని తెలిపారు. ఆ డిపిఆర్‌లో పూర్తిస్థాయి పంపిణీ కాలువలు, భూసేకరణ, ఇతర అనుబంధ పనులు లేవన్నారు. వాటన్నింటినీ కలిపితే ప్రాజెక్టును సంపూర్ణంగా పూర్తి చేయడానికి రూ.70 వేల కోట్ల నుంచి రూ.80 వేల కోట్ల వరకు అవసరమవుతుందని పేర్కొన్నారు. 2014 జూన్ 2 నాటికే కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, రాజీవ్ భీమా ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయని మంత్రి గుర్తుచేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ వరకు అధికారంలో కొనసాగి, నీటిపారుదల రంగంపై రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసినప్పటికీ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒక్క పెండింగ్ ప్రాజెక్టునూ సంపూర్ణంగా పూర్తి చేయలేదని విమర్శించారు. కృష్ణా జలాల్లో ఆంధ్రప్రదేశ్‌కు 512 టిఎంసిలు, తెలంగాణకు 299 టిఎంసిలు సరిపోతాయంటూ బిఆర్ఎస్ ప్రభుత్వం నాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి లిఖితపూర్వకంగా అంగీకరించి, సంతకాలు చేసి మరీ ఒప్పందం కుదుర్చు కున్నారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణకు న్యాయంగా దక్కాల్సిన వాటా కోసం పోరాడాల్సిన ప్రభుత్వం అప్పట్లో తాత్కాలిక కేటాయింపులకే తలొగ్గిందన్నారు. తెలంగాణ వాటాను కాగితాలపై కుదించి సంతకాలు పెట్టింది మీరు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత 280.7 టిఎంసి ల నీటిని వినియోగించి అత్యధిక వినియోగాన్ని నమోదు చేశామని చెప్పారు. మేము నీటి గురించి నినాదాలు చేయడం లేదు నీటిని వినియోగించి చూపిస్తున్నామన్నారు. జూన్ 2028 నాటికి ఎస్ఎల్‌బిసిని పూర్తి చేసి తీరుతామని ఆయన చెప్పారు. పంటల రక్షణకు కర్ణాటకను నీరు కోరామనీ, జూరాల వ్యవస్థపై ఆధారపడిన రైతులకు వీలైనంత త్వరగా సాగునీరు అందించేందుకు అందుబాటులో ఉన్న ప్రతి అవకాశాన్నీ పరిశీలిస్తున్నామని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. నారాయణపూర్ జలాశయం నుంచి నీటిని విడుదల చేస్తే ఎగువ కృష్ణా ద్వారా జూరాలకు అదనపు ప్రవాహాలు చేరుతాయని మంత్రి చెప్పారు. ఆ నీటిని అత్యవసరంగా అవసరమైన ప్రాంతాలకు అందించి, పంటలు దెబ్బతినకుండా కాపాడేందుకు చర్యలు చేపడతామని తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశిస్తున్నామని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితి తెలంగాణలోని కృష్ణా ఎగువ ప్రాంతంలో మరిన్ని నీటి నిల్వ సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరాన్ని మరోసారి స్పష్టం చేసిందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు.

## గుమ్మడికాయల దొంగలంటే భుజాలు తడుముకొంటున్న బిఆర్ఎస్ నేతలు

### రంగనాయకసాగర్ భూసేకరణలో హరీష్‌రావు భూదోపిడి: ప్రభుత్వవిప్ బల్మూరి వెంకట్



మంగళవారం మీడియాతో మాట్లాడుతున్న బల్మూరి వెంకట్

**హైదరాబాద్, సెప్టెంబరు 22,ప్రభాతవార్త:** దళితులకు మూడు ఎకరాల భూములు ఇవ్వడానికి బిఆర్ఎస్ నేతలకు చేతులురాలేదు సరికదా వందల ఎకరాల భూములు చెరబట్టారని గుమ్మడి కాయ దొంగ అంటే ఇప్పుడు కెసిఆర్ ఆయన కుటుంబం అనుచరగణం భుజాలు తడుముకుంటున్నారని ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్ విమర్శించారు. మంగళవారం సిఎల్‌పి కార్యాయలంలో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ నేతల నాలుగు రోజుల క్షేత్ర స్థాయి పర్యటనతో బిఆర్ఎస్ నేతల భూముల భాగోతం బయటకు వచ్చాయనీ చెప్పారు. వాస్తవాలు బయటకు రావడంతో ఇప్పుడు భయం పట్టుకుని, కాంగ్రెస్ నేతలకు భూములు ఉన్నాయని, రివర్స్ పాలిటిక్స్ చేస్తున్నారనీ ఆరోపించారు. నిజంగా కాంగ్రెస్ నేతలకు కూడా అక్రమంగా భూములు ఉంటే, మీరే గత పదేళ్ల పవర్ లో ఉన్నారు కదా మేము ప్రతిపక్షంలో ఉన్నాము, అప్పుడు ఎందుకు భయట పెట్టలేదని ప్రశ్నించారు. మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , 20 ఏండ్ల పొలిటికల్ లైఫ్ లో 17 ఏండ్లు అపోజిషన్ లోనే ఉన్నారు. అప్పుడే మీరు ఎందుకు భూముల విషయం బయటపెట్ట లేదు. విచారణ చేయలేదనీ అడిగారు. తెలంగాణకు కెసిఆర్‌ను జాతి పిత చేయాలని నిజంగా బిఆర్ఎస్ నేతలు అనుకుంటే మీరు పదేళ్ల ప్రభుత్వంలో ఉండి, ప్రభుత్వ భూములు, పేదలు, అసైన్డ్, దేవాదాయ, ఎఫ్‌టి ఎల్ ఇనాం ఇలా అక్రమంగా దోచుకున్న వందల ఎకరాల భూములను తిరిగి పేదలకు పంచి పెట్టాలని సలహా ఇచ్చారు. కెటిఆర్, హరీష్ రావు దమ్ముంటే ముందు మీ కుటుంబ సభ్యురాలు, కవిత చేసిన ఆరోపణలపై మాట్లాడాలనీ కెసిఆర్ కోటలో దెయ్యాలు ఎవరో, భూములు దోచుకున్నది ఎవరో, ఆమెను ఎందుకు బయటకు పంపారో చెప్పాలనీ వెంకట్ డిమాండ్ చేశారు. మీ తాత ముత్తాతల నుంచే నిజంగా మీకు వందల ఎకరాల భూములు ఉంటేమరి మీ అక్క రమ్యారావు తన వాటా ఏదీ అని అడుగుతోందనీ ఆమెకు ఇవ్వవా అని అడిగారు. మరి వాళ్ల భూములు కూడా మీరు ఆక్రమించుకున్నారా అని అడు గుతున్నారా దీనికి సమాధానం చెప్పండి అని అన్నారు. 2009,2014 ఎన్నికల సమయంలో తక్కువ భూములు ఉన్న హరీశ్ రావు కు 2023లో అన్ని ఎకరాల భూములు, ఫామ్ హౌస్ లు ఎలా వచ్చాయి. సిద్దిపేట, కొండపాక మండలం వెలికట్ట గ్రామంలో మాజీ సైనికులకు ప్రభుత్వం కేటాయించిన భూములను ఎలా ఆక్రమించుకున్నావు అని అడిగారు. రంగనాయకసాగర్ భూసేకరణలో హరీష్‌రావు భూదోపిడికి పాల్పడినాడని ఆరోపించారు. మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి, భూముల ఆక్రమణకు అడ్డు అదుపు లేదనీ సూర్యాపేట నుంచి, హైదరాబాద్, వయా హైదరాబాద్ టూ కర్ణాటక హంపీ వరకు జగదీశ్ రెడ్డి భూములు ఆక్రమించుకున్నాడనీ ఆరోపించారు.

## స్కిల్ యూనివర్సిటీలో గ్లోబల్ సమ్మిట్‌కు విస్తృత ఏర్పాట్లు

### అక్టోబర్ 31లోగా అవసరమైన అన్ని పనులు పూర్తి: మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు తెలంగాణ రైజింగ్ – ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026ను ఫ్యూచర్ సిటీలోని స్కిల్ యూనివర్సిటీ ప్రాంగణంలోనే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తెలి పారు. సమ్మిట్ నిర్వహణకు సంబంధించి యూనివర్సిటీలో జరుగుతున్న పనులపై అధికారులు, కాంట్రాక్టర్లతో మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. అవసరమైన మెటీరియల్, మ్యాన్‌పవర్ నియామకం, పనుల పురోగతి తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించి షెడ్యూల్ ఖరారు చేసినట్లు చెప్పారు. సమ్మిట్‌కు అవసరమైన అన్ని వసతుల పనులతో పాటు రోడ్లు, డ్రైనేజీలు, తదితర పనులను అక్టోబర్ 31లోగా పూర్తి చేసి సమ్మిట్ టీమ్‌కు అప్పగిస్తామని మంత్రి తెలిపారు. సమ్మిట్ నిర్వహణకు ముందు ఈవెంట్ మేనేజ్‌మెంట్ బృందానికి అవసరమైన సమయం ఉండేలా పనులను ముందుగానే పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. సమ్మిట్ కోసం 6 సెమినార్ హాళ్లను సిద్ధం చేస్తున్నామని, వీటితో పాటు మూడు పెద్ద హాళ్లు, మరో 10 చిన్న హాళ్లను కూడా సిద్ధం చేస్తున్నామని మంత్రి చెప్పారు. సమ్మిట్‌లో నిర్వహించే వివిధ సమావేశాలు, సెమినార్లు, ఇతర కార్యక్రమాలకు అనుగుణంగా ఈ హాళ్లను వినియోగించనున్నట్లు తెలిపారు. గ్లోబల్ సమ్మిట్ కోసం చేసే ఏర్పాట్లు, నిర్మించే మౌలిక వసతులు సమ్మిట్ అనంతరం కూడా ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు. సమ్మిట్ పూర్తయిన అనంతరం ఈ భవనాలు, మౌలిక వసతులను స్కిల్ యూనివర్సిటీకి అప్పగిస్తామని మంత్రి తెలిపారు. 54 ఎకరాల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో స్కిల్ యూనివర్సిటీని అభివృద్ధి చేస్తున్నామని మంత్రి తెలిపారు. యూనివర్సిటీ భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడేలా సమ్మిట్ కోసం చేపడుతున్న పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేస్తున్నట్లు మంత్రి వివేక్ వెంకటస్వామి తెలిపారు. యూనివర్సిటీలో బాయ్స్ హాస్టల్, గర్ల్స్ హాస్టల్, డైనింగ్ హాల్ తదితర మౌలిక వసతుల నిర్మాణ పనులు కూడా కొనసాగుతున్నాయని చెప్పారు. వీటిని వేగంగా పూర్తి చేసి వచ్చే ఫిబ్రవరి నాటికి స్కిల్ యూనివర్సిటీలో కార్యకలాపాలను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి చెప్పారు.



రాంచందర్ రావు వాహనాన్ని పోలీసులు అడ్డుకుంటున్న దృశ్యం

## బిజెపి చీఫ్ రాంచంద్రరావు అరెస్ట్

### జడ్చర్ల వద్ద అదుపులోకి తీసుకున్న పోలీసులు

### జాతీయ రహదారిపై బైఠాయించిన బిజెపి నాయకులు

**జడ్చర్ల, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** జూరాల సందర్శనకు బయలుదేరిన బిజెపి చీఫ్ రామచంద్రరావును మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల సమీపంలో మినర్వా హోటల్ వద్ద పోలీసులు అరెస్టు చేశారు. పంట పొలాలకు నీటిని విడుదల చేయాలని బిజెపి ఆధ్వర్యంలో జూరాల ప్రాజెక్టు వద్దకు బయలుదేరిన రాంచందర్ రావు వాహనాన్ని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో కొంత ఉద్రిక్త పరిస్థితి నెలకొన్నది. వెంటనే కార్యకర్తలు పెద్ద ఎత్తున పోలీసు వాహనాన్ని అడ్డుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. జూరాల నీటిని వెంటనే విడుదల చేయాలంటూ డిమాండ్ చేశారు. బిజెపి నాయకులు, కార్యకర్తలు 44వ జాతీయ రహదారిపై బైఠాయించడంతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామ్ చందర్ రావు మాట్లాడుతూ పంట పొలాలకు నీరు అవసరమని తెలిసినా ఇరిగేషన్ మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధులు ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. నీళ్లు ఇవ్వడానికి సాధ్యం కానప్పుడు రైతులకు ముందే చెప్పాల్సి ఉండే అని, పంటలు వేసుకున్నాక ఇప్పుడు చెప్తే ఏంటి ప్రయోజనం అని అన్నారు. పంటలు వేసాక ఇప్పుడు నీళ్లు ఇవ్వమంటే రైతులు ఎటు పోవాలని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అధికారులతో పాటు మండలాల్లో గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి పంట పొలాలకు నీళ్లు ఇవ్వమని చెప్పి ఉంటే రైతులు పంటలు సాగు చేసుకునే వారు కాదన్నారు. ఇప్పుడు తీరా పంటలు సాగు చేసుకున్నాక నీళ్లు ఇవ్వమని చెప్పడం దారుణం అన్నారు. అరెస్ట్ అయిన వారిలో బీసీ కమిషన్ మాజీ జాతీయ సభ్యుడు తల్లోజు ఆచారి, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ముచ్చర్ల జనార్ధన్ రెడ్డి, నాయకులు శ్రీ వర్ధన్ రెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బాలా త్రిపుర సుందరి, కిరణ్ కుమార్ రెడ్డి, సాహితీ రెడ్డి, బాలవర్ధన్ గౌడ్, అమర్నాథ్ గౌడ్, శ్యామల, నాగరాజ్, నవీన్, తదితరులు ఉన్నారు.

## రైతులు, బిజెపి పోరాటంతో దిగివచ్చిన సర్కార్

### మంత్రులు, ఎమ్మెల్యేలకు సోయలేదు: ఎంపి డికె.అరుణ



**మహబూబ్ నగర్ బ్యూరో, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** జూరాల ఆయకట్టు రైతుల సాగునీటి విడుదల అంశంలో ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై మహ బూబ్ నగర్ ఎంపీ డీకే అరుణ తీవ్ర విమర్శలు చేశారు. రైతులు, ప్రతిపక్షాల పోరాటంతో ప్రభుత్వానికి గత్యంతరం లేక దిగివచ్చిందని, ఇది రైతులు సాధించిన విజయమని అన్నారు. నీళ్లు ఇవ్వమని చెప్పిన మంత్రులు, ఎమ్మెల్యేల అహంకారాన్ని అణిచి, ప్రభుత్వం మెడలు వంచారని అన్నారు. సీఎం సొంత జిల్లాలో రైతులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నా స్పందించకపోవడం, పట్టించుకోకపోవడం ఆశ్చర్యం కలిగించిందని, పరిపాలన మీద పట్టు లేకపోవడం, రైతాంగ సమస్యలపై అవగాహనలేమి దౌర్భాగ్య పరిస్థితిలో ప్రభుత్వం ఉందని విమర్శించారు. రైతుల ఆందోళన సీఎం, మంత్రులకు పరిపాలనపై పట్టు లేకపోవడానికి నిదర్శనమన్నారు. ప్రాజెక్టులో నీళ్లు లేవని చెప్పిన మంత్రులకు కనీసం జూరాలలో ఎన్ని నీళ్లు ఉన్నాయో తెలియదని, కళ్ల ముందు నీళ్లు పెట్టుకుని, నీళ్లు ఇవ్వమని అంటే రైతులు చూస్తూ ఊరుకుంటారా అని ప్రశ్నించారు. జూరాల ఆయకట్టుకు సాగునీటిని విడుదల చేయాలని సెప్టెంబర్ 15 నుంచి రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, సెప్టెంబర్ 19వ తేదీన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ఫోన్ లో మాట్లాడి పంటలు ఎండుతున్నాయని వెంటనే నీటిని విడుదల చేయాలని తెలిపామని, మూడు రోజులుగా రైతులు, ప్రతిపక్షాలు జూరాల ప్రాజెక్టు వద్ద పెద్ద ఎత్తున ధర్నాలు చేపట్టారని తెలిపారు. ఇవాళ మంత్రులు, ఎమ్మెల్యేలపై రైతులు, ప్రజలలో వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకు, కర్ణాటకతో చర్చిస్తున్నామని చెప్పుకోవడం సిగ్గుచేటని అన్నారు. కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడామని డ్రామాలు బంద్ పెట్టాలని, రైతులను ఇబ్బం దులకు గురిచేస్తే బీజేపీ ఊరుకోదని హెచ్చరించారు. ఇటువంటి వ్యవహారం మళ్లీ చేస్తే రైతులు ఉరికించి కొడతారని అన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీకలుగా నిర్మాణాలు

### సమగ్ర ప్రణాళికతో విమానాశ్రయాల పనులు చేపట్టాలి

### శాఖల మధ్య సమన్వయంతోనే పనులు వేగవంతం

### ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమీక్ష



**హైదరాబాద్,సెప్టెంబరు22,ప్రభాతవార్త:** ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలోని తెలంగాణ భవన్ నిర్మాణాలు తెలంగాణ సంస్కృతికి ప్రతీకలుగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆదేశించారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతికి ప్రతిరూపాలుగా ఉన్న కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయం, పిల్లలమర్రి దేవాలయం శిల్ప, వాస్తు కళను పరిశీలించి, అవి ప్రతిబింబించేలా నిర్మాణాలు చేపట్టాలని సీఎం సూచించారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు, ఢిల్లీలో తెలంగాణ భవన్ నిర్మాణాలపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలు నిర్మించే ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ లైన్ల మార్పు, వాగుల ప్రవాహం మార్పు, రహదారుల మళ్లింపు, బీఎస్ఎన్ఎల్ లైన్ల, తాగు నీటి సరఫరా లైన్ల మార్పు అంశాలను అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. ఆయా అంశాలపై పూర్తి వివరాలు తెలుసుకున్న ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. విమానాశ్రయాల కాంపౌండ్ వాల్ సమీపం నుంచి రహదారులు నిర్మించాలని, ఆ రహదారులను సమీప జిల్లా, రాష్ట్ర, జాతీయ రహదారులకు అనుసంధానం చేయాలని సూచించారు. ఏ శాఖకు ఆ శాఖ విడివిడిగా పనులు చేపడితే, అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. విద్యుత్, ఆర్ అండ్ బీ, తాగు నీటి సరఫరా, నీటి పారుదల శాఖ అధికారులు సమావేశమై బీఎస్ఎన్ఎల్ అధికారులతో చర్చించి, ఏకకాలంలో పనులు సాగేలా చూడాలని సూచించారు. ప్రస్తుత అవసరాలనే కాకుండా భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకొని సమగ్ర ప్రణాళిక రూపొందించుకొని పనులు ముందుకు సాగేలా చూడాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. వాగులు, ఇతర నీటి ప్రవాహాలను మళ్లించాల్సి వస్తే, విమానాశ్రయాల ప్రాంగణం లేదా సమీపంలో చెరువులను నిర్మించి, అక్కడి నుంచి ప్రవాహాలను మళ్లించేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచించారు. విమానాశ్రయాలకు వచ్చే, వెళ్లే రహదారులు విశాలంగా ఉండడంతో పాటు సమీపంలోని ముఖ్య రహదారులకు అనుసంధానించేలా నిర్మించాలని సీఎం ఆదేశించారు. నిర్దేశిత సమయంలో పనులు పూర్తయ్యేందుకు పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. ఆదిలాబాద్, వరంగల్ విమానాశ్రయాలతో పాటు ఢిల్లీ తెలంగాణ భవన్ నిర్మాణాలకు సంబంధించిన డిజైన్లను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పరిశీలించారు. ప్రతి నిర్మాణంలోనూ తెలంగాణ సంస్కృతి, శిల్ప, వాస్తు కళలకు పెద్దపీట వేయాలని ఆదేశించారు. పలు ఆకృతుల్లో మార్పులను సీఎం సూచించారు. సమీక్షలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, విప్ బీర్ల అయిలయ్య, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ ఎన్.శ్రీధర్, ఆర్ అండ్ బీ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, విద్యుత్ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి గంగాధర్, పవర్ గ్రిడ్ ఈడీ డొమన్ యాదవ్, టీజీ ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి, ఎయిర్ కమోడోర్ రాహుల్ శుక్లా, ఏవియేషన్ డైరెక్టర్ భరత్ రెడ్డి, స్థపతి ఈమని శివనాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గిగ్ వర్కర్ కొండల్‌రెడ్డికి అండగా ప్రభుత్వం

### సిఎంఆర్ఎఫ్ చెక్ అందించిన మంత్రి వివేక్ వెంకటస్వామి

**హైదరాబాద్, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** గిగ్, ప్లాట్‌ఫామ్ వర్కర్ కొండల్‌రెడ్డి చికిత్సకు ప్రభుత్వం అండగా నిలిచింది. క్యాన్సర్‌తో బాధపడుతున్న కొండల్‌రెడ్డికి రూ.2,77,500 సిఎంఆర్ఎఫ్ చెక్కును శక్తి, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి తన చేతుల మీదుగా అందజేశారు. గత 9 సంవత్సరాలుగా ఉబర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న కొండల్‌రెడ్డి అనారోగ్యం కారణంగా ప్రస్తుతం పనిచేయలేని పరిస్థితిలో ఉన్నారు. దీంతో ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటోంది. కొండల్‌రెడ్డికి పాఠశాలకు వెళ్లే ఇద్దరు కుమార్తెలు ఉండగా, కుటుంబానికి ఆయనే ఏకైక ఆదాయ వనరుగా ఉన్నారు. ఈ పరిస్థితిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ప్రభుత్వం తక్షణమే స్పందించి సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందించిందని మంత్రి తెలిపారు. కష్ట సమయంలో తమకు అండగా నిలిచిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి వివేక్ వెంకటస్వామికి కొండల్ రెడ్డి కుటుంబం ధన్యవాదాలు తెలిపింది.

## తెలంగాణను నీటివిషయంలో ముంచింది బిఆర్ఎస్

### జూరాలపై అవగాహన లేని బిఆర్ఎస్ నాయకులు: మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు



**హైదరాబాద్,సెప్టెంబరు22ప్రభాతవార్త:** జూరాల ప్రాజెక్టు నీటి సామర్థ్యంపై బిఆర్ఎస్ నాయకులకు అవగాహన లేకపోవడంతో ఇష్టానుసారంగా మాట్లాడుతూ కెటిఆర్, హరీష్ రావు ప్రజలను రెచ్చగొడుతున్నారని, కృష్ణాజలాల విషయంలో తెలంగాణ ప్రజలను ముంచిందే బిఆర్ఎస్ పాలకులుఅని పశు సంవర్ధకశాఖ డైయిరీ, మత్స్య, క్రీడలు, యువత శాఖ మంత్రి వాకిటి శ్రీపరాష్ట్ర అబ్కారి, పర్యాటకశాఖమంత్రిజూపల్లి కృష్ణారావు విమర్శించారు. సిఎల్‌పిలో కార్యాలయంలో మంగళవారం మంత్రుల ఇరువురు మరో ఇద్దరు ఎమ్మెల్యేలతో కలిసి విలేఖరులతో మాట్లాడుతూ వచ్చే వేసవి కాలంలో తాగునీరు ఎలా ఇవ్వాలన్న దానిపై బిఆర్ఎస్ నేతలు మాట్లాడటం లేదనీ నిందించారు. వాకటి శ్రీహరి మాట్లాడతూ బిఆర్ఎస్ హయాంలో కూడా జూరాల నీటిని తాగునీటి కోసం నిల్వ ఉంచారనీ, ఆ నాడు మేం రాజకీయం చేయలేదనీ గుర్తుచేశారు. రైతులు సమన్వయం పాటించాలని చేతులు జోడించి నేను అడుగుతున్నానని చెప్పారు. బిఆర్ నాయకులు నా వ్యాఖ్యలను వక్రీకరించి రాక్షసానందం పొందుతున్నారనీ, జూరాలలో నల్లమట్టితో పూడిక ఉందనీ ఆయన తెలిపారు. ఉమాభారతి సమక్షంలో కెసిఆర్, హరీష్ రావు జూన్ 19, 2015లో కృష్ణా జలాల్లో 299టిఎంసిలు చాలని సంతకం చేసి వచ్చారు.. తెలంగాణను కృష్ణా జలాల నీటి వాటా తీసుకోవడంలో అన్యాయం చేసి, తెలంగాణ రైతులకు మరణశాసనం రాసింది కెసిఆర్ , హరీష్‌రావులే అని ఆరోపించారు. రైతుల కోసం కర్ణాటక ప్రభుత్వాన్ని నీళ్లు అడుగుతామనీ చెప్పారు. గతంలో కూడా అడిగి తీసుకున్నామనీ, నాలుగు రోజుల నుంచి కర్ణాటక ప్రభుత్వంతో మాట్లాడుతున్నామనీ ఆయన తెలిపారు. నీళ్లు వస్తే ఆ క్రెడిట్‌ను తమ ఖాతాలో వేసుకోవాలని బిఆర్ఎస్ నాయకులు హడావుడి చేస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తంచేశారు. జూరాలకు 1981లో కాంగ్రెస్ ప్రభుత్వమే శంకుస్థాపన చేసిందనీ ఆయన తెలిపారు.

**కాంగ్రెస్‌హయాంలోనే కృష్ణాజలాలు 45శాతం వినియోగించాం : జూపల్లి కృష్ణారావు:** కర్ణాటక ముఖ్యమంత్రితో శివకుమార్‌తో ఇప్పటికే తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇప్పటికే మాట్లాడారు. 20వ తేదీనే కర్ణాటక సిఎంకు లేఖ రాశామనీ తెలిపారు. కర్ణాటకలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయనీ అందుకే వెళ్లలేదనీ తెలిపారు. రాజకీయ లబ్ధి కోసమే బిఆర్ఎస్ హడావుడి చేస్తోందనీ అన్నారు. జూరాలలో 2.5 టిఎంసిలు పూడిక ఉందని మరో మూడు టిఎంసిలు డెడ్ స్టోరేజ్. వీటిని తీసుకోలేమనీ తెలిపారు. మరో 2.5 టిఎంసి తాగునీటి కోసం కేటాయించినవనీ చెప్పారు. 1 టిఎంసి ఆవిరిగా మారుతుందనీ అన్నారు. ఇక నీళ్ల లేవనీ ఎల్‌నినో కారణంగా కరువు పరిస్థితులు ఉన్నాయని రైతులకు ముందే చెప్పామనీ ఆయన వివరించారు. జూరాల దగ్గర ఈ పరిస్థితి రావడానికి కారణం గత ప్రభుత్వమే అని నిందించారు. మల్లన్నసాగర్, రంగనాయకసాగర్ లాంటి రిజర్వాయర్లు కాళేశ్వరంలో కట్టారనీ.

ఇదే విధంగా 5.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉన్న జూరాల కోసం అదనంగా ఎం దుకు రిజర్వాయర్లు కట్టలేదు? అని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూధన్‌రెడ్డి పాల్గొన్నారు.

## రైతుల గొంతు నొక్కేందుకే అక్రమ అరెస్టులు

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను ఎత్తిచూపుతూ, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తుంటే పరిష్కరించాల్సింది పోయి అక్రమ అరెస్టులతో నిరసనలను అణచివేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. జూరాల ప్రాజెక్ట్ సందర్శనకు బయలుదేరిన బిజెపి బృందాన్ని జడ్చర్ల వద్ద పోలీసులు అడ్డుకొని నిర్బంధించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. మొన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యలపై పోరాడినా, నేడు అన్నదాతల సమస్యలపై స్పందించినా ప్రభుత్వానికి నిర్బంధాలే సమాధానంగా మారాయని ఆక్షేపించారు. రైతులు అక్కడ తమను కలవనీయకుండా పోలీసులు అడ్డుకోవడంతో, వారి గోస వినేందుకు తాము ఇక్కడికి రావాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో గోదావరి పరివాహక ప్రాంతాలు, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్, జూరాల ప్రాజెక్ట్ పరిధిలోని రైతులు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని రాంచందర్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. నిజంగా ఎల్ నినో ఎఫెక్ట్ వల్ల నీరు ఇవ్వడానికి ఇబ్బంది ఉంటే, వ్యవసాయ అధికారులు, మండల స్థాయి అధికారులతో రైతులకు ఎందుకు కౌన్సిలింగ్ ఇప్పించలేదని ప్రశ్నించారు. జూరాల కింద రైతులకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఉండుంటే ఈ నష్టం జరిగేది కాదని, కానీ రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని పెట్టలేదని, ప్రీమియం కట్టలేదని మండిపడ్డారు.



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత జిల్లా అని, ఈ జిల్లాను, జిల్లా రైతులను కాపాడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉందన్నారు. ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రిలో చిన్నారులు మృతి చెందిన దురదృష్టకర సంఘటనపై రాంచందర్ రావు తీవ్ర సంతాపం తెలిపారు. మృతి చెందిన చిన్నారుల తల్లిదండ్రులకు తన తరఫున సానుభూతి తెలియజేస్తూ, పార్టీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఇప్పటికే అక్కడికి వెళ్లి పరిస్థితిని పరిశీలిస్తున్నారని వెల్లడించారు. ఈ సంఘటనపై ప్రభుత్వం వెంటనే విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# రూ.80 వేల లంచం తీసుకుంటున్న జిపిఒ, మధ్యవర్తి అరెస్ట్

## రూ.1.30 లక్షలు డిమాండ్.. ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డ అధికారులు

**మంచిర్యాల, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** భూమి బదిలీని ధ్రువీకరించి పట్టా పాస్‌బుక్‌లు జారీ చేసేందుకు లంచం డిమాండ్ చేసిన గ్రామ పరిపాలన అధికారిని, అతని తరఫున లంచం స్వీకరించిన మధ్యవర్తిని ఏసీబీ అధికారులు మంగళవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఏసీబీ ఆదిలాబాద్ రేంజ్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల జిల్లా భీమిని మండలం పెద్దపేట గ్రామ పరిపాలన అధికారిగా పనిచేస్తున్న శ్రీ దుర్గా ప్రసాద్ ఫిర్యాదుదారుడి నుంచి రూ.1.30 లక్షల లంచాన్ని డిమాండ్ చేశారు.ఇందులో మొదటి విడతగా రూ.80 వేలు, పని పూర్తయిన అనంతరం మిగిలిన రూ.50 వేలు చెల్లించాలని కోరినట్లు ఏసీబీ వివరాలలో వెల్లడైంది. ఈ మేరకు ఫిర్యాదుదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించడంతో అధికారులు వలపన్నారు.ఉప్పు ఆపరేషన్‌లో భాగంగా ఏ.ఓ. దుర్గా ప్రసాద్ బిట్టూరుపల్లి గ్రామానికి చెందిన పోతు రాజేందర్‌తో కలిసి మోటార్‌సైకిల్‌పై పెద్దపేట శివార్లలోని వ్యవసాయ క్షేత్రం సమీపానికి చేరుకున్నారు. అక్కడ ఫిర్యాదుదారుడి నుంచి రూ.80 వేల నగదును రాజేందర్‌కు అందజేయాలని ఏ.ఓ. సూచించినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదుదారుడు ఆ మొత్తాన్ని అందజేయగా, ఏసీబీ అధికారులు వెంటనే రంగంలోకి దిగి నగదును స్వాధీనం చేసుకున్నారు.రాజేందర్ చేతులకు నిర్వహించిన రసాయన పరీక్షలో చేతులు గులాబీ రంగులోకి మారడంతో పరీక్షలో సానుకూల ఫలితం వచ్చినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. దీంతో రూ.80 వేల లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకుని, ఏ.ఓ. దుర్గా ప్రసాద్‌తో పాటు రాజేందర్‌ను అరెస్టు చేశారు.అధికారిక విధులను నిర్వర్తించేందుకు లంచం డిమాండ్ చేయడం, అధికారిక పదవిని దుర్వినియోగం చేసి అక్రమ ప్రయోజనం పొందేందుకు ప్రయత్నించినందుకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇద్దరినీ కరీంనగర్‌లోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు కొనసాగుతోంది.భద్రతా కారణాల దృష్ట్యా ఫిర్యాదుదారుడి పేరు, ఇతర వ్యక్తిగత వివరాలను గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ప్రభుత్వ అధికారి ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు సమాచారం అందించాలని సూచించారు. లంచం డిమాండ్‌కు సంబంధించిన ఫిర్యాదులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.

# థియేటర్‌లో సినిమా చూస్తా,అనుమతి ఇవ్వండి

## సిఎం రేవంత్‌రెడ్డికి హీరో నాని విజ్ఞప్తి

**హైదరాబాద్,సెప్టెంబరు22,ప్రభాతవార్త:**ప్రముఖ నటుడు నాని తన తదుపరి చిత్రం ది ప్యారడైజ్ ప్రీమియర్ షోను ప్రేక్షకులతో కలిసి వీక్షించేందుకు అనుమతినివ్వాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలకు ఆయన సోషల్ మీడియా వేదికగా విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో గల ఒక థియేటర్‌లో అభిమానులతో కలిసి ఈ చిత్రాన్ని చూడాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. "ప్రేక్షకుల కోసం తీసిన సినిమాను వారితో కలిసే ఆస్వాదించాలనుకుంటున్నాను. వారి ప్రతిస్పందనలను ప్రత్యక్షంగా చూడటం నటుడిగా నాకు ఎంతో సంతృప్తినిస్తుంది. ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో సినిమా చూడటం ఒక ప్రత్యేకమైన అనుభవం" అని పేర్కొన్నారు. ఈ ప్రదర్శన సందర్భంగా ప్రభుత్వం సూచించిన అన్ని నిబంధనలను, భద్రతా ప్రమాణాలను పాటిస్తామని హామీ ఇస్తూ, తన విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలించాలని ఆయన కోరారు.

# ఏపిలో రైతుల కేరింతలు.. తెలంగాణలో ఆక్రందనలు

## విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

### రేవంత్ సర్కార్‌పై హరీశ్‌రావు విమర్శలు

**హైదరాబాద్,సెప్టెంబరు22,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ హయాంలో రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను ఇచ్చామని, కాంగ్రెస్ ప్రభుత్వం 7 గంటల కన్నా ఎక్కువగా విద్యుత్‌ను సరఫరా చేయడం లేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విమర్శించారు. విద్యుత్ వ్యవస్థ నిర్వహణలో రాష్ట్ర ప్రభుత్వం ఫెయిల్ అయిందని.. యాదాద్రి పవర్ ప్లాంట్ పూర్తి సామర్థ్యం 4 వేల మెగావాట్లకు 400 మెగావాట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారని రేవంత్ ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ విజన్‌తో దేశంలో ఎక్కడా లేని విధంగా యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్‌ను నిర్మించారు.

యాదాద్రికి జీ10, జీ11 క్వాలిటీ కోల్ కావాలి. కానీ జీ13,జీ14 క్వాలిటీ కోల్ వాడుతున్నారు. బొగ్గు వాడకంలో నాణ్యతా లోపం ఉంది. కొత్తగూడెంలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఆగింది. భద్రాద్రిలో 540 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఆగింది. 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉంటే ఈ రోజు బొగ్గు కొరత ఎందుకు ఏర్పడుతుంది. ఈ నిల్వలు ఎక్కడ అని ప్రశ్నించేందుకు నేను క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళితే పోలీసులు అడ్డుకున్నారని మండిపడ్డారు.

రాష్ట్ర విభజన సందర్భంగా 1600 మెగావాట్ల విద్యుత్ ఎన్.టి.పి.సి ద్వారా ఇస్తామని చెప్పారు. మేము తొలివిడతగా ఎన్టీపీసీ 800 మెగావాట్ల కేంద్రాన్ని స్థాపించేలా చర్యలు తీసుకుని పవర్ తీసుకున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వద్దు అని ఎందుకు ఖర్చు లేని పనికి ఎందుకు నో చెబుతోంది. మన దగ్గర తయారు అయ్యే సింగరేణి ఉత్పత్తి విద్యుత్ వద్దు అని రాజస్తాన్ ప్రభుత్వంతో పీపీఏ కుదుర్చుకున్నారు. రాజస్తాన్‌కు కరెంటు ఇవ్వాల్సిన అవసరం ఏముంది..? అని ప్రశ్నించారు. రైతుల పంటలు ఎండబెట్టి ఉసురుబోసుకుంటున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన విద్యుత్ ఉత్పత్తిలో 3వ వంతు కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వడం లేదన్నారు హరీశ్ రావు. రైతులకు 7 నుంచి 8 గంటలు కరెంటు ఇవ్వడం లేదు. థర్మల్ పవర్ స్టేషన్ లో 45 రోజులు బొగ్గు నిల్వలు ఉండాలి.. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు శ్రీశైలం నీళ్ల బేసిన్ కు సంబంధం లేని కుప్పంకు తీసుకువెళ్లారు.

రేవంత్ రెడ్డి చేతకానితనాన్ని ఎల్ నినో మీద పెడుతున్నారు. ఏపీ సీఎం శ్రీశైలం నుంచి 700 కిలోమీటర్లు కృష్ణా నదీ జలాలు తీసుకువెళ్తున్నారు. బేసిన్ కాని బేసిన్ కు చంద్రబాబు నీళ్లు తీసుకెళ్తున్నారు. బేసిన్ లోనే ఉన్న ప్రాజెక్టులకు రేవంత్ రెడ్డి నీళ్లు తీసుకెళ్లడం లేదు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి మాత్రం స్వంత జిల్లా పంటలను ఎండబెడుతున్నారు. ఏపీలో రైతుల కేరింతలు కొడుతుంటే తెలంగాణలో రైతుల ఆక్రందనలు వినబడుతున్నాయన్నారు.

గులాబీ చొక్కాలకు ఇందిరమ్మ ఇండ్లు ఇస్తున్నామని పొంగులేటి అన్నారు. ఆనాడు బీఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రి సీతక్క తల్లిదండ్రులకు పోడు పట్టాలు ఇచ్చామని హరీశ్ రావు గుర్తు చేశారు.. బీఆర్ఎస్ ఒత్తిడి తెస్తే మంత్రులు కర్ణాటక వెళ్తున్నారన్నారు.

# 5రోజుల డ్రామాల్లో ఏం తేల్చారో చెప్పండి

## తెలంగాణకు కాంగ్రెస్ దయ్యం పట్టింది: మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



మంగళవారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు22,ప్రభాతవార్త:** అనుమతి లేకుండా ప్రైవేటు ఆస్తిలోకి వెళ్లకూడదని తెలీదా? అని బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి ప్రశ్నించారు. మీ ఇళ్లలోకి అలా వస్తే అనుమతి ఇస్తారా? అని మండిపడ్డారు. ఒకరి భూముల గురించి విచారించే హక్కు మీకు ఉందా? అని ప్రశ్నించారు. భూముల విషయంలో ఏవైనా తేడాలు ఉంటే అధికారులు నివేదిక ఇస్తారన్నారు. 5 రోజులు డ్రామాలు చేశారని, ఏం తేల్చారో చెప్పాలని డిమాండ్ చేశారు.మంగళవారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాటా ్లడారు. నేరస్తుల మాదిరిగా పక్కా వ్యూహంతో ఫామ్ హౌస్ లపై దాడి చేద్దామని ప్రజా భవన్ వద్ద కాంగ్రెస్ వాళ్లు జమ అవుతున్నారని ఎద్దేవా చేశారు. అనుమతి లేకుండా ప్రైవేటు వ్యక్తుల ఇళ్లల్లోకి వెళ్లవద్దని మీకు తెలియదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులకు ట్రాన్స్‌పోర్ట్ ఏర్పాటు చేసింది ఎవరు? ప్రభుత్వం తరపున వెళ్లారా...? పార్టీ తరపున వెళ్లారా? భట్టి విక్రమార్క మీకు ట్రాన్స్ పోర్ట్ ఏర్పాటు చేశారా లేక సీఎం ఏర్పాటు చేశారా? అని ప్రశ్నించారు. వ్యక్తుల భూముల్లోకి వెళ్లి విచారణ చేసే హక్కు మీకు ఎక్కడిది అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అసలు సమస్యలు వేరే ఉన్నాయి, జనరేటర్లతో రైతులు వ్యవసాయం చేస్తున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల పర్యటనలను కాంగ్రెస్ వాళ్లే వ్యతిరేకిస్తున్నారు, కాంగ్రెస్ వాళ్ల టూర్ సర్కస్‌ను తలపిస్తోందని, దీనికి ప్రభుత్వం,కాంగ్రెస్ పార్టీ ఎవరు భాధ్యత వహిస్తారో చెప్పాలని ప్రశ్నించారు. ఎల్‌నినో పేరుతో తప్పించుకోవాలని చూస్తున్నారు, తెలంగాణకు కాంగ్రెస్ దయ్యం పట్టిందని దుయ్యబట్టారు. సీసీ కెమెరాలను చూసి నేరస్తులు భయపడతారు, సీసీ కెమెరాలను చూసి కాంగ్రెస్ నేతలకు ఎందుకు అంత భయం అని ప్రశ్నించారు. కాంగ్రెస్ వాళ్లు గ్యాంగ్ లాగా తయారు అయ్యి ఫామ్ హౌస్‌ల వద్దకు వెళ్లారు అని మండిపడ్డారు. ఎండిపోయిన పంటలను ఎందుకు కాంగ్రెస్ వాళ్లు పరిశీలించడం లేదు అని ప్రశ్నించారు. నాకు షాబాద్ మండలం మద్దూరు అనే గ్రామంలో భూమి ఉందని అఫిడ విట్ లో పెట్టాను కాంగ్రెస్ నాయకులు ముఖ్యంగా మంత్రి కోమటి రెడ్డి వెంకట రెడ్డి నాకు ఎయిర్ పోర్టు పక్కనే విలువైన భూములున్నాయని పదేపదే చేసిన ఆరోపణలు వట్టివే అని తేలిపోయిందన్నారు.సీసీ టీవీలు వ్యవసాయ క్షేత్రం లో పెట్టుకుంటే తప్పా ?...ఆవులు ,కోళ్లు అక్కడుంటాయ్ ..అవి దొంగతనం కాకుండా సీసీ టీవీ లు పెట్టుకోవద్దా ? .ఫార్మ్ హౌజ్ లకు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు వెళ్లడం వారి కుటుంబసభ్యులకు కూడా ఇష్టం లేదు, కాంగ్రెస్ నాయకులు వెళ్లాల్సింది, ప్రైవేట్ ఆస్తుల దగ్గరకు కాదు, ప్రజల సమస్యల దగ్గరకు వెళితే బాగుంటుందన్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై బిఆర్ఎస్ కసరత్తు

**హైదరాబాద్,సెప్టెంబరు22,ప్రభాతవార్త:** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలపై బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. ఈ మేరకు మంగళవారం తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నద్ధతపై పార్టీ నేతలతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్,మాజీ మంత్రి కేటీఆర్, బిఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్,మాజీ మంత్రి హరీశ్‌రావు సమావేశం అయ్యారు. హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల మాజీ మంత్రులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల సన్నద్ధతపై నేతలకు కేటీఆర్, హరీశ్‌రావు దిశా నిర్దేశం చేశారు. త్వరలో ఎన్నికలు జరగనున్న ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించనున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పార్టీ నేతలకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటర్ల ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సమావేశంలో చర్చ చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు వంటి ప్రాథమిక అంశాలతో పాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు, ప్రభుత్వ ఉద్యోగులు, గ్రాడ్యుయేట్లలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత ఉందన్న అభిప్రాయం సమావేశంలో వ్యక్తమైంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల్లో వ్యతిరేకత ఉందని సమావేశంలో మాజీ మంత్రులు వ్యక్తం చేశారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధిస్తుందన్న విశ్వాసం నేతలు వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం కోసం ఇప్పటి నుంచే పకడ్బందీగా పనిచేయాలని నిర్ణయం తీసుకు న్నారు.

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల నమోదుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని దిశానిర్దేశం చేశారు. ఎన్నికల సన్నద్ధతలో భాగంగా ఉమ్మడి జిల్లాల వారీగా కార్యాచరణ రూపొందించడంపై చర్చ చేశారు. త్వరలో ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలతో సమావేశాలు నిర్వహించి ఎన్ని కల సన్నద్ధతపై మరింత చర్చించాలని నిర్ణయించారు.

# గ్రీన్‌లాండ్‌లో మరో రెండు అమెరికాబేస్‌ల ఏర్పాటుకు ఒప్పందం

## గ్రీన్‌ల్యాండ్,డెన్మార్క్ ప్రధానులతో ట్రంప్ భేటీ



**న్యూయార్క్, సెప్టెంబరు 22:** ఆర్కిటిక్, ఉత్తర అట్లాంటిక్ ప్రాంతాల్లో భద్రతను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ డెన్మార్క్, గ్రీన్‌లాండ్‌తో ఒప్పందం కుదుర్చుకున్నారు.ఇందులోభాగంగా మరె రెండు అమెరికా బేస్‌లు అక్కడ ఏర్పాటుచేస్తారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికాలో భాగం చేయాలంటూ ట్రంప్ గతంలో చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ ఒప్పందం ప్రాధాన్యం సంతరించుకుంది. మంగళ వారం న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా ఈ ఒప్పందంపై సంతకాలు జరిగాయి. గ్రీన్‌లాండ్‌ను డెన్మార్క్ ఆధీనంలోనే కొనసాగిస్తూ అక్కడ అమెరికా సైనిక ఉనికిని విస్తరించే అంశంపై ఒప్పందం కుదిరినట్లు ట్రంప్ వెల్లడించారు. ఇది యూరప్, అమెరికా, అందరికీ ఎంతో గొప్ప విషయం. గ్రీన్‌లాండ్‌కు కూడా ఇది అద్భుతంగా ఉంటుందని ఒప్పందంపై సంతకం చేసే ముందు ట్రంప్ వ్యాఖ్యానించారు.గ్రీన్‌లాండ్‌లో అమెరికా సైనిక ఉనికి విస్తరగ్రీన్‌లాండ్‌ను కొనుగోలు చేయాలనే ఆసక్తిని ట్రంప్ పలుమార్లు వ్యక్తం చేశారు. ఈ స్వయం ప్రతిపత్తి కలిగిన భూభాగాన్ని డెన్మార్క్ నుంచి అమెరికా స్వాధీనం చేసుకోవచ్చని గతంలో ఆయన వ్యాఖ్యలు చేశారు. డెన్మార్క్ అమెరికాకు నాటో మిత్రదేశం కావడం గమనార్హం. మంగళవారం ఐరాస సర్వసభ్య సమావేశంలో ప్రసంగించిన ట్రంప్ తాజా భద్రతా ఒప్పందానికి సంబంధించిన కొన్ని వివరాలను వెల్లడించారు. అనువైన ప్రాంతాల్లో భారీ సైనిక ఉనికిని అభివృద్ధి చేసే ప్రక్రియను వెంటనే ప్రారంభిస్తామని తెలిపారు. ప్రస్తుతం వాయువ్య గ్రీన్‌లాండ్‌లోని పిటుఫిక్ స్పేస్ బేస్‌లో అమెరికా సైనిక ఉనికి ఉంది. క్షిపణి హెచ్చరికలు, క్షిపణి రక్షణ, అంతరిక్ష నిఘా వంటి కార్యకలాపాలకు ఈ స్థావరం అమెరికా, నాటోకు సహకరిస్తోంది.1945తో పోలిస్తే గ్రీన్‌లాండ్‌లో అమెరికా సైనిక ఉనికి గణనీయంగా తగ్గింది. అప్పట్లో 17 స్థావరాలు, ఇతర సైనిక కేంద్రాల్లో వేలాది మంది సిబ్బంది ఉండగా, ప్రస్తుతం పిటుఫిక్‌లో సుమారు 200 మంది సిబ్బంది ఉన్నారు.అమెరికా భద్రతా ఆందోళనలను పరిష్కరించడంతో పాటు గ్రీన్‌లాండ్ సార్వభౌమత్వాన్ని కాపాడే లక్ష్యంతో అమెరికా, డెన్మార్క్, గ్రీన్‌లాండ్ అధికారులు నెలల తరబడి చర్చలు జరిపారు.డెన్మార్క్ ప్రధాని మెట్టె ఫ్రెడరిక్సెన్ మాట్లాడుతూ ఈ ఒప్పందం దీర్ఘకాలిక సహకారానికి ఒక రూపకల్పనను అందించగలదని అన్నారు. మిస్టర్ ప్రెసిడెంట్, మీరు స్పష్టంగా చెప్పారు ప్రత్యర్థులు మీకు చాలా దగ్గరగా రావడం మీకు ఇష్టం లేదని. నేను పూర్తిగా అంగీకరిస్తున్నాను" అని ఆమె పేర్కొన్నారు.గ్రీన్‌లాండ్ ప్రధాని జెన్స్‌ఫ్రెడరిక్ నీల్సెన్ ఈ ఒప్పందాన్ని "మూడు పక్షాలకు ప్రయోజనం చేకూర్చే ఒప్పందం"గా అభివర్ణించారు.మీ భద్రతే మా భద్రత, మా భద్రతే మీ భద్రత" అని ఆయన అన్నారు. అమెరికా గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకునే ఆలోచన ఇకపై లేదన్న విషయంపై ట్రంప్ స్పష్టత ఇవ్వలేదు.గ్రీన్‌లాండ్ విషయంలో అమెరికా, డెన్మార్క్, యూరప్ మిత్రదేశాల మధ్య గతంలో ఏర్పడిన వివాదం సంబంధాలను దెబ్బతీసింది. అమెరికాకు మరింత అనుకూలమైన భద్రతా ఏర్పాట్లు లభించే అవకాశం ఉంది. గ్రీన్‌లాండ్‌పై ఏర్పడిన వివాదం మూడు పక్షాల మధ్య విశ్వాసాన్ని దెబ్బతీసిందని, అట్లాంటిక్ అవతలి దేశాల మధ్య సంబంధాలపై దీర్ఘకాలిక ప్రభావం ఉండవచ్చని ఆయన పేర్కొన్నారు.

# దేశ వ్యాప్తంగా బొగ్గు సంక్షోభం: తెలంగాణకు వ్యాపించిన కొరత

## నిలిచిన 1,600 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి

## యాదాద్రి థర్మల్ కేంద్రంలోని రెండు యూనిట్లు బంద్

## దేశంలో 22.9 మిలియన్ టన్నులకు పడిపోయిన నిల్వలు

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** బొగ్గు కొరత కారణంగా తెలంగాణలోని యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్)లో విద్యుత్ ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. యాదాద్రి థర్మల్ కేంద్రంలోని రెండు యూనిట్లు బంద్ అయ్యాయి. కొంతకాలం క్రితం వరకు యూనిట్4 బంద్ కాగా, తాజాగా యూనిట్3లో కూడా ఉత్పత్తి నిలిచిపోయింది. దీంతో ఒక్కో యూనిట్‌లో 800 మెగావాట్ల చొప్పున మొత్తం 1,600 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడింది. నడుస్తున్న నాలుగు యూనిట్లల్లో రెండు మాత్రమే ప్రస్తుతం వినియోగంలో ఉన్నాయి. ప్రస్తుతానికి ఈ ప్లాంట్‌లో కేవలం నాలుగు రోజులకు సరిపడా బొగ్గు నిల్వలే ఉన్నాయి. కేంద్ర విద్యుత్తు సంస్థ (సీఈఏ) నిబంధనల ప్రకారం 21 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలుండాలి. ఇక సింగరేణి నుంచి, ఒడిశాలోని నైని నుంచి బొగ్గు సరఫరా అవుతున్నా అది ఏ మూలకూ సరిపోవడంలేదు. బొగ్గు నిల్వలు నిండుకుంటే మొత్తం ప్లాంట్ మూసివేయాల్సిన పరిస్థితి వస్తుందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. కాగా అధిక విద్యుత్ డిమాండ్, రుతుపవనాల వల్ల దేశంలో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి ఇప్పటివరకు దాదాపు 13 పెరగడంతో బొగ్గుకు కొరత ఏర్పడింది. దేశంలోని థర్మల్ విద్యుత్ కేంద్రాలలో బొగ్గు నిల్వలు 22.9 మిలియన్ టన్నులకు పడిపోయాయి, ఇది కేవలం ఏడు రోజుల ఇంధన వినియోగానికి మాత్రమే సరిపోతుంది. దేశంలోని 190 థర్మల్ ప్లాంట్లలో 74 ప్రస్తుతం బొగ్గు నిల్వలు తీవ్రంగా తగ్గిపోయే పరిస్థితిని ఎదుర్కొంటున్నాయి, ఆగస్టులో ఈ సంఖ్య 51గా ఉండేది, దానితో పోలిస్తే ఇది గణనీయమైన పెరుగుదల. విద్యుత్ డిమాండ్ పెరగడంతో బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి 13 శాతం పెరగడమే బొగ్గు నిల్వల తగ్గుదలకు కారణమని కేంద్రం చెబుతోంది. బొగ్గు మంత్రిత్వ శాఖ విద్యుత్ రంగానికి రేక్ లోడింగ్‌ను పెంచడంతో సహా, సరఫరాలో దిద్దుబాటు చర్యలను ప్రారంభించింది. ప్రస్తుత కొరత ఉన్నప్పటికీ, ప్రభుత్వ రంగ సంస్థ అయిన కోల్ ఇండియా లిమిటెడ్ తన గనుల వద్ద 76 మిలియన్ టన్నుల బొగ్గును నిల్వ ఉంచుకుంది. సరఫరా అంతరాయాల కారణంగా, దేశవ్యాప్తంగా ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో బొగ్గు నిల్వలు నిర్దేశిత ప్రమాణాలలో సగానికంటే తక్కువకు పడిపోయాయి. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ డేటా ప్రకారం రెండు రోజుల క్రితం వరకూ దేశవ్యాప్తంగా 50 విద్యుత్ ప్లాంట్లలో బొగ్గు నిల్వలు క్లిష్టమైన స్థాయికి చేరుకున్నాయి. ఇది తీవ్రమైన కొరతను సూచిస్తుంది. ఎలక్ట్రిసిటీ అథారిటీ గణాంకాల ప్రకారం సుమారు 224 గిగావాట్ల ఉమ్మడి సామర్థ్యం కలిగిన ఈ విద్యుత్ కేంద్రాల వద్ద 28.2 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వ ఉంది. ఇది నిర్దేశిత అవసరమైన 58.7 మిలియన్ టన్నులలో కేవలం 48 శాతానికి మాత్రమే సమానం. 85 శాతం ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ వద్ద, ఈ నిల్వ కేవలం 9 రోజుల కార్యకలాపాలకు మాత్రమే సరిపోతుంది, కానీ సాధారణ పరిస్థితుల్లో కనీసం 19 రోజులకు సరిపడా నిల్వ ఉండాలని బొగ్గు మంత్రిత్వ శాఖ అధికారులు స్పష్టం చేశారు.

# అలాచేస్తే హార్ముజ్‌ను వారంరోజుల్లోనే తెరిచేందుకు మేం సిద్ధమే..

## అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముందు ఇరాన్ తాజా ప్రతిపాదన

**టెహ్రాన్, సెప్టెంబరు 22:** పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ హార్ముజ్ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ముందు ఇరాన్ కీలక ప్రతిపాదన చేసింది.

అమెరికా తన పోర్టులపై విధించిన దిగ్బంధనాన్ని ఎత్తివేసి, హార్ముజ్ జలసంధి చుట్టూ సైనిక ఒత్తిడిని తగ్గిస్తే వారం రోజుల్లోనే జలసంధిని తిరిగి తెరిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇరాన్ సంకేతాలు ఇచ్చింది. ఈ విషయాన్ని ఓ సీనియర్ ఇరాన్ అధికారి క్యోడో వార్తా సంస్థకు వెల్లడించారు. అమెరికా ఇరాన్ పోర్టులపై విధించిన దిగ్బంధనాన్ని తొలగించడంతో పాటు హార్ముజ్ వ్యూహాత్మక జలమార్గం చుట్టూ సైనిక ఒత్తిడిని తగ్గించాలని ఇరాన్ కోరుతోంది. ఈ రెండు చర్యలు తీసుకుంటే హార్ముజ్ జలసంధిలో సాధారణ నౌకాయానాన్ని వారం రోజుల్లో పునరుద్ధరించవచ్చని ఇరాన్ అధికారి పేర్కొన్నట్లు క్యోడో తెలిపింది. దీంతో హార్ముజ్ జలసంధిలో నౌకాయాన పునరుద్ధరణను అమెరికా సైనిక చర్యలు, పోర్టులపై ఆంక్షల సడలింపుతో ఇరాన్ ముడిపెడుతున్నట్లు స్పష్టమవుతోంది.మరోవైపు అమెరికా మరోసారి దాడులకు పాల్పడితే కొత్త లక్ష్యాలపై దాడులు చేస్తామని,

కొత్త ఆయుధాలను రంగంలోకి దింపుతామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ హెచ్చరించిన ఒక రోజు తర్వాత ఈ ప్రతిపాదన తెరపైకి వచ్చింది. దాదాపు ఏడు నెలలుగా కొనసాగుతున్న అమెరికా-ఇరాన్ యుద్ధంలో ప్రస్తుతం ప్రతిష్టంభన నెలకొంది. ఇరు దేశాలు మరోసారి పూర్తిస్థాయి యుద్ధంలోకి వెళ్లేందుకు ఆసక్తి చూపడం లేదని తెలుస్తోంది. ఇరాన్ సైనిక కేంద్ర కమాండ్ అమెరికా తమ దేశంపై కొత్త చర్యలకు సిద్ధమవుతోందని పేర్కొన్నట్లు ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ వెల్లడించింది. గత నెల చివరిలో ఉద్రిక్తతలు ఒక్కసారిగా పెరిగిన తర్వాత ఇటీవలి రోజుల్లో అమెరికా-ఇరాన్ మధ్య ప్రత్యక్ష పోరాటం కొంత తగ్గింది.

అయినప్పటికీ హార్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు అడపాదడపా కొనసాగుతూనే ఉన్నాయి.

అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న యుద్ధ ప్రభావం యెమెన్‌కూ విస్తరించింది. ఇరాన్ మద్దతు ఉన్న హౌతీలు సౌదీ అరేబియా మద్దతు ఉన్న ప్రభుత్వ బలగాల నుంచి మరిన్ని ప్రాంతాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అదే సమయంలో సౌదీ అరేబియాలోని లక్ష్యాలపై, రాజధాని రియాద్‌పైనా హౌతీలు దాడులు చేపట్టాయి.

# ఆర్థిక ఇబ్బందులు విద్యాభ్యాసానికి అడ్డంకిగా మారొద్దు

## స్కాలర్‌షిప్‌ను జీవితాన్ని తీర్చిదిద్దుకునే అవకాశంగా చూడాలి

### నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



**హైదరాబాద్,సెప్టెంబరు22,ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులు విద్యార్థుల విద్యాభ్యాసానికి అడ్డంకిగా మారకూడదని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు అందించే సహాయం వారి భవిష్యత్తుకు బాటలు వేస్తుందని పేర్కొన్నారు. లోక్‌భవన్‌లో మంగళవారం మహామన మాలవీయ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మహామన శిక్షా సేవా ప్రకల్ప్ కార్యక్రమంలో గవర్నర్ 28 మంది నిరుపేద విద్యార్థులకు రూ.5 లక్షల స్కాలర్‌షిప్ చెక్కులను.. పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ.. భారతరత్న పండిట్ మదన్ మోహన్ మాలవీయ విద్యను దేశ నిర్మాణానికి శక్తివంతమైన సాధనంగా భావించారని తెలిపారు. వనరులు పరిమితంగా ఉన్నా సంకల్పం, పట్టుదలతో లక్ష్యాలను సాధించవచ్చని మాలవీయ జీవితం చాటిచెప్పిందన్నారు. స్కాలర్‌షిప్‌ను కేవలం ఆర్థిక సహాయంగా భావించకుండా తమ జీవితాలను తీర్చిదిద్దుకునే అవకాశంగా విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి విద్యార్థి తన కుటుంబం, సమాజం, దేశానికి సేవ చేసేలా లక్ష్యాలను నిర్దేశించుకోవాలని పిలుపునిచ్చారు. మాలవీయ మిషన్ విద్యా సేవలను గవర్నర్ అభినందించారు. సేవాభావంతో విద్యార్థులకు అండగా నిలుస్తున్న దాతలు, నిర్వాహకులను ప్రశంసించారు. పండిట్ మదన్ మోహన్ మాలవీయ ఆశయాలను కొనసాగిస్తూ విద్య, సేవా కార్యక్రమాలను మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై యువత అప్రమత్తంగా ఉండాలని గవర్నర్ సూచించారు. మాదకద్రవ్యాలు వ్యక్తి జీవితంతో పాటు కుటుంబాన్ని, సమాజాన్ని, దేశాన్ని బలహీనపరుస్తాయని అన్నారు. దేశమే ప్రథమం అనే భావనతో యువత సామాజిక సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యాదర్శి ఎం దాన నకిషోర్, మహామన మాలవీయ మిషన్ ప్రెసిడెంట్ పి.సి. జైన్,ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీర్ గోపాల్ రెడ్డి, మిషన్ కార్యనిర్వాహక సభ్యులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, దాతలు తదితరులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ ఆసుపత్రిలో అగ్నిప్రమాద ఘటనపై సిఎం రేవంత్‌రెడ్డి విచారం

**హైదరాబాద్,సెప్టెంబరు22,ప్రభాతవార్త:** ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రి ఎస్ఎన్‌సీయూ వార్డులో జరిగిన అగ్నిప్రమాద ఘటనపై ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఘటనలో చిన్నారులు మృతి చెందడం అత్యంత బాధాకరమని పేర్కొన్నారు. వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులకు మెరుగైన వైద్యం అందించాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షి ంచాలని అధికారులను ఆదేశించారు. ఘటనకు దారితీసిన కారణాలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని ఆసుపత్రుల్లో భద్రతా చర్యలను పటిష్టం చేయాలని ఆదేశించారు.

# నేడు అసెంబ్లీలో ఎథిక్స్ కమిటీ సమావేశం

**హైదరాబాద్,సెప్టెంబరు22,ప్రభాతవార్త:** బుధవారం ఉదయం 11 గంటలకు అసెంబ్లీలో ఎథిక్స్ కమిటీ సమావేశం కానుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వ్యవహారశైలిపై ఎథిక్స్ కమిటీ విచారణ చేపట్టనుంది. ఛైర్మన్ రేవూరి ప్రకాశ్‌రెడ్డి అధ్వర్యంలో ఎథిక్స్ కమిటీ సమావేశం కానుంది. అయితే పాడి కౌశిక్‌రెడ్డి ఇప్పటికే తన సమాధానం ఇచ్చారు.

# ఉద్యోగ సంఘాలతో నేడు సిఎస్ చర్చలు

**హైదరాబాద్,సెప్టెంబరు22,ప్రభాతవార్త:** ఉద్యోగ సంఘాలతో సీఎస్ సంజయ్‌కుమార్ చర్చలు బుధవారానికి వాయిదా పడ్డాయి. సచివాలయంలో బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు చర్చలు జరగనున్నాయి.

# టెక్సాస్‌లో భారీ హనుమాన్ విగ్రహంకూల్చి వేస్తామంటూ బెదరింపులు

**టెక్సాస్, సెప్టెంబరు 22:** అమెరికాలోని టెక్సాస్‌లో ప్రతిష్ఠించిన 90 అడుగుల భారీ హనుమాన్ విగ్రహం ఇప్పుడు రాజకీయ, మతపరమైన వివాదానికి కేంద్రంగా మారింది. ఈ విగ్రహాన్ని కూల్చేస్తామంటూ ఓ కన్జర్వేటివ్ యూట్యూబర్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి. ఇది హిందూ మతంపై జరిగిన దాడిగా అక్కడి హిందూ సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. టెక్సాస్‌లోని షుగర్ ల్యాండ్‌లో ఉన్న అష్టలక్ష్మి ఆలయ ప్రాంగణంలో ఈ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. దీనిపై కన్జర్వేటివ్ యూట్యూబర్ జెస్సీ హ్యూస్ సోషల్ మీడియాలో స్పందిస్తూ మేము గెలిచినప్పుడు ఈ విగ్రహాన్ని కూల్చేస్తామని పోస్ట్ చేశారు. ఈ వ్యాఖ్య తీవ్ర దుమారం రేపడంతో పాటు అమెరికాలోని హిందూ సమాజం నుంచి బలమైన ప్రతిస్పందన వచ్చింది. జెస్సీ వ్యాఖ్యలపై అమెరికా సైన్యంలో పనిచేసిన రుచిర్ బక్షీ తీవ్రంగా స్పందించారు. ఇది హిందూ మతంపై జరిగిన దాడి అని, దేశభక్తి లేని చర్య అని ఆయన మండిపడ్డారు. కోయలిషన్ ఆఫ్ హిందూస్ ఆఫ్ నార్త్ అమెరికా వంటి సంస్థలతో పాటు ఇతర సైనికోద్యోగులు కూడా హిందూ సమాజానికి మద్దతుగా నిలిచారు. తమ ప్రార్థనా స్థలాలను కాపాడుకునే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని స్పష్టం చేశారు. ఈ ఏడాది 2024 ఆగస్టులో స్టాట్యూ ఆఫ్ యూనియన్ పేరుతో ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఇది అమెరికాలోనే అత్యంత ఎత్తైన హనుమాన్ విగ్రహాల్లో ఒకటి. విగ్రహ ఏర్పాటు నుంచే కొందరు క్రిస్టియన్ కన్జర్వేటివ్‌లు దీనిని క్రైస్తవ వ్యతిరేకం అని, దొంగ దేవుడు అని విమర్శిస్తున్నారు. టెక్సాస్‌లో జరగనున్న మధ్యంతర ఎన్నికల నేపథ్యంలో ఈ వివాదం ప్రాధాన్యం సంతరించుకుంది. వలసలు, సాంస్కృతిక గుర్తింపు వంటి అంశాలపై జరుగుతున్న విస్తృత చర్చకు ఇది అద్దం పడుతోంది. టెక్సాస్‌లో భారతీయఅమెరికన్ల జనాభా గణనీయంగా ఉండటం కూడా ఈ వివాదానికి రాజకీయ రంగు పులుముతోంది. ఈ వివాదంపై ఆలయ అధికారులు స్పందిస్తూ, ఈ విగ్రహం తమ ప్రైవేట్ ఆస్తిలో ఉందని, ఇది స్థానిక హిందూ సమాజం భక్తికి, ఐక్యతకు చిహ్నమని వారు వివరించారు.త

# కల్కాజీ పార్కులో బాలికపై గ్యాంగ్ రేప్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** దేశ రాజధాని ఢిల్లీలో మరో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులమని నమ్మించి ముగ్గురు యువకులు ఓ మైనర్ బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. దక్షిణ ఢిల్లీలోని కల్కాజీ పరిధిలో ఉన్న ఒక పార్కులో ఈ అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఈ ఉదంతం స్థానికంగా తీవ్ర కలకలం సృష్టిస్తోంది.

17 ఏళ్ల బాధిత బాలిక తన స్నేహితుడితో కలిసి కల్కాజీ మందిరాన్ని సందర్శించింది. అనంతరం వారిద్దరూ సమీపంలోని పార్కులో కూర్చున్న సమయంలో పోలీసు దుస్తుల్లో ఉన్న ముగ్గురు యువకులు అక్కడికి చేరుకున్నారు. తాము పోలీసులమని బెదిరించి, ఆపై బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడి అక్కడి నుంచి పరారయ్యారు. ఈ ఘటనతో తీవ్ర దిగ్భ్రాంతికి గురైన బాధితురాలు వెంటనే పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పరిసరాల్లోని సీసీటీవీ ఫుటేజీని విశ్లేషిస్తున్నారు. నిందితులను త్వరలోనే గుర్తించి అరెస్ట్ చేస్తామని ఢిల్లీ పోలీసులు వెల్లడించారు.

# దిక్కులు చూస్తున్న పప్పుధాన్యాల రైతులు

## రాష్ట్రంలో భారీగా 2.19 లక్షల ఎకరాల్లో సాగు

### స్పష్టత లేని కొనుగోలు, మద్దతు ధరలు, మార్కెటింగ్

### ప్రత్యామ్నాయ పంటలపై ప్రణాళిక లేని సర్కార్

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త :** ఎల్ నినో నేపథ్యంలో ప్రస్తుత ఖరీఫ్ సీజనులో వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయించేందుకు ప్రభుత్వం ఉత్సాహం చూపించినా తదుపరి వాటి ఉత్పత్తులపై ఇప్పటి వరకూ ఎటువంటి ప్రణాళికాను రూపొందించలేదు. దీంతో ఆ పంటల కొనుగోళ్లు, కేంద్రాలు, తగిన మార్కెటింగ్ వసతులు, మద్దతు ధర కల్పించడం వంటి అంశాలపై స్పష్టతలేకుండా పోయిందని రైతాంగం ఆందోళన చెందుతోంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం, వ్యవసాయ శాఖ పిలుపు మేరకు ఈసారి రైతాంగం పెద్ద ఎత్తున కందులు, మినుములు, పెసర్లు తదితర పప్పు ధాన్యాల వైపు మొగ్గు చూపి సాధారణ విస్తీర్ణం కంటే మించి సాగు చేశారు. దీంతో ఈ సీజన్లో గతేడాదితో పోలిస్తే ఏకంగా 2,14,643 ఎకరాల్లో పప్పు ధాన్యాల సాగు విస్తీర్ణం అదనంగా పెరిగింది. గత ఏడాది ఇదే సీజన్‌లో 5,79,873 ఎకరాల్లో పప్పుధాన్యాలను సాగు చేయగా, ఈ ఖరీఫ్‌లో 122 శాతం మేర 7,94,516 ఎకరాల విస్తీర్ణంలో వేశారు. ఇందులో కందులు 102 శాతం చొప్పున 5,57,474 ఎకరాల్లో, పెసర 249 శాతం మేర 1,60,674 ఎకరాల్లో, మినుములు 71,287 ఎకరాలు, ఇతర పప్పు ధాన్యాలు 5,081 ఏకరాల్లో సాగైంది. దీనికి తోడు సోయాబీన్ 3,72,424 ఎకరాల్లో, వేరుశనగా 19,400 ఎకరాల్లో వేశారు. తీరా పంట చేతికొచ్చే సమయానికి కొనుగోలు చేస్తారో లేదోనన్న ఆందోళన రైతన్నలను తీవ్రంగా వేధిస్తోంది. మరోవైపు మార్కెట్ సదుపాయాలు, మద్దతు ధర కొనుగోలు కేంద్రాలపై సర్కార్ నోరు మెదపకపోవడంతో రైతన్నల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. ప్రత్యామ్నాయ పంటల కొనుగోలుపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి స్పష్టమైన విధానాన్ని ప్రకటించలేదు. కనీస మద్దతు ధర గ్యారెంటీ ఉందా? ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు లేదా మార్క్ఫెడ్, ఐకేపీ ద్వారా కొనుగోలు కేంద్రాలు తెరుస్తారా? అనే అంశాలపై క్లారిటీని ప్రభుత్వం ఇంత వరకూ అసలు ప్రస్తావనకే తీసుకురాలేదు. వీటిపై క్షేత్రస్థాయిలో రైతులకు సమాధానం చెప్పలేక వ్యవసాయ శాఖ అధికారులు, విస్తరణాధికారులు తలలు పట్టుకుంటున్న ఘటనలు ఉన్నాయి. ప్రభుత్వ విభాగాలు, ఉన్నతాధికారుల నుంచి ఇప్పటివరకు ఎలాంటి మార్గదర్శకాలు రాకపోవడంతో అధికారులు సైతం మాకూ ఏమీ తెలియదంటూ చేతులెత్తేస్తున్నారు. దిగుబడి వచ్చాక మద్దతు ధర దక్కక దళారులకు తక్కువ రేటుకే అమ్ముకొని నష్టపోవడం ప్రతి ఏటా పరిపాటిగా మారింది. మార్కెట్ సదుపాయం లేకపోవడంతో వ్యాపారులు, దళారులు కుమ్మక్కై మద్దతు ధర కంటే 20 నుండి 30 శాతం నష్టానికి పంటను తెగనమ్ముకునేలా రైతులను ఒత్తిడికి గురిచేస్తున్నారు. దీనికి తగినట్లుగా గ్రామాల్లో తగినన్ని గిడ్డంగులు, కోల్డ్ స్టోరేజీ వసతులు లేకపోవడం రైతుల బలహీనతగా మారి దళారులకు వరంగా మారుతోంది. అంతేకాకుండా గ్రామాల్లో తగినన్ని కోల్డ్ స్టోరేజీలు, గిడ్డంగులు లేకపోవడంతో పంటను నిల్వ చేసుకునే అవకాశం కూడా రైతులకు లేకుండా పోతోంది. కేవలం వరిధాన్యం నిల్వలకే గోదాములు సరిపోవడం లేదు. అయితే ఈసారి పప్పుధాన్యాలను ఎలా కొనుగోలు చేస్తారు? ఎక్కడ నిల్వ చేస్తారనేది కూడా చర్చమొదలైంది. ఈ సీజన్లోనైనా ప్రభుత్వం తక్షణమే స్పందించిపప్పు ధాన్యాల కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలను ప్రతిపాదించాలని రైతులు కోరుతున్నారు. అంతేగాకుండా మద్దతు ధర తగ్గకుండా కొనుగోలు చేసేలా మార్క్ఫెడ్‌కు నిధులు కేటాయించాలని, క్షేత్రస్థాయి అధికారులకు వెంటనే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేయాలని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

## మల్కాజిగిరి-కామారెడ్డి మధ్య కవచ్ పనులను పరిశీలించిన జీఎం సంజయ్ కుమార్ శ్రీ వాస్తవ

### 108 కిలోమీటర్ల మేర అప్‌గ్రేడేషన్ పనులు పూర్తి

### భద్రతా ప్రమాణాలు, సాంకేతికతను మరింత బలోపేతం చేస్తున్న కవచ్ 4.0

**తార్నాక, సెప్టెంబర్ 22 ప్రభాతవార్త :** దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మంగళవారం ప్రత్యేక రైలులో ప్రయాణిస్తూ మల్కాజిగిరి–కామారెడ్డి సెక్షన్ల మధ్య చేపట్టిన కవచ్ రక్షణ వ్యవస్థ అప్‌గ్రేడేషన్ పనులను పరిశీలించారు. కవచ్ వెర్షన్ 3.2 నుంచి 4.0కి అప్‌గ్రేడ్ చేసిన పనుల పురోగతి, వివిధ అంశాల పనితీరును ఆయన తనిఖీ చేశారు.ఈ పర్యటనలో దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికమ్యూనికేషన్ ఇంజనీర్ పి.వి. మురళీకృష్ణ, హైదరాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ సంతోష్ కుమార్ వర్మతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తనిఖీలో భాగంగా వివిధ సందర్భాల్లో కవచ్ 4.0లోని పలు అంశాల పనితీరును అధికారులు జీఎంకు వివరించారు.108 కిలోమీటర్ల మేర అప్‌గ్రేడ్ దక్షిణ మధ్య రైల్వేలో తొలిసారిగా మల్కాజిగిరి–కామారెడ్డి మార్గంలో 108 రూట్ కిలోమీటర్ల మేర కవచ్ వెర్షన్ 3.2 నుంచి 4.0కి అప్‌గ్రేడేషన్ పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. దక్షిణ మధ్య రైల్వే పరిధిలో ఇప్పటికే 1,465 రూట్ కిలోమీటర్ల మేర కవచ్ వెర్షన్ 3.2ను అమలు చేసిన అనుభవం ఆధారంగా తాజా వెర్షన్‌లో మరిన్ని సాంకేతిక మెరుగు దలలు చేపట్టారు. కవచ్ 4.0లో మెరుగైన భద్రతా ప్రమాణాలు, అధునాతన సాంకేతిక పరి జ్ఞానం, అధిక విశ్వసనీయత తో పాటు మరింత సురక్షితమైన రైలు కార్యకలాపాలకు అవసరమైన సౌకర్యాలు ఉన్నాయి. కవచ్ 4.0లో కీలక మెరుగు దలలు భారతీయ రైల్వే అభివృద్ధి చేసి విజయవంతంగా పరీక్షించిన అత్యాధునిక ఆటోమేటిక్ రైలు రక్షణ వ్యవస్థ కవచ్ 4.0ను దశలవారీగా అమలు చేస్తోంది. వైవిధ్యభరితమైన రైల్వే నెట్‌వర్క్‌కు అవసరమైన ప్రధాన భద్రతా లక్షణాలను ఈ వ్యవస్థ కలిగి ఉంది.వెర్షన్ 4.0లో రైలు స్థానం గుర్తింపులో మరింత ఖచ్చితత్వం, పెద్ద యార్డుల్లో సిగ్నల్ అంశాలపై మెరుగైన సమాచారం, ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ద్వారా స్టేషన్ నుంచి స్టేషన్‌కు కవచ్ అనుసంధానం, ఇప్పటికే ఉన్న ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థతో నేరుగా అనుసంధానం వంటి కీలక మెరుగుదలలు ఉన్నాయి.సాంకేతి కతలను ఆధారంగా చేసుకుని కవచ్ 4.0ను భారతీయ రైల్వేలో విస్తృతస్థాయిలో అమలు చేసారు.



పనులను పరిశీస్తున్న జీఎం. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ

## బిసి విద్యార్థులకు అన్యాయం సహించం: ఆర్ కృష్ణయ్య

### విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని తెలుగు సంక్షేమ భవన్‌ను ముట్టడించిన బిసి సంఘం నేతలు

### 100 కాలేజీ హాస్టల్స్, 50 గురుకుల పాఠశాలలు మంజూరు చేయాలని డిమాండ్

**మెహిదీపట్నం, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** రాష్ట్రంలో బీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తుందని, దీంతో బీసీ విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారని రాజ్యసభ సభ్యులు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో 100 కాలేజీ హాస్టల్స్, 50 గురుకుల పాఠశాలలను మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్, విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు పగిళ్ల సతీష్, కడారి శివకుమార్ యాదవ్ ఆధ్వర్యంలో మంగళవారం మాసబ్ ట్యాంక్‌లోని తెలుగు సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో మాసబ్ ట్యాంక్ ప్రాంతమంతా విద్యార్థుల నినాదాలతో దద్దరిల్లింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్. కృష్ణయ్య హాజరై మాట్లాడారు...రాష్ట్రంలో బీసీ విద్యార్థులకు కాలేజ్ హాస్టల్స్, గురుకుల పాఠశాలలు లేకపోవడంతో వేలాది మంది విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం ఉన్నటువంటి బీసీ కాలేజ్ హాస్టల్స్, గురుకుల పాఠశాలలు సరిపోవడంలేదని అదనంగా మరో 100 కాలేజ్ హాస్టల్, 50 గురుకుల పాఠశాలలను నిర్మించాలన్నారు. ప్రస్తుతం ఉన్నటువంటి గురుకులాలలో 10 శాతం సీట్లు పెంచి, దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీట్లను కేటాయించాలని డిమాండ్ చేశారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి సీట్లు రాకపోవడంతో స్థానిక ప్రజాప్రతినిధులతో పాటు తెలుగు సంక్షేమ భవన్ చుట్టూ విద్యార్థుల తల్లిదండ్రులు తిరుగుతున్నారని ఆవేదన చెందారు. రాష్ట్రంలో 52 శాతం పైగా ఉన్నటువంటి బీసీ జనాభాకు తగినంతగా గురుకుల పాఠశాలలు లేకపోవడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. 12 శాతం ఉన్నటువంటి మైనార్టీలకు మాత్రం 206 పాఠశాలలు మంజూరు చేయడం ఏమిటని ప్రశ్నించారు. సంగారెడ్డి, మహబూబ్ నగర్, వరంగల్ జిల్లాలలో బీసీ పాఠశాలల హాస్టల్స్‌ను ఎందుకు మూసివేయాల్సి వచ్చిందో తెలపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్నటువంటి 325 బిసి కాలేజీ హాస్టల్‌కు, 330 గురుకులాలో ఒక్కదానికి కూడా సొంత భవనం లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రోడ్లు, ఫ్లై ఓవర్లు, స్కైవాక్‌లు నిర్మించడానికి నిధులు ఉంటాయి కానీ, విద్యార్థుల భవిష్యత్తు కోసం సొంత భవనాలను నిర్మించడానికి నిధులు ఉండవాని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి యుద్ధ ప్రాతిపదికన రాష్ట్రంలో బీసీ విద్యార్థుల కోసం సొంత భవనాలను, అదనపు కాలేజీ హాస్టల్స్ మరియు గురుకులాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల విద్యార్థుల తల్లిదండ్రులతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.



తెలుగు సంక్షేమ భవన్ ముందు ధర్నాకు దిగిన ఆర్. కృష్ణయ్య, బీసీ విద్యార్థి సంఘం నేతలు

## ఓయోరూంలో విశాఖ యువతి అనుమానాస్పద మృతి

### ఆసుపత్రిలో మృతదేహాన్ని విడిచి ప్రియుడు పరార్

**శేరిలింగంపల్లి,సెప్టెంబర్ 22 ప్రభాతవార్త** :మాదాపూర్‌లోని ఓ హోటల్‌లో ఘోరమైన ఘటన వెలుగుచూసింది. ఓయో హోటల్‌గదిలో అనుమానాస్పదస్థితిలో విశాఖకు చెందిన ఓ యువతి మృతిచెందింది. కాగా మృతిచెందిన యువతిని ఆసుప త్రిలో పడేసి ప్రియుడు అక్కడినుంచి మెల్లగా పరారయ్యాడు. ఈ సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలోనికి వెళితే.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖ పట్నానికి చెందిన శరణ్ నిఖిత(29) ఆమె ప్రియుడు శ్రీనివాస్ రవితేజతో కలిసి సోమవారం మధ్యాహ్నం మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిద్దిఖీనగర్‌లోని రోడ్ నంబర్ 5లో గల ఓఎస్ఎల్ఎన్ టెర్మినల్ ఓయో హోటల్‌లోని రూమ్ నంబర్ 303 గదిని అద్దెకు తీసుకున్నారు. శరణ్ నిఖిత నగరంలోని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. మంగళవారం నాటికి వీరి కథ ఊహించని మలుపు తిరిగింది. సోమవారం అర్ధరాత్రి యువతి అకస్మాత్తుగా స్పృహతప్పి పడిపోవడంతో హోటల్ సిబ్బంది సహాయంతో కొత్తగూడలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు ఆ యువతి అప్పటికే మృతిచెందనట్లు వైద్యులు దృవీకరించారు. వైద్యులు ఈ విషయాన్ని వెల్లడించిన వెంటనే ప్రియుడు అక్కడి నుంచి చాకచక్యంగా జారుకున్నాడు. ప్రేమికురాలిని ఆసుపత్రికి తీసుకువచ్చిన వ్యక్తి కనిపించకుండా పోవడంతో అనుమానం వచ్చిన వైద్య సిబ్బంది వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న మాదాపూర్ పోలీసులు వెంటనే ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. యువతి ముఖంపై స్వల్పగాయాలు, తలపై తీవ్రమైన వాపు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. అదే విధంగా వారు ఉన్న గది గోడలపై,బెడ్‌షీట్‌లపై రక్తపు మరకలను కూడా పోలీసులు గుర్తించారు. మద్యం బాటిల్స్ కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఉమెన్స్ హాస్టల్ ను ఓయోగా మార్చినట్లు తెలుస్తుంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తరువాతే మృతికి ఖచ్చితమైన కారణాలు తెలుస్తాయని పోలీసులు చెబుతున్నారు. కాగా హోటల్ గదిలో ప్రియుడు, ప్రియురాలి మధ్య ఏదో విషయమై తీవ్రస్థాయిలో వాగ్వివాదం జరిగి ఉండవచ్చని, అది కాస్తా తీవ్రమైన దాడికి దారితీసి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. బాదితురాలు బస చేసిన హోటల్ రూమ్‌కు క్లూస్ టీం పరిశీలించి, వేలిముద్రలు,రక్త నమూనాలు సేకరించింది. హోటల్ కాంప్లెక్స్, పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమారాల ఫుటేజ్‌ను పోలీసులు పరిశీలిస్తున్నారు. హోటల్‌లోనికి వారి రాకపోకలు, ప్రియుడు పారిపోయిన మార్గంపై పోలీసులు ఫోకస్ చేశారు. హోటల్ మేనేజర్, సిబ్బందిని పోలీసులు ప్రశ్నించారు.పరారీలో ఉన్న ప్రియుడు శ్రీనివాస్ రవితేజను పట్టుకునేందుకు పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోనికి దింపారు. ఈ మేరకు మాదాపూర్ పోలీసులు కేసును అన్ని కోణాలనుంచి దర్యాప్తు చేస్తున్నారు.

## మస్కట్ నుంచి దుబాయ్‌లోకి చొరబడ్డ తెలంగాణ వాసి అరెస్ట్

### న్యాయ సహాయం కోసం ప్రజావాణిని ఆశ్రయించిన కుటుంబం

### భరోసా ఇచ్చిన ప్రజావాణి ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మి

**బేగంపేట సెప్టెంబరు 22,ప్రభాతవార్త** ఎనిమిది ఏళ్ల క్రితం 2018 లో ఓమాన్ దేశంలోని మస్కట్ కు వెళ్లిన ఒక గల్ఫ్ కార్మికుడు కొందరి తప్పుడు సలహాలతో సరిహద్దులు దాటి యూ ఏ ఈ దేశంలోని దుబాయికి అక్రమంగా ప్రవేశించిన తెలంగాణా వాసి ఆరు నెలల క్రితం దుబాయిలో జైలు పాలయిన సంఘటన జరిగింది.ఈ సంఘటనపై బాధిత కుటుంబం మంగళవారం సీఎం ప్రజావాణికి వచ్చి ప్రవాసీ ప్రజావాణీలో ఫిర్యాదు చేసి సహాయం కోరారు.మస్కట్ నుంచి దుబాయిలోకి అక్రమంగా చొరబడ్డ జగిత్యాల జిల్లా బీమారం మండలం మోత్కురావుపేట గ్రామానికి చెందిన ఏగుర్ల మల్లేశం అనే గల్ఫ్ కార్మికుడిని మార్చి 8న దుబాయి పోలీసులు అరెస్ట్ చేశారు. దుబాయి లోని ఇండియన్ కాన్సులేట్ ద్వారా ఒక న్యాయవాదిని నియమించి మల్లేశంను జైలు నుంచి విడిపించి, స్వదేశానికి రప్పించాలని అతని భార్య లత మంగళవారం

హైదరాబాద్ లోని మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజా భవన్ లో సీఎం ప్రవాసీ ప్రజావాణిని ఆశ్రయించగా, సీఎం ప్రజావాణి స్టేట్ ఇంచార్చ్, రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్ పర్సన్ గద్వాల విజయలక్ష్మి ్మ వారికి అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు.

## అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని హారిణి మృతి



హారిణి (ఫైల్)

**జూలూరుపాడు, ప్రభాతవార్త, సెప్టెంబర్ 22:** భద్రాద్రి కొత్త గూడెం జిల్లా జూలూరు పాడు మండల పరి ధిలోని వెంగన్న పాలెం గ్రామంలో నర్సింగ్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వెంగన్నపాలెం గ్రామానికి చెందిన సతీష్, రాజేశ్వరి దంపతులకు ఇద్దరు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తె హారిణి (19) ఖమ్మం పట్టణ సమీపంలోని ఒక కళాశాలలో నర్సింగ్ విద్యను అభ్యసిస్తుంది. కొద్ది రోజుల క్రితం వెంగన్నపాలెం ఆమె ఇంటికి వచ్చింది. మంగళవారం ఇంటి వెనక మరుగుదొడ్ల ఉన్న ఇరుకు ప్రాంతంలో హారిణి విగతా జీవిగా పడి ఉంది. ఆమె శరీరంపై గాయాలు ఉండటంతో స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జూలూరుపాడు సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీలక్ష్మి ్మ, సబ్ ఇన్స్పెక్టర్ జీనత్ కుమార్ సంఘ టనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యార్థిని మృతి విషయం తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. కాగా విద్యార్థిని హారిణి మృతికి సంబంధించిన పూర్తి వివరాలను దర్యాప్తు అనంతరం పోలీసులు వెల్లడించాల్సి

## చెరుకు పంటకు వేరుపురుగుతో నష్టపోతున్న రైతులు

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త**

ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో చెరుకు పంటపై తీవ్ర ప్రభావం పడింది. సగానికి పైగా సాగు తగ్గడమే కాక, వేసిన పంట వేరుపురుగు వల్ల పంట దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టాల పాలవుతున్నారు. తెగుళ్లు, నీటి ఎద్దడి వలన చెరుకు దిగుబడులు భారీగా పడిపోయే ప్రమాదం ఏర్పడింది. అనావృష్టి, తెగుళ్లతో ఈ సారి 20 టన్ను లకు మించదని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల నీటి కొరతతో చెరుకు గడలకు రసం లేకుండా పోతుంది. దీంతో తూకం తగ్గడమే కాక కంపెనీలు గిట్టు బాటు ధర ఇవ్వడానికి ముందుకు రావని చెబుతున్నారు. కాగా రాష్ట్రంలో ఒకప్పుడు 5 లక్షల ఎకరాల్లో చెరుకు సాగుకాగా, క్రమంగా విస్తీర్ణం తగ్గింది. కొంత కాలం నుంచి ఏటా రాష్ట్ర వ్యాప్తంగా 59,275 ఎకరాల్లో చెరుకు పంట సాగయ్యేది. ఈ సారి కేవలం 25 వేల ఎకరాలకు మించలేదు. వనపర్తి జిల్లాలో 5,600 ఎకరాల సాధారణ సాగు విస్తీర్ణం కాగా ఈ ఏడాది కేవలం 1,500 ఎకరాల్లోనే సాగైంది. గద్వాల జిల్లాలో 3,460 ఎకరాలకుగాను 1,120 ఎకరాలు, నారాయణపేట జిల్లాలో 2 వేల ఎకరాలకు 500 ఎకరాలు మాత్రమే సాగయ్యింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 10 వేల ఎకరాలు సాగయ్యేది. వర్షాలు లేక జూరాలలో నీటి కొరత వల్ల అనేక మంది రైతులు చెరుకు సాగుకు దూరమయ్యారు.

## మిలటరీ ఆయుధాల చోరీ కేసులో సంచలన విషయాలు

### రెండు నెలల ముందుగానే చోరీకి నిందితుడి పథకం

**హైదరాబాద్, సెప్టెంబరు 22, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన బొల్లారంలోని మిలట రీ కేంద్రంలో ఆయుధాలు, మందుగుండు సామాగ్రి చోరీ కేసులో సంచలన విషయాలు వెలుగు చూశా యి. గత నెల 30వ తేదీన ఆదివారం రాత్రి ఈ చోరీ జరగడం తెలిసిందే. దీనిపై విచారిస్తున్న బొల్లా రం పోలీసులకు తాజాగా మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఈ కేసులో నిందితుడుగా వున్న మాజీ సైనికుడు, గ తంలో ఆయుధాలు, మందు గుండు సామాగ్రి చోరి జరిగిన మద్రాస్ రిజిమెంట్ సె ంటర్‌లో హావల్దార్‌గా పనిచేసి బలవంతంగా పదవీ విరమ ణ పొందిన మల్లేష్ పక్కా వ్యూహంతోనే ఈ నేరానికి పాల్పడినట్లు పోలీసులు తేల్చారు. తనను బలవంతంగా పదవీ విరమణ చేయించినందుకు ఉన్నతాధికారులపై కక్షగట్టి రెండు నెలల ముందుగానే ఈ చోరీకి ఇతను స్కెచ్ వేసినట్లు తెలిసింది.



సిఎం ప్రజావాణిలో ఇంచార్జ్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసిన ఆర్టీసి సూపర్ వైజర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు

## ఆర్టీసి సూపర్‌వైజర్‌పోస్టులకు వేగంగా నియామక ప్రక్రియ

### వారం రోజుల్లో అందనున్న నియామక పత్రాలు: విజయలక్ష్మి

**బేగంపేట సెప్టెంబరు 22,ప్రభాతవార్త** ఆర్టీసీ ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ మెకానికల్ సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టులకు ఎంపికైన 186 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు త్వరగా అందేలా ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా మండలి వైస్ చైర్‌పర్సన్, సీఎం ప్రజావాణి రాష్ట్ర స్థాయి ఇన్‌చార్జ్ గద్వాల్ విజయలక్ష్మి సూచించారు.మంగళవారం మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో నిర్వహించిన 257వ సీఎం ప్రజావాణి కార్యక్రమానికి టీఎస్‌టీ,ఎమ్ఎస్‌టీ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు పెద్ద సంఖ్యలో వచ్చి తమ సమస్యను ఆమె దృష్టికి తీసుకువచ్చారు.ఎంపిక ప్రక్రియ పూర్తై, ఫలితాలు మే నెలలోనే ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు నియామక ఉత్తర్వులు అందకపోవడంతో తాము తీవ్ర అనిశ్చితి, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అభ్యర్థులు వివరించారు. ఉద్యోగం వస్తుందనే నమ్మకంతో కొంతమంది ఇతర ప్రైవేట్ ఉద్యోగ అవకాశాలను కూడా వదులుకున్నట్లు తెలిపారు.అభ్యర్థుల విజ్ఞప్తిపై స్పందించిన గద్వాల్ విజయలక్ష్మి ్మపోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ శ్రీనివాస్ రావుతో ఫోన్‌లో మాట్లాడి నియామక ప్రక్రియపై చర్చించారు.ఎంపికైన అభ్యర్థులు మరింత కాలం వేచి ఉండాల్సిన పరిస్థితి లేకుండా,మిగిలిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి.వారం రోజుల్లో నియామక పత్రాలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నోటిఫికేషన్ ప్రకారం చేపట్టిన టీఎస్‌టీ,ఎమ్ఎస్‌టీ నియామకాలకు సంబంధించి, పరిపాలనా పరంగా సాధ్యమైన మేరకు ఈ పోస్టుల నియామక ప్రక్రియను ఇతర కేడర్ల అంశాలతో ముడిపెట్టకుండా విడిగా ప్రాసెస్ చేయాలని కూడా ఆమె కోరారు.ఎంపికైన అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు కేవలం ఉద్యోగ పత్రాలు మాత్రమే కాదు.వారి కుటుంబాల జీవనోపాధి, ఆర్థిక భద్రతతో ముడిపడి ఉన్న అంశం. అందుకే ఈ సమస్యను మానవతా దృక్పథంతో, త్వరితగతిన పరిష్కరించాలి అని గద్వాల్ విజయలక్ష్మి ్మ పేర్కొన్నారు.తమ సమస్యను వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చొరవ చూపిన గద్వాల్ విజయలక్ష్మి ్మకి ఎంపికైన అభ్యర్థులు

## బండ్లగూడ ఆర్టీఒలో ఉద్యోగుల అవినీతి బాగోతం

### - యేళ్ల తరబడి తిష్ఠ - 33 ఫైళ్లు మాయం

**చాంద్రాయణగుట్ట, సెప్టెంబర్ 22, ప్రభాతవార్త :** పాతబస్తీ బండ్లగూడలోని సౌత్‌జోన్ ఆర్టీఒ కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ జరిపిన మెరుపు దాడులు మంగళవారం ముగిశాయి. దాదాపు 24 గంటల పాటు కొనసాగిన తనిఖీలలో పలువురు ఉద్యోగుల అవినీతి భాగంతో బయట పడింది. ఏజెంట్ల వద్ద నగదు లభించింది. సుమారు 33 ఫైళ్లు కనిపించలేదు. ఏసీబీ మీడియాకు విడుదల చేసిన వివరాల ప్రకారం... ఏసీబీ రంగారెడ్డి రేంజ్ డీఎస్పీ ఎ.పి.నందకుమార్ ఆధ్వర్యంలోని బృందం సోమవారం మధ్యాహ్నం మెరుపు దాడులు ప్రారంభించింది. కార్యాలయాన్ని పూర్తిగా తమ అధీనంలోకి తీసుకొని తనిఖీలు చేపట్టింది. ఈ తనిఖీలలో కొంత మంది సిబ్బంది సెల్‌ఫోన్లలో కొన్ని అనుమానాస్పద యుపిఐ లావాదేవీలు గుర్తించారు. కార్యాలయంలో అధికారులతో కలిసి కొంత మంది అనధికార వ్యక్తులను గమనించారు. బి.సునీత (ఏఓ), మహ్మద్ ఇమ్రాన్ (జూ.అ), కె.బాబుజీ (జూ.అ), ఎన్.హేమంత్ కుమార్ (ఏఓ), కె.సాయి కుమార్ (సీ.అ), ఎం.ఎ.లతీఫ్ ఖాన్, టి.సాయికాంత్ (జూ.అ) వంటి కొంత మంది ఉద్యోగులు ఏజెంట్ల ద్వారా దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. వాటిని వేగంగా పంపించటం కోసం వాటిపై కొన్ని గుర్తులు, పేర్లను రాస్తున్నారు. కార్యాలయంలో అనధికారికంగా ఉన్న ఏజెంట్ల వద్ద రూ.24,760 నగదు లభించింది. సాయి కుమార్ (సీ.అ), సాయికాంత్ (జూ.అ) నుండి 33 రవాణా దరఖాస్తులు కనిపించకుండా పోయాయి. ఎం.ఎ.లతీఫ్ అనే ఉద్యోగి గత 20 ఏళ్లుగా ఒకే చోటు పనిచేస్తున్నారు. మరికొంత మంది చాలాకాలంగా పనిచేస్తున్నట్లు విచారణలో వెల్లడైనట్లు పేర్కొన్నారు.

## దేశ నిర్మాణంలో మాజీ సైనికుల భాగస్వామ్యం ఉండాలి: గవర్నర్ శివప్రతాప్ శుక్లా

**అల్వాల్, సెప్టెంబరు 22 ప్రభాతవార్త:** నైపుణ్యాభివృద్ధి, యువతకు మార్గదర్శకత్వం, జాతీయ భద్రత తదితర అంశాలులో మాజీ సైనికాధికారుల సేవలు అవసరమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని మిలటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ మెకానికల్ ఇంజనీరింగ్ కలాం ఆడిటోరియంలో రాష్ట్రీయ సైనిక్ సంస్థ 19వ జాతీయ సదస్సు జరిగింది. వికసిత్ భారత్ 2047 మాజీ సైనికులు దేశభక్తుల పాత్ర అనే అంశంపై సదస్సు జరగగా దేశవ్యాప్తంగా సుమారు వంద మంది ప్రతినిధులు పాల్గొన్నారు. మాజీ సైనికులు, వీర నారీలు, సైనికాధికారులు, విద్యావేత్తలు పాల్గొన్న ఈ సదస్సులో జాతీయ నిర్మాణంలో మాజీ సైనికుల అనుభవం, క్రమశిక్షణ, సేవా భావాన్ని వినియోగించుకునే అంశాలుపై ప్రధానంగా చర్చ జరిగింది. యువతకు మార్గదర్శకత్వం కోసం ఒక మాజీ సైనికుడు పది మంది యువత కార్యక్రమాన్ని ముందుకు తీసుకుని వెళ్ళాలని నిర్ణయించారు. ముఖ్య అతిథి గవర్నర్ మాట్లాడుతూ వికసిత భారత్ ఆవిష్కరణ కోసం వివిధ రంగాలులో అనుభవం ఉన్న సైనికాధికారులు, విద్యావేత్తలు, మేదావులు, శాస్త్రవేత్తల బాగస్వామ్యం ఉండాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పని చేసిన నాడు దేశం లక్ష్యం దిశగా సాగుందని తెలిపారు. తెలంగాణా రాష్ట్రం ఇప్పటికే ఆదిశగా అడుగులు వేసిందన్నారు. దేశ అభివృద్ధిలో విశేష సేవలు చేసిన పలువురికి గవర్నర్ బహుమతులు ప్రధానం చేశారు.



మాజీ సైనికాధికారికి జ్ఞాపిక అందిస్తున్న గవర్నర్

## రోజూ మాత్రలకంటే 8 వారాలకు ఓ ఇంజెక్షన్

### హెచ్ఐవి కట్టడికి కొత్త చికిత్స రెడీ

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** హెచ్ఐవీతో బాధపడుతున్న యువతకు చికిత్స అందించడంలో ఒక కీలక ముందడుగు పడింది. ప్రతిరోజూ మాత్రలు మింగే బదులు, ప్రతి ఎనిమిది వారాలకు ఒకసారి ఇచ్చే లాంగ్‌యాక్టింగ్ ఇంజెక్షన్లు వైరస్‌ను మరింత సమర్థవంతంగా అదుపులో ఉంచుతున్నాయని ఒక తాజా క్లినికల్ ట్రయల్‌లో తేలింది. ఈ చికిత్స ద్వారా యువతలో లాంగ్‌యాక్టింగ్ ట్రీట్‌మెంట్ ఇన్ అడోలెసెంట్స్ పేరుతో ఈ క్లినికల్ ట్రయల్ నిర్వహించారు. కెన్యా, దక్షిణాఫ్రికా, ఉగాండా, జింబాబ్వే దేశాల్లోని క్లినిక్‌లలో 12 నుంచి 19 సంవత్సరాల వయసు గల 476 మంది యువతీ యువకులు ఈ పరిశోధనలో పాల్గొన్నారు. వీరందరూ అప్పటికే ఏడాదికి పైగా రోజువారీ మాత్రల చికిత్స (యాంటీరెట్రోవైరల్ ట్యాబ్లెట్స్) తీసుకుంటూ, వైరస్‌ను పూర్తి అదుపులో ఉంచుకున్నవారే. వీరిని రెండు బృందాలుగా విభజించి, ఒక బృందానికి యధావిధిగా రోజువారీ మాత్రలు, మరో బృందానికి కాబోటెగ్రావిర్, రిల్పివిరిన్ అనే ఇంజెక్షన్లను ప్రతి ఎనిమిది వారాలకు ఒకసారి అందించారు. దాదాపు 96 వారాల పాటు సాగిన ఈ పరిశోధనలో కీలక ఫలితాలు వెల్లడయ్యాయి. ఇంజెక్షన్లు తీసుకున్న బృందంలోని యువతలో కేవలం ఇద్దరిలో (1 శాతం) మాత్రమే వైరస్ తిరిగి విజృంభించడం (వైరల్ రీబౌండ్) కనిపించింది. దీనికి విరుద్ధంగా రోజువారీ మాత్రలు వాడిన బృందంలో 15 మందిలో (6 శాతం) వైరస్ మళ్లీ పెరిగినట్లు నిర్ధారణ అయింది. అంతేకాకుండా ఇంజెక్షన్లు అందుకున్న వారిలో దాదాపు 94 శాతం మంది ప్రతిరోజూ మాత్రలు వేసుకోవడంతో పోలిస్తే, ఎనిమిది వారాలకోసారి ఇంజెక్షన్ తీసుకోవడం చాలా సులభంగా ఉందని అభిప్రాయపడ్డారు. యువత, ముఖ్యంగా కౌమారదశలో ఉన్నవారు హెచ్ఐవీ చికిత్స విషయంలో అనేక సవాళ్లను ఎదుర్కొంటారని పరిశోధకులు పేర్కొన్నారు. ప్రతిరోజూ మందులు వేసుకోవడం వల్ల కలిగే సామాజిక అవమానం, ఇతరులకు తమ పరిస్థితి తెలుస్తుందనే భయం, పాఠశాల లేదా ఇతర పనుల ఒత్తిడిలో మందులు మరచిపోవడం వంటి ఆచరణాత్మక ఇబ్బందులు వారి చికిత్సకు ఆటంకంగా మారుతున్నాయి.

ఈ నేపథ్యంలో రెండు నెలలకు ఒకసారి తీసుకునే ఇంజెక్షన్ చికిత్స వారికి గొప్ప ఊరటనిస్తుంది. ఇది వారి మానసిక ఆరోగ్యంపై కూడా సానుకూల ప్రభావం చూపుతుందని నిపుణులు భావిస్తున్నారు. అందుబాటులోకి రావడమే అసలు సవాలు ఈ ఇంజెక్షన్ చికిత్స ఎంతో ఆశాజనకంగా ఉన్నప్పటికీ, దీనిని ప్రపంచవ్యాప్తంగా యువతకు అందుబాటులోకి తీసుకురావడానికి కొన్ని ప్రధాన అడ్డంకులు ఉన్నాయి. రోజువారీ మాత్రలతో పోలిస్తే ఈ ఇంజెక్షన్ల ఖరీదు చాలా ఎక్కువ. ఈ మందులపై ఉన్న పేటెంట్ పరిమితులు వాటి ఉత్పత్తిని, లభ్యతను పరిమితం చేస్తున్నాయి. చికిత్సలో వాడే ఒక ఔషధాన్ని కోల్డ్‌చైన్ పద్ధతిలో నిల్వ చేయాల్సి ఉంటుంది.

అన్నిటికంటే ముఖ్యంగా ఈ ఇంజెక్షన్లను ఇవ్వడానికి ప్రత్యేక శిక్షణ పొందిన ఆరోగ్య సిబ్బంది అవసరం. ఈ సవాళ్లను అధిగమిస్తేనే ఈ అధునాతన చికిత్స ఫలాలు అందరికీ చేరతాయి. మొత్తంమీద హెచ్ఐవీతో జీవిస్తున్న యువతకు చికిత్సను మరింత సులభతరం చేయడానికి, వారి జీవన నాణ్యతను మెరుగుపరచడానికి ఈ లాంగ్‌యాక్టింగ్ ఇంజెక్షన్లు ఒక బలమైన ప్రత్యామ్నాయాన్ని అందిస్తున్నాయని ఈ అధ్యయనం స్పష్టం చేస్తోంది.

## ఆకులు పసుపు రంగులోకి ..



ఇంట్లో మొక్కల్ని పెంచాలని అందరికీ ఉంటుంది. కానీ, ఒక్కోసారి వాటికొచ్చే సమస్యలను నివారించలేక కొందరు మానుకుంటారు. అలాంటి వాటిల్లో ఆకులు పసుపు రంగులోకి మారడం ఒకటి. దీనికి పరిష్కారం ఏంటంటే.. మొక్కల ఆకులు పసుపు రంగులోకి మారడాన్ని క్లోరోసిస్ అంటారు. నీళ్లు బాగా ఎక్కువైనా తక్కువైనా ఈ సమస్య కనిపిస్తుంది. అలాకాకుండా ఉండాలంటే మట్టి పై పొర ఆరక మాత్రమే తడి అందించాలి. అదనంగా ఉన్న నీళ్లు బయటకు పోయేలా కుండీల అడుగున రంధ్రాలు చేయాలి. మట్టిలో అవసరమైన పోషకాలు లేనప్పుడూ అంటే ప్రధానంగా నైట్రోజన్, ఐరన్ లోపం వల్ల ఇలా జరుగుతుంది. దీన్ని అధిగమించడానికి నత్రజని ఎక్కువగా ఉండే కంపోస్ట్ వేయాలి. ఐరన్ లోపాన్ని తగ్గించడానికి ఐరన్ కీలెట్ స్ప్రే చేయాలి. లేదంటే తుప్పు పట్టిన మేకుల్ని నీళ్లలో వేసి ఉంచి... అవి రంగు మారాక మొక్కకు పోయాలి. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నా, అసలు తగలకపోయినా ఆకులు పసుపు వర్ణంలోకి మారతాయి బయట వాతావరణాన్ని గమనించుకుని ఎండ ఎక్కువ ఉంటే సెమీ షేడ్‌లోకి మార్చాలి. నీడలో ఉంటే వాటికి కనీసం మూడు నాలుగు గంటలైనా సూర్యరశ్మి అందేలా చేయాలి. పేను బంక, తెల్లదోమ, మైట్స్.. వంటి చీడలు ఆకుల్లోని రసాన్ని పీల్చేయడం వల్ల ఇలా జరగొచ్చు. వేప నూనె చల్లడం మంచిది. □

## ముఖ వర్చస్సుకోసం !

మిస మిస లాడే ముఖ వర్చస్సు మీకే కావాలంటే ఇలా చేయవచ్చు.

చర్మంపై పేరుకుపోయిన మృతకణాలను తొలగించడంలో వంట సోడా బాగా పని చేస్తుంది. చెంచా వంటసోడాలో రెండు చెంచాల యాపిల్ సిడార్ వెనిగర్ చేర్చి, పేస్టులా చేసు కోవాలి. ముఖాన్ని కడిగి, తడి లేకుండా తుడిచాక ఈ మిశ్రమాన్ని పట్టించాలి. పది నిమిషాల తర్వాత గాఢత తక్కువ ఉండే ఫేస్‌వాష్‌తో కడిగేస్తే సరి. మెరిసే చర్మం మీసొంతం.



**నిమ్మ..** చర్మాన్ని మెరిపించడంలో నిమ్మదీ ప్రత్యేక పాత్రే. దీనిలోని విటమిన్ సి సహజ పని చేస్తుంది. ఒక నిమ్మచెక్కను సన్నటి చక్కెరలో ముంచి ముఖంపై మృదువుగా మర్దనా చేస్తే చాలు. అయిదు నిమిషాలయ్యాక గోరువెచ్చని నీటితో శుభ్రం చేస్తే సరి. చర్మరంధ్రాలను లోతుగా శుభ్రం చేసి, చర్మాన్ని మెరిసేలా చేస్తుంది. దీనిలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు అలర్జీలు, యాక్నే రాకుండానూ చూస్తుంది.

**అరటి-తేనె..** బాగా పండిన అరటి పండులో చిన్న ముక్క తీసుకొని గుజ్జులా చేయాలి. దానికి చెంచా తేనె, నాలుగైదు చుక్కలు నిమ్మరసం కలిపి, మెత్తని మిశ్రమంలా చేసు కోవాలి. దీన్ని శుభ్రమైన ముఖానికి పట్టించి, పావుగంటసేపు వదిలేయాలి. ఆపై గోరు వెచ్చని నీటితో కడిగేస్తే సరి. అరటిలో పుష్కలంగా ఉండే ఎ,బి,ఇ విటమిన్లు చర్మాన్ని మృదువుగా మార్చడమే కాదు. నల్లమచ్చలనీ తగ్గిస్తాయి. తేనెలోని యాంటీ ఆక్సిడెంట్లు చర్మాన్ని తేమగా ఉంచుతాయి.

**నారింజ తొక్కలతో..** చెంచా నారింజ తొక్కల పొడికి,చెంచా తేనె, చిటికెడు పసుపు కలిపి మెత్తని చూర్ణంలా చేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని శుభ్రమైన ముఖానికి పట్టించి ఆరనివ్వాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసి, మాయిశ్చరైజర్‌ను రాస్తే సరి. దీనిలో ఉండే సి విటమిన్‌ముఖంపై ముడతలు, గీతలను తగ్గించడంలో సాయపడుతుంది. □

## తినకపోతేనేం !



**సరైన వేళకి అలా ఎక్కువ కాలం వేళాపాళా లేకుండా తినడం, అసలు తినక పోవడం వంటివన్నీ తరువాత జంక్‌ఫుడ్ మీదకు మనసు మళ్లేలా చేస్తాయి.** ఫలితంగానే అజీర్తి, మలబద్ధకం, గ్యాస్, బరువు పెరగడం వంటి సమస్యలన్నీ.. మరి అలాకాకుండా ఉండాలంటే వీటికి దూరంగా ఉండమంటున్నారు నిపుణులు. కొవ్వు శాతం ఎక్కువగా ఉండే ఆహారాలు జీర్ణ వ్యవస్థను దెబ్బ తీస్తాయి. ఇతర ఆహారాలతో పోలిస్తే కొవ్వు పదార్థాలు జీర్ణం కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. వినియోగించే కొవ్వు రకాన్ని బట్టి, అవి అరిగే సమయం మారుతుంది. అధిక కొవ్వు పదార్థాలు గ్యాస్, ఉబ్బరం, మలబద్ధకాలకి కారణవుతాయి. వీలైనంతవరకూ వీటికి దూరంగా ఉండటమే మంచిది. నట్స్, సీడ్స్,గుడ్లు,బీన్స్, చేపలు వంటి ఆరోగ్యకర మైన కొవ్వులు దొరికే పదార్థాలను తీసుకోండి. కారంగా,ఘాటుగా ఉన్న పదార్థాలు రుచికి భలే ఉంటాయి. కానీ, అతిగా తింటే జీర్ణాశయ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి. ఇవి పొట్ట, పేగు లైనింగ్‌పై ప్రభావం చూపిస్తాయి. ఫలితంగా డయేరియా కడుపులో మంట, నొప్పి వంటి ఇబ్బందులను ఎదుర్కోవాలి. అతి ఏదైనా సమస్యే అది గుర్తుంచుకోవాలి. స్వీట్లూ, కృత్రిమ స్వీటెనర్లు ఉన్న పదార్థాలను తీసుకోవడం అంత మంచిది కాదు. ఇందులో చక్కెరతో పాటు కెలొరీల మోతాదూ ఎక్కువే. ఇవి పేగుల్లోని ఆరోగ్య కరమైన బ్యాక్టీరియా సమతుల్యతను దెబ్బతీస్తాయి. ఫలితంగా గ్యాస్, కడుపు ఉబ్బరం వంటి జీర్ణసమస్యలు రావచ్చు. బేకరీ ఐటెమ్స్ ప్రాసెస్ చేసిన పిండితోనే ఎక్కువగా చేస్తారు. వీటిని ఎక్కువగా తినడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ లెవల్స్ పెరిగిపోతాయి. ఇవి పేగుల వాపునకు కారణమవు తాయి. బరువు పెరగడంతోపాటు టైప్ 2 డయాబెటిస్‌న రిస్కునీ ఎదుర్కోవాల్సి వస్తుంది. బదులుగా చిరుధాన్యాలతో చేసిన చిరుతిళ్లు, పండ్ల ముక్కలు వంటివాటిని తీసుకోవచ్చు. ఇవి జీర్ణ ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు బరువూ, వాటి వల్ల వచ్చే ఇతరత్రా సమస్యల్నీ తగ్గిస్తాయి. □

## ఆఫీసులో 'జోగు'తున్నారా?



**కొంతమంది ఉద్యోగినులకు ఆఫీసుకెళ్లగానే నిద్ర ముంచుకొస్తుంది. ఇంకొందరికేమో కాస్త అన్నం తినగానే ఆవలింతలు మొదలై పోతాయి. ఎందుకిలా?** దీనెలా అదుపు చేసుకోవాలి. మధ్యాహ్న భోజనం తరవాత శరీరంలో ఇన్సులిన్ స్థాయి పెరిగి రక్తంలో చక్కెర స్థాయులు ఎక్కువుతాయి. ఇది నిద్రపోయే హార్మోన్లు సెరటోనిన్, మెలటోనిన్‌ను పెంచుతుంది. దీంతో కాస్త మగతగా నిపిస్తుంది. ఇలాంటప్పుడు తిన్న వెంటనే పనిలో పడిపోకుండా..కాసేపు అంటూ ఇటూ నడవండి లేదా మెట్లెక్కి దిగండి. శరీరానికి తగినన్ని నీళ్లు అందనప్పుడు అలసటకు గురవుతుంది. ఇది నిద్రకూ కారణం అవ్వొచ్చు. ఎప్పుడైనా కళ్లు మూతలు పడుతున్నా యంటే ఓ గ్లాసు వాటర్ తాగి చూడండి. మీరు శక్తినిచ్చే ఆహారం తీసుకోకపోయినా నిద్ర ముంచుకొస్తున్నట్లు అనిపిస్తుంది. సాయంత్రం అయ్యేసరికి ఈ సమస్య ఎదురవుతుంటే మీరు నిసత్తువతో ఉన్నట్లే. ఈ పరిస్థితి అదుపులోకి రావాలంటే గుప్పెడు నట్స్, సీడ్స్‌ని డబ్బాలో వేసుకుని వెంట తీసుకెళ్లండి. మీకు తీసుకునే ఆహారంలో ఇనుము, ప్రోటీన్లు పిండిపదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి. ఇవన్నీ మిమ్మల్ని ఉత్సాహంగా ఉంచేవే. పగటి పూట నిద్ర వెంటాడటానికి మరో కారణం రాత్రిళ్లు మీరు గాఢ నిద్ర లేకపోవడమే. ఇందుకు పనివేళలు, గ్యాడ్జెట్స్ కారణం ఏదైనా సరే.. వాటిని నియంత్రించుకోండి. కనీసం ఆరుగంటలైనా కలత నిద్రలేకుండా చూసుకోండి. ఇది మీ సమస్యను అదుపులో ఉంచుతుంది. □

## స్వీట్‌కార్న్ పటోలి



: ఒక కప్పు స్వీట్‌కార్న్: కప్పున్నర
శనగపిండి: ఒక టేబుల్ స్పూన్
మినప్పప్పు: ఒక టేబుల్ స్పూన్
ఆవాలు: ఒక టేబుల్ స్పూన్
జీలకర్ర: ఒక టేబుల్ స్పూన్
పచ్చిమిరపకాయలు: రెండు (సన్నగా తరిగి)నూనె: రెండు టేబుల్ స్పూన్లు
కరివేపాకు: రెండు రెబ్బలు
కొత్తిమీర: చిన్నకట్ట (తరిగి)

తయారు చేసే విధానం: ముందుగా శనగపప్పు నాలుగు గంటల పాటు నానబెట్టుకోవాలి. బాగా నానిన తర్వాత వాటిని కచ్చాపచ్చాగా మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు పొయ్యి వెలిగించి, దాని మీద బాణలి పెట్టి, అందులో నూనె వేయాలి. నూనె సెగ పట్టిన తర్వాత మినప్పప్పు, ఆవాలు, జీలకర్ర, కరివేపాకు, పచ్చిమిర్చి వేసి చిటపటలాడనివ్వాలి. స్వీట్‌కార్న్ గింజల్లో మూడొంతులు కచ్చాపచ్చాగా దంచుకొని అందులో వేయాలి.పదార్థం కాస్త మగ్గిన తర్వాత మిగిలిన స్వీట్‌కార్న్ కూడా అందులో వేసి బాగా మగ్గనివ్వాలి. పైనుంచి శనగపిండి చల్లుకొని.. కాసేపు వేగనివ్వాలి. ఆపై తగినంత ఉప్పు వేసి.. బాగా కలుపుకోవాలి. చివరిగా కొత్తిమీర వేసుకొని పొయ్యి మించి దించేసుకోవాలి. అంతే, యమ్మీ యమ్మీ స్వీట్‌కార్న్ పటోలి రెడీ! □

## విఘ్నేశ్వరుడి ఆరాధన



**విఘ్నాలను** తొలగించే విఘ్నేశ్వరుడి జన్మదినమే వినాయక చవితి. ఏటా భాద్రపద మాసంలో శుక్లపక్ష చవితి రోజున దేశవ్యాప్తంగా ఈ పర్వదినాన్ని కన్నుల పండుగగా జరుపుకొంటారు. భారతీయ సమాజంలో వినాయకచవితికి విశిష్టమైన ప్రాముఖ్యం ఉంది. అది దంపతుల ప్రథమ కుమారుడైన వినాయకుడిని పూజించనిదే ఏ పనీ ప్రారంభించరు. గణనాథుని కృప ఉంటే అన్నీ విజయాలే లభిస్తాయ నేది ప్రజల విశ్వాసం. జోత్యతిషశాస్త్రం ప్రకారం విఘ్నేశ్వరుడి ఆరాధనలోకుజుడు, బుధుడు, కేతు గ్రహాల అనుగ్రహ సిద్ధి ఉంటుంది. విఘ్నేశ్వరుడు ధూమకేతు గణాధ్యక్షుడు, మోక్ష కారకత్వానికి అధినాయకుడు కావడంతో కేతు గ్రహానికి అధిపతి అయ్యాడని, బుధుడి అనుగ్రహంతో విద్య, జ్ఞానప్రాప్తి, వ్యాపారాభివృద్ధి కలుగు తుందని, అలాగే, కుజ గ్రహం అనుగ్రహం వివాహ, అన్యోన్య దాంపత్యానికి చిహ్నం. ఒక్క పార్వతీ తనయుడిని ఆరాధించడం వల్ల ఈ మూడుగ్రహాల అనుగ్రహం పొందవచ్చని జ్యోతిషశాస్త్రం పేర్కొంటోంది. విఘ్నాలు తొలగాలన్నీ, దృష్టి దోషములు పోవాలన్నా, ఆటంకాల నుంచి రక్షణ పొందాలన్నా, విద్య, బుద్ధి, సిద్ధి ప్రాప్తి కలగాలన్నా, బుద్ధి వికాసానికి వ్యాపారాభివృద్ధికి, మోక్ష ప్రాప్తికి విఘ్నేశ్వరుడి ఆరాధన కచ్చితంగా చేయాలని పురాణాలు చెబుతున్నాయి. □

# తెర

## సినీ ప్రయాణంలో 48 ఏళ్లు పూర్తి.. 'శివశంకర వర ప్రసాద్' నుంచి మెగాస్టార్ వరకు అపూర్వ ప్రయాణం



తెలుగు చలనచిత్ర పరిశ్రమలోకి ఒక సామాన్యుడిగా అడుగుపెట్టి, ఎన్నో విజయాలను సొంతం చేసుకుని మెగాస్టార్‌గా అవతరించిన చిరంజీవి... తన సినీ ప్రయాణంలో 48 ఏళ్లు పూర్తి చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియా వేదికగా అత్యంత భావోద్వేగపూరిత పోస్ట్‌ను పంచుకున్నారు. 1978 సెప్టెంబర్ 22న తాను నటించిన తొలి చిత్రం 'ప్రాణం ఖరీదు' వెండితెరపై విడుదలైన రోజే తన జీవితంలో సరికొత్త అధ్యాయం ప్రారంభమైందని ఆయన గుర్తు చేసుకున్నారు. ఆ రోజున కొణిదెల శివశంకర వరప్రసాద్ అనే తన అసలు పేరును 'చిరంజీవి'గా మార్చుకున్నానని, నేడు అదే పేరు తనకు కోట్లాది మంది అభిమానుల గుండెల్లో శాశ్వత గుర్తింపుగా మిగిలిపోయిందని ఆనందం వ్యక్తం చేశారు. సుదీర్ఘమైన ఈ 48 ఏళ్ల పయనంలో ఎన్నో రకాల పాత్రలను పోషించానని, లెక్కలేనన్ని అపూర్వ విజయాలు, గౌరవాలు, జాతీయ అంతర్జాతీయ అవార్డులను అందుకున్నానని చిరంజీవి పేర్కొన్నారు. తనకు నటుడిగా అవకాశాలు ఇచ్చిన నిర్మాతలు, తనలోని సరికొత్త నటనను ఆవిష్కరించిన దర్శకులు, అహర్నిశలు శ్రమించిన సాంకేతిక నిపుణులు, తోటి నటీనటులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ' ఇవన్నీ ఒకెత్తయితే తనపై కోట్లాది మంది అభిమానులు చూపిస్తున్న నిరంతర ప్రేమాభిమానాలే తన జీవితంలో అతిపెద్ద విజయమని, అభిమానులను తన సొంత కుటుంబ సభ్యులుగా భావిస్తూ శిరస్సు వంచి ధన్యవాదాలు అర్పిస్తున్నానని వెల్లడించారు.

## 'ది ప్యారడైజ్' సెలబ్రేట్ చేసుకుందాం: నాని

న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటం టైనర్ 'ది ప్యారడైజ్'. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం లో, ఎస్ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో భారీ అంచనాలు పెంచాయి.



ఈ చిత్రం సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్‌గా ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ప్రీరిలీజ్ ఈవెంట్‌లో నేచురల్ స్టార్ నాని మాట్లాడుతూ: ఈ టీంలో అందరూ ప్రాణం పెట్టి పని చేశారు. ప్రతి జూనియర్ ఆర్టిస్ట్ కూడా ఎంతో కష్టపడ్డారు. నాతో పాటు కలిసి చేసిన సవారీ గ్యాంగ్ అందరి పెర్ఫార్మెన్స్ మీకు గుర్తుండిపోతుంది. కాసర్ల శ్యామ్ గారు వండర్‌ఫుల్ లిరిక్స్ రాశారు. మా డాన్స్ మాస్టర్‌కి థాంక్యూ. డైరెక్టర్ శ్రీకాంత్‌కి నాకు ఉన్నది అన్నదమ్ముల అనుబంధం. నిర్మాత దిల్ రాజు మాట్లాడుతూ: నాని అభిమానుల ఉత్సాహం చూస్తుంటే సినిమా ఆల్రెడీ విడుదలై బ్లాక్‌బస్టర్ కొట్టినంత ఫీలింగ్ ఈరోజే వస్తోంది. నాని ఇంతింతై వటుడింతై అన్నటుగా ఒక్కొక్క మెట్టు ఎక్కుతూ, ఈరోజు 'ప్యారడైజ్'తో ఒక స్టార్ హీరోగా ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. హీరోయిన్ కయాదు లాహోర్ మాట్లాడుతూ: మీ అందరి ఎనర్జీ చూస్తుంటే చాలా ఆనందంగా ఉంది. మీ అందరితో కలిసి సినిమా చూడటానికి ఎదురు చూస్తున్నాను. మా నిర్మాతకి థాంక్యూ. నిర్మాత సుధాకర్ చెరుకూరి మాట్లాడుతూ: మా టీమ్ అందరికీ థాంక్యూ.

## 'రణబాలి' 'ఏందయ్య సామీ' ఫుల్ సాంగ్ రిలీజ్



విజయ్ దేవరకొండ, రశ్మిక మందన్న జంటగా నటిస్తున్న భారీ పాన్ ఇండియా మూవీ'రణబాలి'. ఈ సినిమాకు రాహుల్ సంకృత్యన్ దర్శకత్వం వహిస్తున్నారు. టీ సిరీస్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్ పై 'రణబాలి' సినిమాను ప్రొడ్యూసర్స్ నవీన్ యెర్నేని, వై రవిశంకర్ హ్యూజ్ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు. అక్టోబర్ 16న విజయదశమి పర్వదినం సందర్భంగా 'రణబాలి' సినిమా వరల్డ్ వైడ్ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు ఈ చిత్రం నుంచి 'ఏందయ్య సామీ..' ఫుల్ లిరికల్ సాంగ్ ను రిలీజ్ చేశారు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడ, హిందీ..ఐదు భాషల్లో ఈ పాటను విడుదల చేశారు. 'రణబాలి'లో విజయ్, రశ్మిక పెళ్లి వేడుక సందర్భంగా 'ఏందయ్య సామీ..' పాట చిత్రీకరించారు. 19వ శతాబ్దంలో పెళ్లి సందడి ఎంత సంప్రదాయంగా ఉండేదో 'ఏందయ్య సామీ..' పాటలో అందంగా రూపొందించారు. ఈ పాటను అజయ్ అతుల్ మెలొడియస్‌గా కంపోజ్ చేశారు. రామజోగయ్య శాస్త్రీ అద్భుతమైన లిరిక్స్ అందించగా, శ్వేతా మోహన్, అజయ్ గోగవలే మధురంగా పాడారు. 'ఏందయ్య సామీ..' పాట ఎలా ఉందో చూస్తే ఖఏందయ్యా సామీ ఇట్ట గాస్తాందీ వెన్నెల, ఊపేస్తా ఉంది సిత్తరాలా ఉయ్యాలా, వీచే గాలికి అత్తరద్దిందెవ్వరు, మారే ఘుముకి మందుపెట్టిందెవ్వరు, మాయదారి మనస్సాగక జాగరమన్నరా... అంటూ మళ్లీ మళ్లీ వినాలనిపించేలా సాగుతుందీ పాట. 19వ సెంచరీ నేపథ్యంతో 1854 నుంచి 1878 మధ్య బ్రిటీష్ పాలనా కాలంలో జరిగిన యదార్థ చారిత్రక సంఘటనల ఆధారంగా "రణబాలి" సినిమా రూపొందుతోంది. ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో మూవీ లవర్స్‌లో ఆసక్తి కలిగిస్తోంది. రీసెంట్‌గా రిలీజ్ చేసిన ఈ చిత్ర టీజర్ మూవీపై అంచనాలు మరింతగా పెంచేసింది.

## కార్తికేయ గుమ్మకొండ 'కమ్‌బ్యాక్'



స్వీయ దర్శకత్వంలో హీరోగా కొత్త సినిమాట్యాలెంటెడ్ టాలీవుడ్ యంగ్ హీరోల్లో కార్తికేయ గుమ్మకొండ ఒకరు. 'ఆర్ఎక్స్ 100' లో ఆయన నటనకు ఎంతో మంది అభిమానులు ఏర్పడ్డారు. హీరోగా మాత్రమే కాదు... నటుడిగానూ ప్రేక్షకుల మదిలో ఓ ఇంపాక్ట్ క్రియేట్ చేశారు. తనలో స్టైలిష్ విలన్ ఉన్నాడని 'నానీస్ గ్యాంగ్ లీడర్'తో చూపించారు. కోలీవుడ్ స్టార్ అజిత్ 'వలిమై'లో తనదైన విలనిజంతో తమిళ ప్రేక్షకులనూ ఆకట్టుకున్నారు. అయితే ఆయన నుంచి సినిమా వచ్చి రెండేళ్ళు దాటుతోంది. ఇప్పుడు కార్తికేయ గుమ్మకొండ మళ్ళీ కమ్‌బ్యాక్ ఇస్తున్నారు. కథానాయకుడిగా రెండేళ్ళ విరామం తర్వాత కార్తికేయ గుమ్మకొండ చేస్తున్న సినిమా 'కమ్‌బ్యాక్'. ఈ సినిమా ప్రత్యేకత ఏమిటంటే... 'కమ్‌బ్యాక్‌'తో కార్తికేయ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. స్వీయ దర్శకత్వంలో హీరోగా నటిస్తున్న సినిమాను ఆయన పుట్టినరోజు సెప్టెంబర్ 21న అనౌన్స్ చేశారు. ఈ సందర్భంగా ఓ స్పెషల్ గ్లింప్స్ విడుదల చేశారు. కార్తికేయ క్రియేటివ్ వర్క్స్ పతాకంపై రూపొందుతున్న ఈ సినిమాకు ఆయన సతీమణి లోహితా రెడ్డి నిర్మాత.'బాక్సింగ్ వరల్డ్‌లో తన పేరు వినిపించి మూడేళ్ళు అవుతోంది. నేనింకా ప్రొఫెషన్ మారిపోయి ఉంటాడేమో అనుకున్నాను. మూడేళ్ళు అవుతుందని నీకు గుర్తు అన్నా ఉంది. అది నాకు కూడా లేదు. అయినా ఇప్పుడు వచ్చి ఏం చేస్తాడు? యా... దట్స్ ట్రూ (అది నిజమే). ఇట్ ఫీల్స్ లైక్ సూసైడ్ మిషన్ (ఓ విధంగా అది ఆత్మహత్య చేసుకోవడమే). మూడేళ్ళ నుంచి ఏమైపోయాడో తెలియలేదు. ఇన్ని రోజులు ఏం చేస్తున్నాడు?అని వాయిస్ ఓవర్ వినిపిస్తున్న సమయంలో తెరపై టెక్నీషియన్ల పేర్లు పరిచయం చేశారు.

## 'జనవరి 12 విడుదల' కృతి శెట్టి ఫస్ట్ లుక్ రిలీజ్



విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో మోస్ట్ అవైటెడ్ ఫెస్టివ్ ఎంటర్‌టైనర్ 'జనవరి 12 విడుదల' శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మి స్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జీ స్టూడియోస్ సమర్పిస్తున్నాయి. సినిమా నుంచి వస్తున్న ప్రతి అప్‌డేట్ ఆసక్తిని పెంచు తోంది. బావ బామ్మరి సౌజన్యంతో అనే ఇంట్రె స్టింగ్ ట్యాగ్‌లైన్‌తో వస్తున్న ఈ చిత్ర టైటిల్‌ను మేకర్స్ ఇటీవల హిలేరియస్, ఎంటర్‌టైనింగ్ వీడియో ద్వారా ప్రకటించారు. దీంతో సినిమాపై బజ్ మరింత పెరిగింది. ఇప్పటికే వెంకటేష్, కళ్యాణ్ రామ్ ఫస్ట్ లుక్స్‌ను పరిచయం చేసిన మేకర్స్.. తాజాగా హీరోయిన్ కృతి శెట్టి పుట్టిన రోజు సందర్భంగా ఆమెను 'దీపు'గా పరిచయం చేస్తూ ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో కృతి శెట్టి ట్రెడిషనల్ అవతార్‌లో ఆకట్టుకున్నారు. పర్పుల్‌పింక్ కలర్ హాఫ్ సారీలో అందంగా కనిపించారు. ఆమె ఆహ్లాదకరమైన చిరునవ్వు ఈ ఫస్ట్ లుక్‌కు మరింత చార్మ్, ఎలిగెన్స్‌ను తీసుకొచ్చింది. ఈ చిత్రానికి టాప్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా, సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ, తమ్మిరాజు ఎడిటర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ ఏఎస్ ప్రకాష్, ఎస్. కృష్ణ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరి స్తున్నారు. వెంకటేష్, కళ్యాణ్ రామ్ కాంబినేషన్‌కు తోడు కీర్తి సురేష్, కృతి శెట్టి లాంటి స్టార్స్ ఉండటంతో ఈ సినిమాపై మంచి అంచనాలు నెలకొన్నాయి. ఇక అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తుండటంతో ఈ చిత్రం ఫెస్టివల్ సీజన్‌లో ఫుల్ ఎంటర్‌టైనింగ్‌గా ఉండబోతోంది. ఈ చిత్రం జనవరి 12న ప్రేక్షకుల ముందుకు రానుంది. సంక్రాంతి సీజన్ అనిల్ రావిపూడికి సక్సెస్‌ఫుల్ విండోగా నిలుస్తూ వస్తోంది. తన సినిమాలను వరుసగా ఫెస్టివ్ సీజన్‌లో విడుదల చేస్తూ బలమైన కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌ను అందించిన అనిల్ రావిపూడి.. ఈసారి 'జనవరి 12 విడుదల'తో అద్భుతమైన కమర్షియల్ ఎంటర్‌టైనర్ అందించబోతున్నారు.

## 'అనుమాన పక్షి' ఎంజాయ్ చేస్తారు: రాగ్ మయూర్



**కథ, జానర్ ఎలా ఉండబోతుంది?**
ఇందులో మల్టిపుల్ జానర్స్ ఉంటాయి. ఎంటర్‌టైన్‌మెంట్‌తో మొదలై మిస్టరీ జానర్‌లోకి వెళ్లి థ్రిల్లర్, హారర్ టచ్ కూడా ఉంటుంది. సినిమా చాలా ఎంగేజింగ్‌గా ఉంటుంది.

**క్యారెక్టర్ ఎలా ఉంటుంది?**
ఇందులో హీరో క్యారెక్టర్‌కి అనుమానాలు ఎక్కువ. తన అనుమానాలతో చుట్టూ ఉన్న అందరికీ పిచ్చెక్కిస్తుంటాడు. తను కశ్మీర్‌కి వెళ్తాడు. అక్కడికి వెళ్లిన తర్వాత వచ్చే కామెడీ చాలా కొత్తగా ఉంటుంది.

**కశ్మీర్‌లో చిత్రీకరణ గురించి?**
కశ్మీర్‌ని ఎప్పుడూ ఒక సీరియస్ సిచువేషన్‌కి వాడుతుంటారు. ఫస్ట్ టైం ఒక లైట్ హార్టెడ్ కామెడీకి వాడుతున్నాము. అది చాలా బ్యూటిఫుల్ ప్లేస్. అలాంటి ప్లేస్‌ని ఒక లైట్ హార్టెడ్ జోనర్‌గా చూపించే ప్రయత్నం చాలా కొత్తగా ఉంటుంది.

**ఇందులో కాస్ట్యూమ్స్ చాలా వెరైటీగా ఉన్నాయి?**
హీరో క్యారెక్టర్‌కి అనుమానాలు ఎక్కువ. మన బట్టల్ని ఎవరికో దానం చేస్తున్నప్పుడు వాళ్లు మన మీద ఏదైనా చేతబడి చేస్తారని అనుమానపడతాడు. అందుకే ఇంట్లో ఉండే పాత చీరలు, కర్టెన్స్‌తో కూడా బట్టలు తయారు చేసుకుంటాడు.ఈ సినిమాకి అలాంటి రిఫరెన్స్ లేదు. అదే ఈ సినిమా బ్యూటీ. ఒరిజినల్‌గా ఆలోచించే వాళ్లకి రిఫరెన్స్ ఉండదు. ఇది కూడా ఆ కేటగిరీకి చెందినది.

**రమణ గోగుల గారి పాట గురించి?**
రమణ గోగుల అంటే పవన్ కళ్యాణ్ గారికి ఆయన పాడిన పాటలన్నీ గుర్తుకు వస్తాయి. అలాంటి ఆయన నా తొలి సోలో సాంగ్ పాడటం చాలా ఆనందంగా అనిపించింది.

**కామెడీ చేయడం కష్టం అంటారు కదా.. మీకు ఎలా అనిపించింది?**
నన్ను మొదటినుంచి ప్రేక్షకులు ఒక కామెడీ జోన్‌లోనే అప్రిషియేట్ చేశారు. సినిమా బండి, 'కీడా కోలా,' 'మిత్రమండలి ఇవన్నీ కూడా కామిక్ జోన్ సినిమాలే. నాకు ఒక ప్రత్యేకమైన కామెడీ టైమింగ్ ఉందని ప్రేక్షకులు నన్ను ప్రోత్సహిస్తూ వచ్చారు.



# టి20లో పరువు కాపాడుకున్న టీమిండియా

## 2 పరుగుల తేడాతో జపాన్‌పై గెలుపు

**టోచిగి ప్రిఫెక్చర్ :** భారత్, జపాన్ జట్ల మధ్య జరిగిన చారిత్రాత్మక టీ20 మ్యాచ్ తీవ్ర ఉత్కంఠ నడుమ ముగిసింది. జపాన్ లో మంగళవారం వర్షం కారణంగా ఐదు ఓవర్లకు కుదించిన ఈ పోరులో శ్రేయస్ అయ్యర్ సారథ్యంలోని టీమిండియా కేవలం 2 పరుగుల తేడాతో జపాన్ పై విజయాన్ని అందుకుంది. చివరి బంతి వరకు ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో అక్షర్ పటేల్ అద్భుతమైన బౌలింగ్ ప్రదర్శనతో జట్టును విజేతగా నిలిపాడు. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టుకు జపాన్ బౌలర్లు ఊహించని షాక్ ఇచ్చారు. క్రమశిక్షణతో కూడిన బౌలింగ్‌తో భారత అగ్రశ్రేణి బ్యాటర్లను కట్టడి చేశారు. ఓపెనర్ అభిషేక్ శర్మ పరుగులేమీ చేయకుండానే తొలి ఓవర్లోనే పెవిలియన్ బాట పట్టగా, తర్వాత ఓవర్లలో సంజు శాంసన్(9), ఇషాన్ కిషన్(3) కూడా త్వరగానే ఔటయ్యారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ 12 బంతుల్లో 16 పరుగులు చేసి ఓవర్ చివరలో ఔట్ అవ్వడంతో భారత్ నిర్ణీత 5 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 32 పురుగులు మాత్రమే చేయగలిగింది. అనంతరం 33 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన జపాన్ ను భారత బౌలర్లు కట్టడి చేశారు. జపాన్ బ్యాటర్లు ధీటుగా పోరాడినప్పటికీ, నిర్ణీత 5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 30 పరుగులకే పరిమితమయ్యారు. చివరి బంతికి జపాన్ గెలుపునకు 4 పరుగులు అవసరం కాగా, అక్షర్ పటేల్ ఒత్తిడిని జయించి కేవలం ఒక పరుగు మాత్రమే ఇవ్వడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది.




## మహిళల బ్యాడ్మింటన్‌లో ఉన్నతి, సింధు ఓటమి

**ఇచినోమియా సిటీ:** ఇచినోమియాలో మంగళవారం జరిగిన ఆసియా క్రీడల క్వార్టర్ ఫైనల్‌లో, పివి సింధు, ఉన్నతి హూడా తమ తమ సింగిల్స్ మ్యాచ్‌లలో ఓడిపోవడంతో భారత మహిళల బ్యాడ్మింటన్ జట్టు జపాన్‌పై 0-2తో వెనుకబడింది. ఉన్నతి బలంగా ప్రారంభించి తొలి గేమ్‌లో 11-10 ఆధిక్యంలో నిలిచింది. అయితే జపనీస్ షట్లర్ తిరిగి పుంజుకుని, ఆ గేమ్‌ను 21-16 తేడాతో కైవసం చేసుకుంది. రెండో గేమ్‌లోనూ ఉన్నతి మరోసారి అద్భుతంగా ప్రారంభించి 11-4 ఆధిక్యాన్ని సాధించింది. గేమ్ సాగేకొద్దీ జపాన్ పుంజుకోవడంతో, ఉన్నతి చివరికి 15-16తో వెనుకబడింది. ఆమె పట్టు సాధించలేకపోవడంతో జపాన్ క్రీడాకారిణి 21-18 తేడాతో గేమ్‌ను ముగించి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. అంతకుముందు, సింధు అకానె యమగుచి చేతిలో 23-21, 18-21, 11-21 తేడాతో తొలి గేమ్ కోల్పోయింది. 6-10తో వెనుకబడిన సింధు, నుంచి కోలుకుని స్కోరును 12-12తో సమం చేసింది. ఆ తర్వాత 15-18తో వెనుకబడినప్పటికీ పుంజుకుని, ఒక గేమ్ పాయింట్‌ను కాపాడుకుని, గేమ్‌ను 23-21తో కైవసం చేసుకుంది. సింధు 12-17తో వెనుకబడిన స్కోరును 16-18కి తగ్గించిన తర్వా త, రెండవ గేమ్‌లో యమగుచి పుంజుకుంది. ఈ జపనీస్ షట్లర్ తన ఆధిక్యాన్ని తిరిగి సాధించి 21-18 తేడాతో గెలిచింది. నిర్ణయాత్మక సెట్‌లో యమగుచి 11-4 ఆధిక్యం సాధించి, చివరికి 21-11 తేడాతో విజయాన్ని పూర్తి చేశాడు.

# పురుషుల హాకీలో భారత్ విక్టరీ



## శ్రీలంక 16-1 తేడాతో చిత్తు

**కకమిగహారా:** ఆసియా క్రీడల పురుషుల హాకీ పోటీలలో భారత్ తన ఆధిపత్యాన్ని కొనసాగిస్తూ, మంగళవారం జరిగిన పోరులో శ్రీలంకను 16-1 తేడాతో చిత్తుగా ఓడించింది. భారత్ ఆరంభం నుంచే ఆటపై పట్టు సాధించి, ఐదవ నిమిషంలో గోల్ చేసింది. జర్మన్‌ప్రీత్ సింగ్ పంపిన బంతిని మన్‌దీప్ సింగ్ గోల్ చేశాడు. (10వ) జుగ్రాజ్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచి ఆధిక్యాన్ని రెట్టింపు చేశాడు. తర్వాత హర్మన్‌ప్రీత్ సింగ్ పంపిన లాంగ్ బాల్‌ను జర్మన్‌ప్రీత్ అందుకుని గోల్ చేసి స్కోరును 3-0కి చేర్చాడు. పెనాల్టీ కార్నర్‌ను (15వ) గోల్‌గా మలచి హర్మన్ స్కోరు చేయగా, అభిషేక్ మళ్లీ గోల్ చేసి 5 గోల్స్ ఆధిక్యాన్ని అందించాడు. మరో పెనాల్టీ కార్నర్ ద్వారా (22వ) జుగ్రాజ్ తన 2వ గోల్ సాధించాడు. రెండవ క్వార్టర్ ముగిసేలోపు దిల్‌ప్రీత్ సింగ్ స్కోరును 8-0కి చేర్చాడు. మూడవ క్వార్టర్‌లో (31వ) మన్‌ప్రీత్ సింగ్ డ్రాగ్‌ఫ్లిక్‌తో గోల్ చేయగా, వివేక్ ప్రసాద్ కూడా గోల్ సాధించాడు. సుఖ్‌జీత్‌తో కలిసి దిల్‌ప్రీత్ (38వ) తన 2వ గోల్ సాధించగా, (42వ) పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా మార్చి జుగ్రాజ్ హ్యాట్రిక్ పూర్తి చేశాడు. భారత్‌కు వరుసగా మూడో పెనాల్టీ కార్నర్ లభించడంతో (44వ) హర్మన్‌ప్రీత్ మళ్లీ గోల్ చేసి స్కోరును 13-0కి చేర్చాడు. ఆఖరి పీరియడ్‌లో (49వ) 14వ గోల్ చేసి అభిషేక్ హ్యాట్రిక్‌ను పూర్తి చేశాడు. ఆ తర్వాతి సురేష్ రత్నాయకే అద్భుతమైన టోమాహాక్ ఫినిషింగ్‌తో స్కోరును 14-1కి చేర్చడంతో శ్రీలంకకు ఎట్టకేలకు బ్రేక్‌త్రూ లభించింది. అయితే (53వ) జుగ్రాజ్ మరో పెనాల్టీ స్ట్రోక్‌ను గోల్‌గా మలిచి తన నాలుగు గోల్స్‌ను పూర్తి చేసుకున్నాడు. తదుపరి మన్‌దీప్ అద్భుతమైన స్టిక్ వర్క్‌తో దిల్‌ప్రీత్ 3వ గోల్‌ను సాధించాడు. దీంతో భారత్ పూల్ ఎలో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది.



## టేబుల్ టెన్నిస్‌లో ఉత్తర కొరియా విజయం

### 3-0 తేడా ఓటమితో భారత్ నిష్క్రమణ

**నగోయా:** ఉత్తర కొరియా చేతిలో 0-3 తేడాతో ఓటమి పాలైన భారత మహిళల టేబుల్ టెన్నిస్ జట్టు, 2026 ఆసియా క్రీడల టీమ్ ఈవెంట్ నుండి పతకం లేకుండానే నిష్క్రమించింది. మంగళవారం జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో అకుల శ్రీజ, యశస్విని ఘోర్పడే, దియా చితాలే అందరూ వరుస గేమ్‌లలో ఓటమి పాలవ్వడంతో, ఉత్తర కొరియా క్లీన్ స్వీప్ పూర్తి చేసి ఈ టోర్నమెంట్‌లో భారత్ ప్రస్థానానికి ముగింపు పలికింది. గత రౌండ్‌లో థాయ్‌లాండ్‌పై భారత్ కష్టపడి సాధించిన విజయంలో కీలక పాత్ర పోషించిన శ్రీజ, కుమ్ యోంగ్ కిమ్‌తో తలపడిన తొలి భారత క్రీడాకారిణి. అయితే, ఆమె ఆ ఫామ్‌ను క్వార్టర్‌ఫైనల్‌లో కొనసాగించలేక, 7-11, 6-11, 5-11 తేడాతో 0-3 వద్ద ఓడిపోయింది. భారత్ 0-1తో వెనుకబడి ఉన్నప్పుడు, మ్యాచ్‌లో జట్టును నిలబెట్టే బాధ్యత యశస్వినిపై పడింది. ఆమె కూడా సాంగ్ గ్యోంగ్ ప్యోన్‌ను ఓడించడానికి చాలా కష్టపడింది. 4-11, 3-11, 6-11 తేడాతో ఓడిపోవడంతో ఉత్తర కొరియా 2-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. భారత్ పునరాగమన ఆశలను సజీవంగా ఉంచుకోవాలంటే, దియా చితాలే ఆ తర్వాత సు యోంగ్ చాపై మూడో మ్యాచ్ గెలవాల్సి వచ్చింది. అయితే, ఆమె 9-11, 7-11, 8-11 తేడాతో ఓడిపోవడంతో, ఉత్తర కొరియా 3-0 తేడాతో విజయం సాధించి, భారత మహిళల జట్టు ప్రయాణాన్ని ముగించింది.

## మహిళల క్రికెట్‌లో పాక్‌కు కాంస్యం

**నిస్షిన్ సిటీ :** ఆసియా గేమ్స్ 2026లో పాకిస్థాన్ మహిళల క్రికెట్ టీమ్ బ్రాంజ్ మెడల్ సాధించింది. బంగ్లాదేశ్‌తో మంగళవారం జరిగిన కాంస్య పోరులో సమష్టిగా రాణించిన పాకిస్థాన్ 31 పరుగుల తేడాతో గెలుపొందింది. పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా చేసిన 45 పరుగులు ఆ జట్టుకు విజయాన్నందించాయి. ఏడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగిన ఫాతిమా సనా టెయిలండర్లతో కలిసి విలువైన భాగస్వామ్యాన్ని అందించింది. బౌలింగ్‌లో ఉమ్ ఈ హని తీన్మార్ బౌలింగ్‌తో బంగ్లా పతనాన్ని శాసించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ మహిళల టీమ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 145 పరుగులు చేసింది. కెప్టెన్ ఫాతిమా సనా(45), గుల్ ఫెరోజా(31), అలియా రైజ్(25), షావాల్ జుల్ఫికర్(17) డబుల్ డిజిట్ స్కోర్ చేయగా, మిగతా బ్యాటర్లు సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. బంగ్లాదేశ్ బౌలర్లలో నహిదా అక్తర్(2/21), షోర్నా అక్తర్(2/16), రితు మోని(2/27) రెండేసి వికెట్లు, సంజిదా అక్తర్(1/28) ఒక వికెట్ పడగొట్టింది. అనంతరం బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 114 పరుగులు చేసి ఓటమిపాలైంది. షార్మిన్ అక్తర్(46 నాటౌట్) పోరాడినా ఫలితం లేకపోయింది. కెప్టెన్ నిగర్ సుల్తాన(25) జిడ్డుగా ఆడింది. పాకిస్థాన్ బౌలర్లలో ఉమ్ ఈ హని(3/10) మూడు వికెట్లతో బంగ్లాదేశ్ పతనాన్ని శాసించగా, తస్మియా రుబాబ్, ఫాతిమాసనా, నష్రా సంధు, ఆయేషా జఫార్ తలో వికెట్ తీసారు.

# ఆసియా గేమ్స్‌లో భారత్‌కు స్వర్ణం

## టి20 మహిళా క్రికెట్ విజేతగా టీమిండియా

## ఫైనల్‌లో శ్రీలంకపై భారీ ఘనవిజయం

## క్రికెటర్లకు రాష్ట్రపతి, ప్రధాని అభినందనలు

**నిషిన్:** ఆసియా క్రీడల మహిళల టీ20 పోటీల్లో భారత జట్టు ఘన విజయాన్ని సాధించి పసిడి పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. నిషిన్‌లో మంగళవారం జరిగిన పోరులో శ్రీలంకను 147 పరుగుల తేడాతో చిత్తు చేసి భారత మహిళలు ఈ విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుత ఆసియా క్రీడల్లో భారత్ కు ఇది మొదటి స్వర్ణ పతకం కావడం విశేషం. గతేడాది ఆసియా క్రీడల ఫైనల్లోనూ శ్రీలంకపైనే గెలిచి పసిడి సాధించిన టీమిండియా, ఇప్పుడు వరుసగా రెండోసారి ఛాంపియన్‌గా నిలిచి ఆసియాలో తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. ఈ చారిత్రాత్మక పోరులో టాస్ గెలిచి ఫస్ట్ బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్లు స్మృతి మంధాన, షెఫాలీ వర్మ తొలి వికెట్‌కు 99 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పి కొండంత స్కోరుకు గట్టి పునాది వేశారు. స్మృతి మంధాన కేవలం 45 బంతుల్లో 7 సిక్సర్లు, 5 ఫోర్లతో 79 పరుగులు చేసి విజృంభించగా, షెఫాలీ వర్మ 29 బంతుల్లో 48 పరుగులు సాధించింది. చివరిలో వికెట్ కీపర్‌బ్యాటర్ రిచా ఘోష్ కేవలం 22 బంతుల్లోనే 6 ఫోర్లు, 3 సిక్సర్లతో నాటౌట్ గా 49 పరుగులు చేసి జట్టు స్కోరును 200 దాటించింది.

అనంతరం 217 పరుగుల కొండంత లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంక ఆరంభం నుంచే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. శ్రీలంక కెప్టెన్ చమరి అటపట్టు 21 బంతుల్లో 29 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలవగా, మిగిలిన బ్యాటర్లు భారత బౌలర్ల ధాటికి చేతులెత్తేశారు. ఫలితంగా 15.4 ఓవర్లకే 69 పరుగులకే ఆలౌట్ అయి శ్రీలంక దారుణ ఓటమిని మూటగట్టుకుంది. దీంతో లంక జట్టు రజత పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది.



## భారత్ జిడిపి వృద్ధి 6.7%

### ప్రపంచ ఆర్థిక వేదిక గ్లోబల్‌ట్రెండ్ నివేదిక వెల్లడి




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 22:** భారత ఆర్థిక వ్యవస్థకు సంబంధించి మరో సానుకూల అంచనా వెలువడింది. 2026-27 ఆర్థిక సంవత్సరంలో భారత్ జిడిపి వృద్ధి 6.7 శాతంగా ఉండొచ్చని వరల్డ్ ఎకనామిక్ ఫోరం చీఫ్ ఎకనామిస్ట్స్ ఔట్‌లుక్ నివేదిక తెలిపింది. దేశీయ డిమాండ్ బలంగా కొనసాగడం వృద్ధికి ప్రధాన కారణంగా పేర్కొంది. సెప్టెంబర్ 2026 నివేదిక కోసం ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు చెందిన 92 మంది చీఫ్ ఎకనామిస్టుల అభిప్రాయాలను సేకరించారు. వీరిలో 74 శాతం మంది భారత్‌లో ఆర్థిక వృద్ధి బలంగా లేదా చాలా బలంగా ఉంటుందని అంచనా వేశారు. మే నెలలో ఈ అభిప్రాయం 52 శాతంగా ఉంది. వచ్చే 12 నెలల్లో భారత్ వృద్ధి మోస్తరుగా లేదా అంతకంటే మెరుగ్గా ఉంటుందని 98 శాతం మంది భావించారు. ఉద్యోగాల విషయానికొస్తే వచ్చే 12 నెలల్లో నిరుద్యోగితలో మార్పు ఉండదని 70 శాతం మంది అంచనా వేశారు. ఆగస్టులో 15 యేళ్ల పైబడిన వారి నిరుద్యోగిత రేటు 5 శాతానికి తగ్గింది. జులైలో ఇది 5.1 శాతంగా ఉంది. ఇదే సమయంలో లేబర్ ఫోర్స్ భాగస్వామ్యం రేటు 55.4 శాతం నుంచి 55.6 శాతానికి పెరిగింది. ద్రవ్యోల్బణంపై కూడా అంచనాలు కొంత మెరుగయ్యాయి. వచ్చే యేడాది భారత్‌లో ద్రవ్యోల్బణం మోస్తరు స్థాయిలో ఉంటుందని 55 శాతం మంది ఎకనామిస్టులు భావించారు. 45 శాతం మంది మాత్రం అధికంగా ఉంటుందని అంచనా వేశారు. ఆగస్టులో రిటైల్ ద్రవ్యోల్బణం 4.8 శాతానికి చేరింది. ఇది ఆర్‌బిఐ లక్ష్యమైన 4 శాతానికి మించి ఉంది. అయితే 26 శాతం పరిమితిలోనే కొనసాగుతోంది. ద్రవ్య విధానంలో మార్పు ఉండదని 67 శాతం మంది అంచనావేశారు. ఆగస్టులో పాలసీ రేటును 5.25 శాతం వద్దే కొనసాగించారు. ఈ నివేదిక సర్వే ఆగస్టు 20న పూర్తయింది. ఆ తర్వాత ఆగస్టు 31న విడుదలైన గణాంకాల్లో 2026-27 తొలి త్రైమాసికంలో భారత్ జిడిపి వృద్ధి 7.8 శాతంగా నమోదైంది. దీంతో పలు సంస్థలు తమ వృద్ధి అంచనాలను పెంచుతున్నాయి. మూడీస్ కూడా తన అంచనాను 6 శాతం నుంచి 7 శాతానికి పెంచింది.

## ఎన్‌ఎస్‌ఇ ఐపిఒకు భారీ స్పందన

### 5.71 రెట్లు బిడ్లు దాఖలు




**ముంబై, సెప్టెంబరు 22:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఐపిఒకు భారీ స్పందన లభించింది. బిడ్డింగ్‌కు చివరి రోజు ముగిసే సమయానికి ఐపిఒ మొత్తం 5.71 రెట్లు సబ్ స్క్రైబ్ అయింది. దాదాపు 22,560 కోట్ల విలువైన ఆఫర్ ఫర్ సేల్‌లో భాగంగా అందుబాటులో ఉన్న 8.86 కోట్ల షేర్లకు గాను 50.58 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చినట్లు బిఎస్‌ఇ గణాంకాలు వెల్లడించాయి. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్లు నుంచి అత్యధిక స్పందన వచ్చింది. వారికి కేటాయించిన 2.52 కోట్ల షేర్లకు గాను దాదాపు 32 కోట్ల షేర్లకు బిడ్లు రావడంతో ఈ విభాగం 12.68 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. ఈ విభాగంలో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు సుమారు 14.03 కోట్ల షేర్లకు, బ్యాంకులు, బీమా సంస్థలు సహా దేశీయ ఆర్థిక సంస్థలు 6.8 కోట్ల షేర్లకు, మ్యూచు వల్‌ఫండ్లు 5.41 కోట్ల షేర్లకు బిడ్లు దాఖలు చేశాయి. నాన్‌ఇన్‌స్టిట్యూషనల్ ఇన్వెస్టర్లు కూడా ఐపిఒపై గణనీయమైన ఆసక్తి కనబరిచారు. ఈ విభాగానికి కేటాయించిన 1.89 కోట్ల షేర్లకు గాను 12.38 కోట్ల షేర్లకు బిడ్లు రావడంతో మొత్తం 6.55 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది.10 లక్షలకు పైగా పెట్టుబడి పెట్టిన ఇన్వెస్టర్ల విభాగం 7.78 రెట్లు,2 లక్షల నుంచి 10 లక్షల వరకు పెట్టుబడి పెట్టిన చిన్న ఎన్‌ఐఐ బిడ్లు 4.09 రెట్లు సబ్‌స్క్రైబ్ అయ్యాయి మార్కెట్ అంచనాల ప్రకారం, గరిష్ఠ ధరల శ్రేణి వద్ద ఎన్‌ఎస్‌ఇ ఐపిఒకు సుమారు 90,300కోట్ల విలువైన డిమాండ్ లభించినట్లు తెలుస్తోంది.

# నాలుగురోజుల లాభాలకు బ్రేక్




## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

**ముంబయి, సెప్టెంబరు 22:** దేశీయ స్టాక్ మార్కెట్లలో వరుసగా నాలుగు రోజులుగా కొనసాగిన లాభాల పరంపరకు మంగళవారం బ్రేక్ పడింది. కీలక సూచీలు నష్టాలతో ముగిశాయి. నిఫ్టీ 23,350 స్థాయి దిగువన ముగిసింది. ఐటీ, ఎఫ్‌ఎంసీజీ, పీఎస్‌యూ బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి మార్కెట్‌పై ప్రభావం చూపింది. మరోవైపు మెటల్, రియల్టీ షేర్లలో కొనుగోళ్లు కొంతమేర నష్టాలను తగ్గించాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలతో ఉదయం లాభాలతో ప్రారంభమైన మార్కెట్లు ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 డాలర్ల దిగువకు రావడం మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చింది. బిఎస్‌ఇ సెన్సెక్స్ 329.91 పాయింట్లు నష్టపోయి 74,529.08 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 50 సూచీ 85.30 పాయింట్లు తగ్గి 23,329 వద్ద స్థిరపడింది. అంతకుముందు వరుసగా నాలుగు సెషన్లలో నిఫ్టీ 1.28 శాతం లాభపడింది. నిఫ్టీని ప్రధానంగా కిందికి లాగిన షేర్లలో లార్సెన్ అండ్ టూబ్రో (0.98 నష్టం), భారతి ఎయిర్‌టెల్ (0.71 నష్టం), రిలయన్స్ ఇండస్ట్రీస్ (0.56 నష్టం) ఉన్నాయి. మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ విస్తృత మార్కెట్లో బిఎస్‌ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ స్వల్పంగా 0.02 శాతం లాభపడగా, బిఎస్‌ఇ 250 స్మాల్‌క్యాప్ సూచీ 0.25 శాతం నష్టపోయింది. మార్కెట్‌లో అడ్వాన్స్ డిక్లైన్ రేషియో ప్రతికూలంగా ఉంది. బిఎస్‌ఇలో 2,174 షేర్లు లాభపడగా, 2,189 షేర్లు నష్టపోయాయి. మరో 230 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. కమోడిటీ మార్కెట్లో నవంబర్ 2026 డెలివరీ బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 2.64 డాలర్లు తగ్గి 97.70 డాలర్లకు చేరింది. అమెరికా 10 ఏళ్ల ట్రెజరీ బాండ్ ఈల్డ్ 0.75 శాతం తగ్గి 4.927 శాతానికి చేరింది. భారత్‌లో 10 యేళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ ఈల్డ్ 0.62 శాతం తగ్గి 7.010 శాతానికి వచ్చింది. గత సెషన్‌లో ఇది 7.054 శాతంగా ఉంది. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి స్వల్పంగా బలపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 95.5800 వద్ద ట్రేడవగా, గత సెషన్‌లో ఇది 95.7800 వద్ద ముగిసింది. ఎంసీఎక్స్‌లో అక్టోబర్ 5, 2026 డెలివరీ గోల్డ్ ఫ్యూచర్స్ 0.39 శాతం తగ్గి రూ.1,52,500కు చేరాయి. మీషో 9.66 లాభంతో రూ.240.20,కోల్ ఇండియా 3.35 లాభంతో రూ.428.40,ట్రాన్స్‌రైల్ లైటింగ్ 14.44శాతం పెరుగుదల నమోదుచేసాయి.పేస్ డిజిటెక్ 9.12 శాతం లాభపడింది. ఆగ్మాంట్ ఎంటర్‌ప్రైజెస్: 4.81 క్షీణించింది. సింబయోటెక్ ఫార్మాల్యాబ్: 3.29 క్షీణత పుర్వాంకారా 0.52 లాభపడింది.

## డాలర్‌తో పోలిస్తే 13 పైసలు బలపడిన రూపాయి



**ముంబయి, సెప్టెంబరు 22:** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మంగళవారం ప్రారంభ ట్రేడింగ్‌లో 13 పైసలు బలపడి రూ.95.65కు చేరుకుంది. ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టడం, దేశీయ స్టాక్ మార్కెట్లలో సానుకూల పరిస్థితులు రూపాయికి మద్దతుగా నిలిచాయి. ఫారెక్స్ ట్రేడర్ల ప్రకారం సరఫరాకు సంబంధించిన తక్షణ ఆందోళనలు కొంత తగ్గడంతో బ్రెంట్ క్రూడ్ ధరలు ఇటీవల పెరిగిన స్థాయిల నుంచి వెనక్కి వచ్చాయి. సౌదీ అరేబియా హార్ముజ్ జలసంధి ద్వారా చమురు ఎగుమతులను పెంచడం, దెబ్బతిన్న ఈస్ట్‌వెస్ట్ పైప్‌లైన్‌ను కొంతమేర పునరుద్ధరించే అవకాశాలపై మార్కెట్లలో ఆశావహ పరిస్థితులు నెలకొనడంకూడా రూపాయికి అనుకూలంగా మారాయి. ఇంటర్‌బ్యాంక్ విదేశీ మారకద్రవ్య మార్కెట్‌లో రూపాయి 95.75 వద్ద ప్రారంభమై, ఆ తర్వాత 95.65 స్థాయికి చేరుకుంది. ఇది గత ముగింపుతో పోలిస్తే 13 పైసల లాభం. సోమవారం రూపాయి 18 పైసలు బలపడి డాలర్‌కు రూ.95.78 వద్ద ముగిసింది. కోటక్ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ రీసెర్చ్ హెడ్ అనింద్య బెనర్జీ మాట్లాడుతూ, రూపాయి ప్రస్తుతం పరిమిత శ్రేణిలోనే కదులుతోందని తెలిపారు. ముడిచమురు ధరలు తగ్గడం రూపాయికి ప్రధాన మద్దతుగా ఉండగా, ఫెడ్ వడ్డీ రేటు పెంపు తర్వాత డాలర్ బలపడటం, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడుల ఉపసంహరణ కొనసాగడం ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. రూపాయి డాలర్ మారకపు జంటకు 96.30 స్థాయిపై పరిమితిగా ఉండవచ్చని, ఈ స్థాయి సమీపంలో రిజర్వ్ బ్యాంక్ జోక్యం పెరిగే అవకాశం ఉందని బెనర్జీ తెలిపారు. 95.50, ఆ తర్వాత 95 స్థాయిల వద్ద రూపాయికి మద్దతు లభించే అవకాశం ఉందన్నారు. ప్రత్యేక డిపాజిట్‌ల ద్వారా ఏర్పడిన అదనపు లిక్విడిటీని బాండ్ విక్రయాలు, రివర్స్ రెపో వేలం ద్వారా రిజర్వ్ బ్యాంక్ చురుకుగా ఉపసంహరిస్తోందని, దీంతో మార్కెట్‌లో సర్దుబాటు క్రమబద్ధంగా కొనసాగుతోందని ఆయన వివరించారు. మరోవైపు, సోమవారం విడుదలైన ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశంలోని తొమ్మిది కీలక మౌలిక సదుపాయాల రంగాల ఉత్పత్తి ఆగస్టులో మూడు నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఆగస్టులో ఈ రంగాల ఉత్పత్తి వృద్ధి 4.8 శాతంగా నమోదైంది. బొగ్గు, సహజ వాయువు, ముడిచమురు, ఎరువుల ఉత్పత్తి తగ్గడం ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది.

## ఒక్కరోజే రూ.2.39 లక్షల కోట్లు పెరిగిన జుకర్‌బర్గ్ సంపద



**కాలిఫోర్నియా, సెప్టెంబరు 22:** ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా సిఇఒ మార్క్ జుకర్‌బర్గ్ సంపద ఒక్కరోజులోనే అమాంతం పెరిగింది. ఆయన ఏకంగా 25 బిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో సుమారు రూ. 2.39లక్షల కోట్లకుపైగా ఆర్జించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో మెటా ప్రకటించిన కొత్తప్రణాళికలతో కంపెనీ షేర్లు దాదాపు 12శాతం పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. ఈ భారీ పెరుగుదలతో జుకర్‌బర్గ్ మొత్తం సంపద సుమారు 253.6 బిలియన్ డాలర్లకు చేరినట్లు ఫోర్బ్స్ అంచనా వేసింది. ఈ అనూహ్య లాభంతో జుకర్‌బర్గ్ ఫోర్బ్స్ రియల్‌టైమ్ బిలియనీర్ల జాబితాలో ఆరవ స్థానానికి ఎగబాకారు. సోమవారం ట్రేడింగ్ సెషన్‌లో టెస్లా సిఇఒ ఎలాన్ మస్క్ సంపద 12 బిలియన్ డాలర్లు పెరగ్గా, జుకర్‌బర్గ్ అంతకుమించి లాభపడటం గమనార్హం. ప్రముఖ బ్రోకరేజ్ సంస్థ వెల్స్ ఫార్గో, మెటా షేర్ల టార్గెట్ ధరను 640 డాలర్ల నుంచి 796 డాలర్లకు పెంచడంతో ఇన్వెస్టర్లలో ఉత్సాహంపెరిగింది. మెటా ఇటీవల ప్రారంభించిన మ్యూజ్ అనే కొత్త ఎఐ ఏజెంట్‌కు వినియోగదారుల నుంచి మంచి స్పందన వస్తుండటమే ఈ సానుకూల అంచ నాలకు కారణమని వెల్స్‌ఫార్గో తన రిపోర్ట్‌లో పేర్కొంది. కేవలం ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వడమేకాకుండా వినియోగదారుల తరఫున పనులుకూడాచేసేలా మ్యూజ్‌ను రూపొందించారు. ఈమెయిల్స్ పంపడం, ప్రయాణ బుకింగ్స్‌చేయడం, ఇతర యాప్‌లతో సమన్వయం చేసుకుని టాస్క్‌లు పూర్తి చేయడం వంటివి ఈ ఎఐ అసిస్టెంట్ చేయ గలదు. ఈనెల 23, 24 తేదీల్లో జరగనున్న మెటా కనెక్ట్ 2026 వార్షిక సదస్సుపై పరిశ్రమ వర్గాల్లో ఆసక్తినెలకొంది. మెటా తమ ఎఐ ఏజెంట్లు, కొత్త సాఫ్ట్‌వేర్ ఫీచర్లు, స్మార్ట్ వేరబుల్ పరికరాల్లో సాధించిన పురోగతిని ప్రదర్శిస్తుందనిఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

## రూ.2వేల లోపు లావాదేవీలకు ఎలాంటి ఛార్జీలులేవు

### యుపిఐ చెల్లింపులకు జిఎస్టి ప్రచారంపై ఎన్‌పిసిఐ వివరణ




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 23:** యుపిఐ ద్వారా చేసే చెల్లింపుల్లో మర్చంట్ డిస్కౌంట్ రేట్‌పై జిఎస్టి విధిస్తారని, దీనివల్ల డిజిటల్ చెల్లింపులు ఖరీదుగా మారతాయని, ముఖ్యంగా చిన్న వ్యాపారులపై భారం పడుతుందని కొన్ని మీడియా మాధ్యమాలలో వస్తున్న వార్తలను నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఖండించింది. ఈ ఆందోళనలు పూర్తిగా అవాస్తవమని, అపోహలు మాత్రమేనని ఒక ప్రకటనలోస్పష్టం చేసింది. ఎండిఆర్ అనేది కేవలం రూ.2,000 కంటే ఎక్కువ విలువైన పర్సన్ టు మర్చంట్ లావాదేవీలకు మాత్రమేవర్తిస్తుంది. రూ.2,000 వరకు జరిపే లావాదేవీలకు ఎలాంటి ఎండిఆర్ లేనందున, వాటిపై జిఎస్టి ప్రభావం కూడా ఉండదని స్పష్టంచేసింది. ప్రభుత్వ గణాంకాల ప్రకారం దేశంలో జరిగే మొత్తం యుపిఐ మర్చంట్ లావాదేవీల్లో 96పైగా రూ.2,000 లోపువేనని, అందువల్ల అత్యధిక లావాదేవీలపై ఈ మార్పు ప్రభావం ఏమాత్రం ఉండదని పేర్కొంది. నెలకు లక్ష రూపాయల వరకు యుపిఐ ద్వారా చెల్లింపులు స్వీకరించే చిన్న వ్యాపారులు ఎండిఆర్ చెల్లించాల్సిన అవసరంలేదని, కాబట్టి వారికి జిఎస్టి సమస్యే ఉత్పన్నంకాదని తెలియజేసింది. ఒకవేళ రూ.2,000పైబడి లావాదేవీలు జరిపి ఎండిఆర్ చెల్లించే వ్యాపారులు దానిపై జిఎస్‌టి కట్టినా, ఆమొత్తాన్ని వారు విక్రయించే వస్తువులపై చెల్లించాల్సిన జిఎస్‌టి నుంచి మినహాయింపు (ఇన్‌పుట్‌ట్యాక్స్ క్రెడిట్) పొందవచ్చని వివరించింది. ఫలితంగా, వ్యాపారులపై జిఎస్‌టి భారం ఉండదని ఎన్‌పిసిఐ స్పష్టం చేసింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.